ది క్రైమ్ న్యూస్
Crime News
తెలుగు దినపత్రిక
ఆదివారం, ఏప్రిల్ 26, 2026 | సంపుటి - 20 | సంచిక 221 | వెల - 4రూ | పేజీలు - 12
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

# తెలంగాణలో వచ్చేది బిజెపియే

## కవిత పార్టీతో ఒరిగేదేమీ లేదు

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



హైదరాబాద్ : కల్వకుంట్ల కవిత నేడు తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పేరు ప్రకటించారు. ఇక కవిత కొత్త పార్టీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారని గుర్తు చేశారు. ఏ పార్టీ ప్రజల గురించి ఆలోచిస్తుంది.. అనేది ప్రజలు ఆలోచించాలని పిలుపునిచ్చారు. 12 ఏళ్ల పాలనలో నరేంద్ర మోడీ అవినీతి రహిత పాలన అందించారని చెప్పారు. 'గతంలో టీఆర్ఎస్.. ఇప్పుడు బీఆర్ఎస్ పుట్టబోయే బిడ్డ పేరు టీఆర్ఎస్ అంటా.. ఎన్ని పార్టీలు వచ్చినా.. ఎన్ని పార్టీలు ఉన్నా బీజేపీకి ఇబ్బంది లేదు..

2లో




## రాష్ట్రంలో మరో కొత్త పార్టీ..

# తెలంగాణ రాష్ట్ర సేన

## పార్టీ పేరు, జెండా, ఎజెండాను ప్రకటించిన కవిత

- తెలంగాణ కోసం పిడికిలి బిగించి కొట్లాడినం
- నా చెమటను చిందించి..పోరాటం చేశా
- సామాజిక తెలంగాణ కల సాకారం కాలేదు
- తెలంగాన కోసం పోరాడిన వారంతా మోసపోయారు
- మునుపటి కెసిఆర్..ఇప్పుడు లేడన్నది సత్యం
- పాలమూరు-రంగారెడ్డిని కూడా పూర్తి చేసుకోలేదు
- అందుకే ప్రజల పక్షాన..ప్రజల కోసం టిఆర్ఎస్‌తో వచ్చా

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భవించింది. కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ సభలో పార్టీ పేరును కవిత ప్రకటించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో ఉన్నమూడు పార్టీలు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం లేదన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల అవినీతి, కాంగ్రెస్ మోసం, బిజెపిల చేతగానితనం కారణంగా తెలంగాణ రాష్ట్రస సేన ఏర్పాటు తప్పలేదన్నారు. ఈ మూడు పార్టీలకు వ్యతిరేకంగా పోరాడడమే ఎజెండగా ఐదు ప్రధాన హామీలతో పాంచజన్యం పూరించారు.

2లో

### రాష్ట్రంలో కర్కోటకుడి పాలన

గురుకులాల్లో పిల్లలు చనిపోతున్న పట్టింపేదీ

రెండేళ్ల తర్వాత మనదే అధికారం

సిఎం రేవంత్ పాలనపై కవిత విమర్శలు

2లో

మిగతావి

### గుంటనక్కలు, తోడేళ్ల మధ్య కెసిఆర్ బందీ

మన మనిషి కాదు...మర మనిషిగా మారిన కెసిఆర్

గుంటనక్కలు, తోడేళ్ల మధ్య బందీగా కెసిఆర్

బిఆర్ఎస్ తెలంగాణ ఆత్మను కోల్పోయింది

టిఆర్ఎస్ అధినేత్రి కవిత విమర్శలు



# బెంగాల్లో మహిళలకు స్వేచ్ఛ

## రాత్రి ఒంటిగంట తరవాత కూడా స్వేచ్ఛగా రావచ్చు

## ఎన్నికల ప్రచారంలో కేంద్రహోంమంత్రి అమిత్ షా

కోల్‌కతా : ప్రస్తుతం బెంగాలీ మహిళలు భయంతో జీవిస్తున్నారని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. మహిళలు సాయంత్రం ఏడు తర్వాత బయటికి రావొద్దంటూ మమతా బెనర్జీ గతంలో చేసిన వ్యాఖ్యలను అమిత్ షా విమర్శించారు. మే ఐదో తేదీ తర్వాతి నుంచి పశ్చిమ బెంగాల్ మహిళలు రాత్రి ఒంటిగంట తర్వాత కూడా భయం లేకుండా రోడ్లపై తిరగొచ్చని అమిత్ షా పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పూర్బ బర్ధమాన్ జిల్లాలోని జమాల్‌పూర్ గ్రామంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా పాల్గొన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత విషయంలో విఫలమయ్యారని ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై విమర్శలు గుప్పించారు.

తరువాయి 2లో



2లో

## మే9న ప్రధాని మోడీ పర్యటన

రాష్ట్రంలో పలు ప్రాజక్టులకు ప్రారంభోత్సవాలు

హైదరాబాద్ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో వచ్చే నెల 9వ తేదీన పర్యటించనున్నారు. ప్రధాని పర్యటనలో భాగంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలోని

## మరో 47మంది అజ్ఞాత

# మావోల లొంగుబాటు

### గణపతి తదితరులు ఇంకా అజ్ఞతంలోనే ఉన్నారు

### తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్ : తెలంగాణలో మావోయిస్టు ఉద్యమం అంతిమదశకు చేరుకోవడంతో మిగిలిన వారు కూడా లొంగుబాట పట్టారు. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మొత్తం 47 మంది అజ్ఞాత మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో చేరారు. లొంగిపోయిన వారిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, అలాగే దక్షిణ బస్తర్ డివిజనల్

2లో




# తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1

### జెండా ఊపి ప్రారంభించిన సిఎం రేవంత్

హైదరాబాద్ : హైదరాబాద్ స్కైరూట్ ఏరోస్పేస్ వేదికగా దేశపు తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1 ప్రయాణం మొదలు కానుంది. ఇందులో భాగంగా మ్యాక్స్-క్యూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, పలువురు అధికారులు హాజరయ్యారు. శ్రీహరి కోటకు పంపనున్న రాకెట్ విక్రమ్-1ను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. ప్రీ పైలట్ పరీక్షలన్నింటినీ పూర్తి చేసుకొని తదుపరి ప్రయోగం కోసం.. సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌కు ఇది చేరుకోనుంది. ఇండియాలోనే తొలి ప్రైవేట్ రాకెట్ గా రికార్డుకెక్కిన విక్రమ 1 రాకెట్ ను ఫ్లాగ్ ఆఫ్ చేసి శ్రీహరి కోటకు పంపారు సీఎం రేవంత్ రెడ్డి. 2026 ఏప్రిల్ 25న శంషాబాద్ ఏరోస్పేస్ పార్క్‌లోని స్కైరూట్ సంస్థను సందర్శించారు సీఎం.

తరువాయి 2లో

## బిఆర్ఎస్‌లో ఉండి

# అవినీతిలో భాగస్వామ్యం

### ఇప్పుడు నీతి పలుకులు పలికితే ప్రజలు నమ్మరు

### సిఎం రేవంత్‌ను విమర్శిస్తే ఓట్లు రాలవు

### కవిత పార్టీపై ఎంపి చామల విమర్శలు



హైదరాబాద్ : బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే కవిత బయటకు వచ్చి పార్టీ పెట్టి ఉంటే ప్రజల్లో మంచి ఆదరణ వచ్చేదని కాంగ్రెస్ భువనగిరి లోక్‌సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు. అధికారంలో ఉండగా అవినీతిలో భాగస్వామ్యం అయిన కవిత ఇప్పుడు పార్టీ పెట్టి ప్రజలను ఎలా నమ్మిస్తామని అనుకుంటున్నారని ప్రశ్నించారు. కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై ఎంపి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పెట్టినందుకు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. అమ్మగా జేబులు చూసి కాదని..


తరువాయి 2లో

## పెట్రో కొరతపై సిఎం

# అత్యవసర సమీక్ష

### తక్షణం సమస్యను పరిష్కరించాలని ఆదేశం

### పెట్రో డీలర్లతో మాట్లాడిన అధికారులు




అమరావతి : రాష్ట్రంలో ఇంధన కొరతతో పలు చోట్ల పెట్రోల్ బంకుల మూసివేత అంశంపై అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం సమీక్ష నిర్వహించారు. పలు జిల్లాల్లో పరిస్థితులు, వాహనదారులు, రైతుల ఇబ్బందులపై అధికారులతో సీఎం మాట్లాడారు. సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎస్ సాయిప్రసాద్, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకుని ప్రజలకు ఇబ్బంది రాకుండా చూడాలని ఆదేశించారు. పెట్రోల్ బంకుల యజమానులు, ఆయిల్ కంపెనీలతో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. సీఎం ఆదేశాలతో వెంటనే స్పందించిన అధికారులు.. ఇంధన సరఫరాపై పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్‌తో ఫోన్‌లో చర్చలు జరిపారు. తక్షణం స్టాక్ లేని బంకుల వివరాలు అందించాలని అధికారులు ఆదేశించారు.

తరువాయి 2లో

## పోలవరం ద్వారా

# గోదావరి జలాల తరలింపు




### ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలు

### అనకాపల్లి పరిశ్రమలకు ఇదే ఆధారం

### మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి

కాకినాడ : ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలు తీర్చడంలో గోదావరి జలాలు ఎంతో కీలకమని మంత్రి నిమ్మల రామా నాయుడు అన్నారు. ఉత్త రాంధ్రకు గోదావరి జలాలు తరలించేందుకు పోలవరం ఎడమ కాలువే ప్రధాన ఆధారమన్నారు. అనకాపల్లి కేంద్రంగా వస్తున్న భారీ పరిశ్రమలకు నీటి సమస్య లేకుండా గోదావరి జలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కాకినాడ పంపా ఆక్విడక్ట్ వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను మంత్రి నిమ్మల పరిశీలించారు. ఆరెంపూడి, గవరయ్య కోనేరు గ్రామాల దగ్గర హైవే క్రాసింగ్ వంతెనల నిర్మాణ పనులనూ మంత్రి నిమ్మల పర్యవేక్షించారు.

2లో

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం

### ఈగిల్‌లో డేటాసెంటర్ ఏర్పాటు

### ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా




అమరావతి : డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు అతి త్వరలో ఈగల్‌లో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడించారు. శనివారం మంగళగిరిలో ఈగల్ హెడ్ క్వార్టర్స్‌ను ఆయన ప్రారంభించారు.

తరువాయి 2లో

# రాష్ట్రంలో కర్కోటకుడి పాలన

హైదరాబాద్ : ఇది ప్రారంభం మాత్రమే, ఇన్‌ఫ్రంట్ దేరీజ్ క్రొకడైల్ ఫెస్టివల్ అని కొత్తగా టీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర సేనను ప్రకటించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్రంలో ఒక కర్కోటకుడి పాలన నడుస్తోందని.. ఒక రాజకీయ నేతను అలా అనకూడదు.. కానీ, అనాల్సి వస్తుందన్నారు. గురుకులాల్లో పిల్లలు చనిపోతున్నా.. సీఎం మాట్లాడట్లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. అందుకే కర్కోటకుడని అంటున్నాం.. ఇప్పుడు మనమే ప్రధాన ప్రతిపక్షం, రెండేళ్ల తర్వాత మనదే అధికారమన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో కొత్త పార్టీ పేరు ప్రకటించిన ఆమె రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పాంచజన్యం పేరుతో ఐదు హామీలు ప్రకటించారు. ప్రభుత్వ స్కూళ్లను బలోపతేం చేస్తూనే ప్రైవేట్ స్కూళ్లలో కూడా ఫ్రీగా విద్య అందిస్తాం.. ఏ రోగమైనా రానీ, ఏ ఆస్పత్రైనా సరే ఉచితంగా అందిస్తాం.. వ్యవసాయం: రైతే రాజు అన్న నినాదాన్ని నిజం చేస్తాం.. ఉపాధి: రూ.2 లక్షల-రూ.20 కోట్ల వరకు యువతకు రుణాలు..ప్రభుత్వం దా÷-వారానే అందిస్తాం. మొదటి ఏడాదిలోనే సింగిల్ నోటిఫికేషన్‌లో 4 లక్షల ఉద్యోగాలు నియమిస్తాం. ఉద్యమకారుల కు లక్ష సూపర్ న్యూమరీ ఉద్యోగాలు ఇస్తాం.. . సామాజిక న్యాయం సాధించాల్సిందే' అని ప్రకటించారు. అనంతరం బీఆర్ఎస్, కేసీఆర్ గురించి కవిత మాట్లాడారు. 'మన కేసీఆర్ అయ్యింటే పాలమూరు ప్రాజెక్టును కట్టించేవారు. మారిన కేసీఆర్ పంజాబ్ వెళ్లారు. జాతీయ పార్టీ పెడతానని చెప్పారు. సింగరేణిలో గనిలో కార్మికుడు చనిపోతే చూసొచ్చే వ్యక్తి. కేసీఆర్ రాజకీయ పరిణితి కోల్పోయారు. కేటీఆర్ మాట్లాడారంటే అనుకోవచ్చు. ఆయనకు రాజకీయం తెలియదు. ఒక కర్కోటకుడి పాలన నడుస్తోంది. ఇళ్లను కూల్చుతుంటే ఆదుకోవాల్సిన అమ్మలాంటి కేసీఆర్ ఎక్కడున్నారు..? మారుతారేమోనని చూశా.. కానీ, నన్నే సస్పెండ్ చేశారు. ఉద్యమకారులను పార్టీ నుంచి బయటకు పంపిన రోజే తాను మాట్లాడాల్సింది. కానీ, మాట్లాడలేదు.. ఇవాళ నాకు అదే జరిగింది. ఉద్యమంలో కొట్టినవారినే తీసుకొచ్చి పట్టం కట్టారు. వాళ్ల అనుచరులు మనవాళ్లను అణగతొక్కారు. ఉద్యమకారులను నామినేటెడ్ పోస్టులు ఇచ్చినా సరిపోయేది. కండువా వేసుకొని అప్పుడు పిచ్చోల్లలాగా తిరిగాం. ఆ పార్టీలో అమ్మతనం పోయింది, మమకారం పోయింది. అందుకే కేసీఆర్ మన కేసీఆర్ కాదు. మరబొమ్మ అయ్యారు అని కవిత వ్యాఖ్యానించారు.

# గుంటనక్కలు, తోడేళ్ల మధ్య కెసిఆర్ బందీ

హైదరాబాద్ : గుంట నక్కల తోడేళ్ళ మధ్యలో బందీ అయిన మనిషి కేసీఆర్ అని కల్వకుంట్ల కవిత అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో కవిత తన కొత్త పార్టీ పేరు 'తెలంగాణ రాష్ట్ర సేన'గా ప్రకటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తన జీవితంలో మర్చిపోలేని రోజుగా అభివర్ణించారు. 'నేను అమ్మవారి భక్తురాలిని. నాకు సింగరేణి చాలా ఇష్టం. మీకంటే ఆడబిడ్డలంటే మరింత ఇష్టం. రాష్ట్రంలో అంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 20 ఏళ్లుగా తెలంగాణ జాగృతి ఎంతో కీలకంగా పనిచేసింది. బతుకమ్మ పాట వచ్చాక మన సంస్కృతికి ఊపిరి వచ్చింది. ఏమేమి కలలతో తెలంగాణ తెచ్చుకున్నామో ఆ కలలో నిజం కాలేదు. కేసీఆర్ పాలనలో ఆశించిన ఫలితాలు రాలేదు. బానిస సంకెళ్లు తెగుతాయనుకుంటే రైతులకు బేడీలు ఉద్యమకారులకు కేసులు వచ్చాయి. ఆనాడు పాలించిన కుటుంబంలో నేను ఒకదాన్ని. నాడు జరిగిన తప్పులకు క్షమించమని కోరుతున్నా. తెలంగాణ ప్రజల కలల సాకారం కోసం తెలంగాణ రాష్ట్ర సేన ఆవిర్భావించింది. రేపటి నుంచి చూస్తారు మా పని ఎలా ఉంటుందో మా పోరాటం ఎలా ఉంటుందో.' అని కవిత అన్నారు. బీఆర్ఎస్ పార్టీ గురించి కవిత సంచలన వ్యాఖ్యల చేశారు. ఆ పార్టీ తెలంగాణ ఆత్మను కోల్పోయిందన్నారు. అమ్మతనంతో పాలన సాగిస్తే ప్రజల కష్టాలు తెలుస్తాయని.. అనేకమంది తెలంగాణ రాష్ట్ర వచ్చిందన్నారు. నీళ్ల కోసం ఒక లక్ష ఇరవై ఒక్క వేల కోట్లు ఖర్చు పెట్టిందని.. 14 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చిందన్నారు. ఆనాటి కేసీఆర్ వేరు.. ఇప్పటి కేసీఆర్ వేరన్నారు. ఇప్పుడు కేసీఆర్ మారిన మనిషి.. మర మనిషి అన్నారు. 'ఆ సారు రారు.. గుంట నక్కల తోడేళ్ళ మధ్యలో బందీ అయిన మనిషి కేసీఆర్. కేసీఆర్ రాజకీయ పరిణితి కోల్పోయి మాట్లాడుతున్నారు. కేటీఆర్‌కు ఏమి తెలియదు కాబట్టి మాట్లాడరు అనుకుందాం. కానీ కేసీఆర్ ఎందుకు మాట్లాడట్లేదు. ఆనాడు టీఆర్ఎస్ కోసం, కేసీఆర్ కోసం కొట్లాడిన వాళ్లకు ఏమి దక్కింది? ఇది మన కేసీఆర్ కాదు.. నేను కాళేశ్వరంలో అవినీతి జరిగిందని చెప్పాను. నన్ను బయటకు పంపి.. పందికొక్కులను పక్కన పెట్టుకున్నారు. ఇప్పుడు మనమే ప్రతిపక్షం అవుతాం. రెండేళ్ల తర్వాత మనమే అధికార పక్షం అవుతాం' అని కవిత వ్యాఖ్యానించారు.

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం

అనంతరం డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. ఏడాదిన్నర క్రితం ఈగల్ వింగ్‌ను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశామన్నారు. పని తీరుతో ఈగల్‌కు దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని తెలిపారు. ఈగల్‌ను ప్రీమియర్ ఆర్గనైజేషన్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. గంజాయి పెంపకం, ఉత్పత్తిను నిరోధించేందుకు.. అలాగే ఎన్‌డీపీఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్సెస్) అమలు చేయడంలో ఈగల్ ముందుందని వివరించారు. గతంలో ఆక్టోపస్, గ్రేహౌండ్స్ తరహాలోనే ఈగల్ కూడా బాగా రాణిస్తుందని ఈ సందర్భంగా ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గంజాయి సాగు జీరో చేయగలిగారని చెప్పారు. భవిష్యత్తులో ఈగల్ టీం మరింత యాక్టివ్‌గా పని చేస్తుందని పేర్కొన్నారు. డ్రోన్లు, శాటిలైట్లతో గంజాయి నిర్మూలన చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం గంజాయి, డ్రగ్స్ వినియోగించే వారిపై ఫోకస్ పెడుతున్నామని ఏపీ డీజీపీ తెలిపారు. ఆ క్రమంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నా మన్నారు. డ్రగ్స్, గంజాయిని ఎవరు వినియోగిస్తున్నారు? ఎందుకు వినియోగిస్తున్నారనే కోణంపై దృష్టి సారించామని పేర్కొన్నారు. మొదటి దశలో 10 వేల టెస్టింగ్ కిట్స్ వినియోగించామన్నారు. అలాగే డ్రగ్స్ వినియోగించే వారు.. పేమెంట్స్ ఎలా చేస్తున్నారు? ఎక్కడ నుంచి వాటిని తీసుకు వస్తున్నారు? అనే విషయాలను కూడా పరిశీలిస్తున్నామని ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వివరించారు. డ్రగ్స్ ఫ్రీ సొసైటీ లక్ష్యంగా ఈగల్ చర్యలు చేపడుతుందని చెప్పారు. ఇంటర్ స్టేట్ డ్రగ్ నెట్ వర్క్‌లపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. 13 కొత్త ఎన్‌డీపీఎస్ కోర్టుల ఏర్పాటుపై ప్రతిపాదనలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏడు వేల డ్రగ్స్ కేసులు ఉన్నాయని.. అవి ట్రయిల్‌లో ఉన్నాయని గణాంకాలతో సహా డీజీపీ వివరించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఐ.జి రవికృష్ణతోపాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌లో ఉండి అవినీతిలో భాగస్వామ్యం

కడుపు చూసి పాలిస్తానని కవిత చెప్పారని ప్రస్తావించారు. శనివారం హైదరాబాద్ లో కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు జేబులు చూసి పరిపాలించారని కవిత చెప్పారని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో గతంలో టీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశారని ప్రస్తావించారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణను కేసీఆర్ హయాంలో దోపిడీ చేశారని ఎంపీ చామల ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలోని పదేళ్లు కవిత ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పంచుకునే వాటాల్లో తేడాలు వచ్చి ఆమె బయటకు వచ్చారని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని అన్నారు. కవిత ఇప్పుడు బయటకు వచ్చి సీఎం, సీఎం అని నినాదాలు చేయించుకుంటున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిని కర్కోటకుడు, హిట్లర్ అంటే కవితకు మార్కులు పడవని ఆక్షేపించారు. రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ, ఫ్యూచర్ సిటీ, ఉద్యోగాలు, మూసీ ప్రక్షాళన చేస్తున్నందుకు కర్కోటకుడు అయ్యారా...? అని ఫైర్ అయ్యారు. కవిత పార్టీ పెట్టుకోవచ్చని, పోరాటం చేయొచ్చని, ప్రజల్లోకి వెళ్లవచ్చని తెలిపారు. తెలంగాణను దోచుకోవడానికే ఆమె సీఎం కావాలని అంటున్నారా..? అని నిలదీశారు. కవిత నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తే స్వాగతిస్తామని తెలిపారు. ఆమె తెల్లకాగితం కాదని.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంపీగా, ఎమ్మెల్సీగా పని చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలను కవిత తప్పుదోవ పట్టిస్తున్నారని.. తెలంగాణ ప్రజలు ఆమెను నమ్మరని కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు.

# రాష్ట్రంలో మరో కొత్త పార్టీ.. తెలంగాణ రాష్ట్ర సేన

ఏ కలలతో తెలంగాణ తెచ్చుకున్నామో అవి నిజం కాలేదన్నారు. తను తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్నారు. జాగృతి కార్యకర్తలు తెలంగాణ సాంస్కృతిక దీపాన్ని పదిలంగా కాపాడుకున్నారని చెప్పారు. కాళరాత్రిలో కాగడా వలే తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి ఉద్యమకారులకు వెలుగునిచ్చింది. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారింది. మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నాం. ఇవాళ నా జీవితంలో మరిచిపోలేని రోజు అవుతుంది. తెలంగాణ భవిష్యత్ రాసుకోవడానికి మనందరి భాగస్వామ్యం కావాలి. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఉద్యమ రథం దారి తప్పింది. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయింది. సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించాం. కానీ, రైతులకు బేడీలు పడ్డాయి.. ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారు. ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం.. వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బతికింది. మనం అనుకున్న తెలంగాణ రాలేదనేది ముమ్మాటికీ వాస్తవం. ఆనాడు పరిపాలించిన కుటుంబంలో నేను కూడా ఒక భాగం. అందుకే కొన్ని విషయాల్లో సిగ్గుపడుతున్నా. తెలంగాణ ప్రజలను క్షమించాలని కోరుతున్నా అని ప్రకటించారు. తెలంగాణ సాధించినందుకు చాలా గర్వపడుతున్నా. జన్మధన్యమైందని భావిస్తున్నా. కానీ, తప్పులో నాకూ భాగం ఉన్నందుకు క్షమాపణ చెబితే సరిపోదు. సామాజిక తెలంగాణ కోసం నడుం బిగించి కష్టపడి పని చేయాలి. పని చేయడం కోసమే తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) ప్రజల ముందుకు వచ్చిందని అన్నారు. మా పని తీరు ఎలా ఉంటుందో ప్రజలు చూస్తారు. ప్రజలకు మంచి చేయాలంటే పోరాడితే సరిపోదు.. రాజకీయ అధికారం ఉండాలి. అది తోడైతేనే ప్రజలకు మంచి చేయగలం. ఏ పార్టీకైనా ఆత్మ, నేపథ్యం ఉండాలి. బీఆర్ఎస్ సాంకేతికంగా ఉన్నా ఆత్మను కోల్పోయింది. బీఆర్ఎస్ ఆత్మ కోల్పోయినందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చింది. నాటి టీఆర్ఎస్ కోసం నా రక్తం, చెమట, సమయం ధారపోశా. పార్టీ బలోపేతం కోసం పని చేశా. ఆనాటి కేసీఆర్ వేరు.. ఇప్పటి కేసీఆర్ వేరు. చేనేత కార్మికులు చనిపోతుంటే.. ఆనాటి కేసీఆర్ భిక్షాటన చేశారు. ఇవాళ్టి కేసీఆర్ మారిన మనిషి.. మర మనిషి.. మన మనిషి కాదు. ఎక్కడ చిన్న కష్టం వచ్చినా ఆ సార్ రారు.. ఎందుకంటే ఆయన మారిన మనిషి. గుంటనక్కలు, తోడేళ్ల చేతిలో కేసీఆర్ ఖైదీ అయ్యారు. పంజాబ్, గుజరాత్, బిహార్ వెళ్లి జాతీయ పార్టీ పెట్టాలని చూశారు. కేంద్రంతో గొడవ పెట్టుకోకుండా ఉండి ఉంటే పాలమూరు పూర్తయ్యేది. నేను ఎన్ని మాట్లాడినా బీఆర్ఎస్ నేతలు బయటకు వచ్చి జవాబివ్వట్లేదు. సమాధానం చెప్పకపోతే.. ప్రజలే బయటకు లాగి జవాబు చెప్పేలా చేస్తారని కూడా చిన్న హెచ్చరిక చేశారు. తెలంగాణలోని 3.5 కోట్ల మందికి అమ్మగా పరిణతి చెందాలనుకుంటున్నా. అమ్మతనంతో పాలన చేస్తేనే బిడ్డలకు కష్టం వస్తే తీరుస్తుంది. తెలంగాణలో ఏళ్ల తరబడి భూస్వామ్య వ్యవస్థ నడిచింది. ఎందరో మహనీయులు పోరాడితే కొంత సమానత్వం వచ్చింది. మలిదశ ఉద్యమంలో కేసీఆర్, ఉద్యమకారులు పోరాడితే కొత్త రాష్ట్రం వచ్చింది. రాజకీయ శక్తితో పోరాటాలు మిళితం చేసి సామాజిక న్యాయ తెలంగాణ సాధిస్తాం. భాజపాకి రాష్ట్ర ఏర్పాటే ఇష్టం లేదు. 'తల్లిని చంపారు.. పిల్లను బతికించారని' ఒకరు అన్నారు. భారత్, పాక్ విడదీసినట్లు తెలుగు రాష్ట్రాలను విభజించారని మరో ఎంపీ చెప్పారు. అయినా, భాజపా బానిస ఎంపీలు ఒక్క మాట మాట్లాడలేదు. తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే భాజపా ఎంపీలు మాట్లాడరు. విభజన హామీలు నెరవేర్చకపోతే భాజపా ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి భాజపా. తెలంగాణ భాజపా ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలని కవిత అన్నారు.

# పోలవరం ద్వారా గోదావరి జలాల తరలింపు

అనంతరం తుని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో పోలవరం ఎల్ఎంసీ పనుల పురోగతిపై అధికారులు, ఏజెన్సీలతో సమీక్ష నిర్వహించారు. జూన్ నాటికి మొదటి దశ పనులు పూర్తి చేసి అనకాపల్లి వరకు గోదావరి జలాలు తరలించాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. నేషనల్ హైవేల క్రాసింగ్ దగ్గర వంతెనల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. పనులు ఆలస్యం చేస్తే ఉపేక్షించేది లేదని అధికారులు, ఏజెన్సీలను మంత్రి సున్నితంగా హెచ్చరించారు. ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు గోదావరి జలాలు కీలకమన్నారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తరలించడానికి పోలవరం ఎడమ ప్రధాన కాలువే ఆధారమన్నారు. అనకాపల్లి కేంద్రంగా వస్తున్న భారీ పరిశ్రమలకు నీటి సమస్య లేకుండా ఈ నీటిని అందిస్తామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరం ఎడమ కాలువ కోసం ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని మంత్రి నిమ్మల ఆరోపించారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ పనులను ప్రీ క్లోజర్ చేసి ఉత్తరాంధ్ర ప్రజలపై జగన్ గత ప్రభుత్వం కక్ష్య కట్టిందని మండిపడ్డారు. పోలవరం ఎడమ కాలువ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కుల నుంచి 8,122 క్యూసెక్కులకు తగ్గిస్తూ ఉత్తరాంధ్ర ప్రయోజనాలకు నాడు జగన్ గండికొట్టారని మంత్రి నిమ్మల ఆగ్రహించారు. అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు మొదటి ప్రాధాన్యతగా పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తే, రెండో ప్రాధాన్యతగా లెఫ్ట్ కెనాల్ పనులను పరిశీలించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం రూ.1,460 కోట్లు ఖర్చు చేసి జూన్ నాటికి అనకాపల్లి వరకు గోదావరి జలాలు తీసుకెళ్లేలా పనులు పూర్తి చేస్తున్నట్లు మంత్రి నిమ్మల పేర్కొన్నారు. ఇప్పటివరకూ పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు 76 శాతం పూర్తి చేశామన్నారు. కుమ్మరిలోవలోని 472 కుటుంబాలకు తమ ప్రభుత్వం రూ.30.38 కోట్ల పరిహారం అందించినట్లు వెల్లడించారు. పోలవరం ఎడమ కాలువ మొదటి నుంచి తుని వరకు ఉన్న 110 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నిండి 28,557 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. పిఠాపురం అప్ టేక్ స్లూయిస్ నిర్మాణం పూర్తయితే 67,674 ఎకరాల ఏలేరు ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని నిమ్మల తెలిపారు. ఎడమ ప్రధాన కాలువ ప్రవహించే మార్గమధ్యంలో ఉన్న 143 గ్రామాలకు చెందిన 5.23 లక్షల మంది జనాభాకు తాగునీటి సౌకర్యం లభిస్తుందన్నారు. పాయకారావుపేటకి ఎగువన ఉన్న 98 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నిండటం ద్వారా 48,368 ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

# మరో 47మంది అజ్ఞాత మావోల లొంగుబాటు

కమిటీకి చెందిన కీలక నేతలు ఉన్నారు. ముఖ్యంగా హేమ్లా ఇతు (అలియాస్ విజ్జా), పోడియం లచ్చు (అలియాస్ మనోజ్) వంటి నాయకులు ఈ జాబితాలో ఉన్నారని డీజీపీ తెలిపారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు భారీగా ఆయుధాలు కూడా అప్పగించారు.మొత్తం 32 ఆయుధాలు, అలాగే 515 తూటాలు పోలీసులకు సమర్పించినట్లు డీజీపీ వెల్లడించారు. వీటిలో ఏకె-47, పలు రకాల రైఫిల్స్‌తో పాటు పిస్టల్స్, రివాల్వర్, మస్కెట్ గన్స్ వంటి వివిధ రకాల ఆయుధాలు ఉన్నాయి.తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస విధానం కారణంగా ఈ మావోయిస్టు కేడర్లు లొంగుబాటుకు ముందుకొచ్చారని చెప్పారు. దక్షిణ బస్తర్ డివిజన్ ప్రస్తుతం పూర్తిగా నిర్వీర్య స్థితికి చేరిందని కూడా డీజీపీ వ్యాఖ్యానించారు. లొంగిపోయిన వారిలో ఖఒఉం బెటాలియన్‌కు చెందిన 4 మంది, ఆఐ÷ూజిఅకు చెందిన 28 మంది, అలాగే 9వ, 30వ ప్లాటూన్‌లకు చెందిన 15 మంది ఉన్నారని వివరించారు. ఇక తెలంగాణకు చెందిన కొంతమంది కీలక మావోయిస్టు నాయకులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. వారిలో లక్ష్మణరావు (గణపతి), పసునూరి నరహరి (సంతోషం), జాడి రత్నాభాయ్ (సుజాత), వార్త శేఖర్ (మంగు) ఉన్నారని పేర్కొన్నారు. వీరిని కూడా లొంగిపోవాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టు ఉద్యమంపై తెలంగాణలో భద్రతా బలగాల చర్యలు మరింత ప్రభావం చూపుతున్నాయని డీజీపీ తెలిపారు. నజీవన స్రవంతిలో చేరి తెలంగాణ ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం ద్వారా లభించే అన్ని ప్రయోజనాలను పొందాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. గత రెండేళ్లలో తెలంగాణ పోలీసుల సమర్థవంతమైన పనితీరు వల్ల మొత్తం 818 మంది మావోయిస్టులు లొంగిపోగా, వారి నుంచి 334 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న మెరుగైన పునరావాస ప్యాకేజీలు, పోలీసులు సాగిస్తున్న అవగాహన కార్యక్రమాల వల్ల అడవి బాట పట్టిన వారు తిరిగి ఇంటికి చేరుకుంటున్నారని చెప్పుకొచ్చారు. ఈ భారీ లొంగుబాటుతో రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావం మరింత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

# పెట్రో కొరతపై సిఎం అత్యవసర సమీక్ష

దీంతో జిల్లాల అధ్యక్షులకు రాష్ట్ర డీలర్ల అసోసియేషన్ సమాచారం పంపించింది.స్టాక్ సమస్య ఉంటే తక్షణం టోల్‌ఫ్రీ నం.1967కు కాల్ చేయాలని పౌరసరఫరాలశాఖ కమిషనర్ సూచించారు. టోల్‌ఫ్రీకి ఫోన్ చేసి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. గత ఏప్రిల్ కంటే పదిశాతం అదనపు సరఫరాకు ఆయిల్ కంపెనీలు అంగీకారం తెలిపాయి. పెట్రోల్ డీలర్ల నుంచి ఏపీఎఫ్‌పీటీ అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ వివరాలు సేకరిస్తున్నారు. ఆయిల్ కంపెనీల సరఫరా తీరుపై క్షేత్రస్థాయి నివేదిక సమర్పణకు చర్యలు చేపట్టారు. పౌరసరఫరాలశాఖ కమిషనర్‌కు నివేదిక సమర్పించేందుకు అసోసియేషన్ ప్రతినిధులు కసరత్తు చేస్తున్నారు.

# తండ్రి పిట్టల దొర..బిడ్డ పిట్టల దొరసాని

## కవితకు రాజకీయ సమాధి కట్టిందే బిజెపి

## మీడియా సమావేశంలో నిజామాబాద్ ఎంపి అర్వింద్

హైదరాబాద్,ఏప్రిల్25 : సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టే.. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని కాదని బీజేపీని గెలిపించారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పిట్టల దొరను చూశారని.. ఇప్పుడు పిట్టల దొరసానిని చూస్తారని వ్యంగ్యంగా విమర్శించారు. కవితకు బీజేపీ రాజకీయ సమాధి కట్టిందని గుర్తు చేశారు. శనివారం కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పేరు ప్రకటించారు. ఈ సందర్భంగా కవిత పలు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పందించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం బీజేపీ మద్దతు లేకుండా వచ్చిందా? అంటూ కవితను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇండియా-పాకిస్తాన్ విభజన పక్రియలో ఎంతో మంది చనిపోయారని వివరించారు. వీళ్లు ప్రకటించి వెనక్కి తీసుకున్నారు కాబట్టే.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అనేక మంది చనిపోయారని చెప్పారు. ఇదే విషయంపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో ప్రస్తావించారని పేర్కొన్నారు. తేజస్వి వ్యాఖ్యలను బీఆర్ఎస్ కళ్ళద్దాలతో చూడకండంటూ రాజకీయ పార్టీల నేతలకు ఆయన స్పష్టం చేశారు. అజారుద్దీన్ అదృష్టం బాగుందని.. అందువల్ల ఆయన మంత్రి అయ్యారన్నారు. గవర్నర్ తీసుకున్న నిర్ణయం వల్ల అజారుద్దీన్ ఎమ్మెల్సీ అయ్యారని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. పిట్టల దొర క్యారెక్టర్ కేసీఆర్ అయితే.. పిట్టల దొరసాని క్యారెక్టర్ కవితది అన్నారు. సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టే ప్రజలు వాళ్లను ఓడించి బీజేపీని గెలిపించారన్నారు. ఆమెకు రాజకీయ సమాధి కట్టింది బీజేపీ అని చెప్పారు. ఏ పార్టీ ప్రజల గురించి ఆలోచిస్తుంది.. అనేది ప్రజలు ఆలోచించాలని పిలుపునిచ్చారు. 12 ఏళ్ల పాలనలో నరేంద్ర మోడీ అవినీతి రహిత పాలన అందించారని చెప్పారు.

# లిక్కర్ కేసులో సిట్ ముమ్మర దర్యాప్తు

## హైదరాబాద్‌లో మాజీమంత్రి కారుమూరి విచారణ

హైదరాబాద్,ఏప్రిల్25 : వైసీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరావును సిట్ అధికారులు శనివారం హైదరాబాద్‌లో విచారించారు. నాలుగు గంటల పాటు కారుమూరిని విచారించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. కారుమూరిని ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు విచారించారు. మద్యం రవాణా టెండర్ల జారీలో కారుమూరి పాత్రపై సిట్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సిట్ ఎస్పీ మీడియాతో మాట్లాడారు. ఏపీ లిక్కర్ స్కామ్‌లో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుని విచారించామని తెలిపారు. ఆయన వయసు 60 సంవత్సరాలు పైనే ఉండటంతో చట్టప్రకారం ఆయన కోరిన చోటే విచారించామని వెల్లడించారు. ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశామని సిట్ ఎస్పీ చెప్పుకొచ్చారు. విచారణకు ఆయన సహకరించారని.. అవసరమైతే మరోసారి విచారిస్తామని తెలిపారు. మద్యం రవాణా, టెండర్లు సబ్ కాంట్రాక్టుల అవకతవకల విషయంలో కారుమూరిపై, ఆయన కుమారుడిపై కేసు నమోదైందని చెప్పారు. మద్యం రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి రూ.200 నుంచి రూ. 250 కోట్ల వరకు గండి కొట్టినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయని అన్నారు. కారుమూరి కుమారుడు సునీల్‌ను సిట్ కార్యాలయంలోనే విచారిస్తామని స్పష్టం చేశారు. కోర్టు ఆదేశాల ప్రకారం సిట్ ముందు ఆయన కుమారుడు విచారణకు హాజరు కావాలని సూచించారు. అనారోగ్య కారణాలతో సునీల్ సమయం కోరారని.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సిట్ ఎస్పీ పేర్కొన్నారు.

# తెలంగాణలో వచ్చిదే బిజెపియే

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. టీఆర్ఎస్ అధినేత్రి కవిత పార్టీ ఆవిర్భావ సభలో బీజేపీపై ఫైర్ అయ్యారు. తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే బీజేపీ ఎంపీలు మాట్లాడటం లేదన్నారు. 'విభజన హామీలు నెరవేర్చకపోతే బీజేపీ ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి బీజేపీ. తెలంగాణ బీజేపీ ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలని కవిత పేర్కొన్నారు. బిజెపి ప్రజలకోసం పనిచేసే పార్టీ అని రామచంద్రరావు అన్నారు. పార్టీకి కేబర్, లీడర్ ఉన్న పార్టీ అన్నారు. కవిత పార్టీతో తెలంగాణకు ఒరిగేదేమీ లేదన్నారు.

## బెంగాల్లో మహిళలకు స్వేచ్ఛ

'ఒక మహిళా ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైన పాలనకు సంకేతమా?' అని ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లోనూ మహిళలు ధైర్యంగా ఉన్నారని, మే 5 తర్వాత బెంగాలీ మహిళల పరిస్థితి కూడా మెరుగుపడుతుందని అన్నారు. తల్లులు, సోదరీమణుల వైపు దురుద్దేశంతో చూసేందుకు ఏ దుండగుడు సాహసించినా, వారిని జైలులో పెడతామని భారతీయ జనతా పార్టీ హామీ ఇస్తుందన్నారు. గత పదిహేను సంవత్సరాల మమతా బెనర్జీ పాలనలో, అత్యధికంగా నష్టపోయిన వారు మన తల్లులు, సోదరీమణులే. బెంగాల్‌లో మహిళలపై ఎన్నో హింసాత్మక ఘటనల జరిగాయి. మహిళలు రాత్రి 7 గంటల తర్వాత ఇళ్ల నుంచి బయటకు రాకూడదని దీదీ అంటున్నారు. నేను మీకు చెప్పేదేమిటంటే.. 5వ తేదీ తర్వాత, యువతులు రాత్రి 1 గంట తర్వాత కూడా బయటకు రాగలరు. ఏ దుండగుడూ ఆమె వైపు చూడటానికి కూడా సాహసించడని అమిత్ షా హామీనిచ్చారు.

# మే9న ప్రధాని మోడీ పర్యటన

పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారని తెలుస్తోంది.అలాగే ఇప్పటికే పూర్తయిన కొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేసే కార్యక్రమాలు కూడా ఉండే అవకాశముంది. ముఖ్యంగా ఎంఎంటీఎస్ 2ను జాతికి అంకితం చేసే అంశం ఈ పర్యటనలో ప్రధానంగా ఉండొచ్చని సమాచారం. హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థను మెరుగుపరిచే ఈ ప్రాజెక్ట్ ప్రజా ప్రయాణానికి కీలకంగా మారనుంది. అలాగే ఎయిమ్స్ బీబీనగర్ ఆస్పత్రిని కూడా జాతికి అంకితం చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఆస్పత్రి తెలంగాణతో పాటు సమీప రాష్ట్రాల ప్రజలకు కూడా వైద్యసేవల్లో పెద్ద మార్పు తీసుకురానుంది. ఇవే కాకుండా రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నారని సమాచారం. రవాణా, కనెక్టివిటీ రంగాల్లో ఈ ప్రాజెక్టులు కీలకమని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఇక మరో అంశంగా మల్లారెడ్డి యూనివర్సిటీ పర్యటన కూడా ప్రధాని షెడ్యూల్‌లో ఉండొచ్చని చర్చ జరుగుతోంది. అయితే ఇది ఇంకా అధికారికంగా ఖరారు కాలేదని తెలుస్తోంది. ప్రధాని మోదీ పర్యటన తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభాలు, రవాణా మౌలిక సదుపాయాల విస్తరణ, ఆరోగ్య రంగంలో కొత్త సదుపాయాలపై కేంద్రీకృతమై ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రధాని అధికారిక షెడ్యూల్ పూర్తిగా ప్రకటించాల్సి ఉంది.

## తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1

ఆ సంస్థ తయారు చేసిన భారత తొలి ప్రైవేట్ కమర్షియల్ రాకెట్ విక్రమ్-1 గురించి తెలుసుకున్నారు. స్కైరూట్ సంస్థలో రాకెట్ తయారీ, టెక్నాలజీ తదితర అంశాల గురించి చర్చించారు. తొలి ప్రైవేట్ రాకెట్ తయారు చేసిన సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. రాకెట్ ను శ్రీహరికోట లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి లాంచ్ చేయనున్నారు. దీంతో సీఎం రేవంత్ జెండా ఊపి శ్రీహరి కోటకు పంపారు. హైదరాబాద్‌కు చెందిన స్పేస్‌టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్-1 భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ కమర్షియల్ ఆర్బిటల్ రాకెట్. 2025 నవంబర్‌లో ఈ రాకెట్ ను ఆవిష్కరించారు. 480 కిలోల బరువున్న ఉపగ్రహాలను తక్కువ భూ కక్ష్యలోకి తీసుకెళ్లగలదు దీనిని పూర్తిగా కార్బన్ ఫైబర్‌తో నిర్మించడం విశేషం. ఇది 3ఆ ప్రింటెడ్ ఇంజన్‌లను కలిగి ఉండి.. పూర్తిగా కార్బన్-్గ÷బైర్ బాడీ రాకెట్. కార్బన్్గ ÷బైర్ వాడటం వలన ఇది తేలికగా, బలంగా ఉంటుంది. సుమారు 300 - 480 కిలోల బరువున్న ఉపగ్రహాలను 500 కిలోమీటర్ల లో ఎర్త్ ఆర్బిట్ లోకి ప్రవేశపెట్టగలదు. 2026 లో త్వరలో అంతరిక్షంలోకి వెళ్లనుంది. భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ పేరు మీద ఈ రాకెట్‌కు 'విక్రమ్-1' అని పేరు పెట్టారు. ఇది పూర్తి స్వదేశీ సాంకేతికత తో, 100శాతం భారతదేశంలోనే తయారైంది.

## ఇంచార్జీ కార్మికశాఖ అధికారిగా మహమ్మద్ రఫీ....



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : పెద్దపల్లి ఇంచార్జీ కార్మికశాఖ అధికారిగా మహమ్మద్ రఫీ బాద్యతలు చేపట్టారు. ప్రస్తుతం రఫీ కరిం నగర్ అధికారిగా బాద్యతలు నిర్వర్తిస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే కారణంతో పెద్దపల్లి కార్మికశాఖ అధికారినిగా వ్యవహరించిన హేమలతను కార్మికశాఖ స్పెషల్ కమీషనర్ పమేళ సత్పతి సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జీ బాద్యతలు చేపట్టిన రఫీ మాట్లాడుతూ, పెండింగులో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తిచేస్తానని, ప్రజలకు సుపరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇదిలా ఉండగా నూతనంగా బాద్యతలు చేపట్టిన ఆయనకు కార్మిక సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## కరీంనగర్‌లో ఘనంగా 'హైలైట్స్ పార్టీ, కాఫీ లాంజ్' ప్రారంభం



కరీంనగర్ టౌన్,ఏప్రిల్ 25(ది క్రైమ్ న్యూస్) : నగరవాసులకు సరికొత్త వినోద, ఆహ్లాదకరమైన అనుభూతిని అందించేందుకు సిద్ధమైన 'హైలైట్స్ పార్టీ, కాఫీ,లాంజ్' శనివారం ఘనంగా ప్రారంభమైంది. నగరంలోని సాయి నగర్, ఆర్ బి గెస్ట్ హౌస్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ లాంజ్‌ను రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ కరీంనగర్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఇలాంటి ఆధునిక వసతులతో కూడిన లాంజ్‌లు అందుబాటులోకి రావడం శుభపరిణామమని అన్నారు. యువతకు, కుటుంబాలకు ఆహ్లాదాన్ని పంచేలా నాణ్యమైన సేవలు అందించాలని కోరుతూ లాంజ్ యజమానులకు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 32వ డివిజన్ కార్పొరేటర్ ఎస్.డి. ముఖద్దర్ హుస్సేన్, 59వ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ మజీద్ హుస్సేన్, 65వ డివిజన్ కార్పొరేటర్ మోసిన్ మోహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. లాంజ్ యజమానులు, సిబ్బంది విచ్చేసిన అతిథులకు ఘన స్వాగతం పలికారు.

## ఆల్‌ఇండియా ఎస్సీఎస్టీ ఐఖ్యవేధిక జిల్లాధ్యక్షుడిగా అమర్ నాధ్



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐఖ్య వేధిక పెద్దపల్లి జిల్లా ఆధ్యక్షుడిగా గాజర్ల అమర్ నాధ్ నియామితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శీ సమ్మయ్య నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కొరకు తనవతుగా పాటు పడతానని తెలిపారు. తనపై నమ్మకంతో కీలక బాద్యతలు అప్పగించిన రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

## పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేసేలా నిధులు కేటాయించాలి



**కేంద్రమంత్రి బండి సంజయ్ కు బీసీ సంఘం నేతల వినతి..**

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : జిల్లాలోని పర్యాటక, పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేసేలా నిధులు కేటాయించాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ కు బిసి సంఘం నేతలు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంఘం జాతీయ కోఆర్డినేటర్, సామాజిక ఉద్యమకారుడు ఆకుల స్వామీ వివేక్ పటేల్ మాట్లాడుతూ, పర్యాటకాభివృద్ధికి నోచుకొని పెద్దపల్లికి ప్రత్యేక పర్యాటక ప్యాకేజీ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని రామగిరిఖిల్లా, ధూళికట్ట బౌద్ధస్తూపం, సబ్బితం జలపాతం, ఓదెల మల్లన్న దేవాలయం, రామునిగుండాల వంటి పర్యాటక, పుణ్యక్షేత్రాలు అభివృద్ధి చేసేలా నిధులు కేటాయించాలని కోరారు. తమ కోరిక మేరకు స్పందించిన మంత్రి పర్యాటక అభివృద్ధి కొరకు తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నట్లు వివేక్ పటేల్ తెలిపారు.

# మేడే వారోత్సవాలను ఘనంగా నిర్వహించండి.

**గ్రామ గ్రామాన పల్లె పల్లెనా మేడే ఎర్రజెండా ఎగరాలి.**

**మేడే సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించండి.**

**- బందు సాయిలు, చెన్నూరి రమేష్,**



భూపాలపల్లి, ఏప్రిల్ -25:(ది క్రైమ్ న్యూస్) : సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ సిఐటియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అన్ని గ్రామాల్లో పల్లె పల్లెనా ఈ సంవత్సరం మేడే వారోత్సవాల్ని ఘనంగా నిర్వహించాలని సిఐటియు జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బందు సాయిలు, చెన్నూరి రమేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, అసంఘటితరంగా కార్మికులను పర్మినెంట్ చేయాలని, పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల్ని రక్షించాలని, కేంద్ర బిజెపి సర్కారు కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ సంవత్సరం కార్మిక వర్గం గ్రామ గ్రామాన పల్లె పల్లెనా సిఐటియు ఎర్రజెండాను మేడే సందర్భంగా కార్మికులందరినీ కలుపుకొని నిర్వహించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా మేడే సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు పల్లె పల్లెనా గ్రామ గ్రామాన ప్రతి మండలంలో జిల్లా కేంద్రంలో సాంస్కృతిక కమిటీల ఏర్పాటు చేసుకొని సంఘటిత ఆ సంగటితరంగా కార్మికులను కలుపుకొని వాడవాడనా ఆటలు పాటలు డాన్సులు క్రికెట్లు కబడ్డీ ఉపన్యాస పోటీలు వ్యాసరచన పోటీలు ఏకపాత్రాభినయాలు నాటికలు తదితర అభ్యుదయ గీతాలను నిర్వహించి ప్రైజులు ఇవ్వాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. 1886లో అమెరికా దేశంలోని చికాగో నగరంలో 8 గంటల పని దినం ఉండాలని పోరాటం చేసి హక్కులు సాధించుకుంటే సాధించుకుంటే నేటి బిజెపి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ కాలంలో 29 కార్మిక చట్టాలను నాలుగు కోట్లుగా చేసి పెట్టుబడుదారులకు అనుకూలంగా కార్మిక వర్గానికి వ్యతిరేకంగా కోడ్లను రూపొందించడం కార్మిక వర్గానికి అన్యాయం చేయడం తప్ప మరొకటి కాదు. ప్రభుత్వ రంగ పరిశ్రమలైన సింగరేణి, జనుకో లను పెట్టబడదారులకు అప్పగించి ప్రైవేటుపరం చేయడం తప్ప ఇంకో పని మోడీ ప్రభుత్వం చేయటం లేదని దుయ్యబట్టారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు బలపడితేనే కార్మికులకు రక్షణ ఉంటుందని అన్నారు. అదేవిధంగా బ్యాంకు, ఎల్ఐసి, లాంటివి కూడా మూసేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటిష్ కాలం నాటి నల్ల చట్టాలను తెచ్చి కార్మికులను కట్టు బానిసల్లాగా మార్చాలనేటువంటి ప్రయత్నం మోడీ సర్కారు మానుకోవాలని ఇతువు పలికారు. కార్మికులు చనిపోయిన ఎక్స్గ్రేషియాలో ఇవ్వటం లేరు, పెన్షన్ సౌకర్యం లేదు, వారసత్వ ఉద్యోగాలు లేవు, మట్టి ఖర్చులు లేవు, ఇన్సూరెన్స్ సౌకర్యం లేదు, పియ్యాపు ఈఎస్ఐలు లేవు, పర్మినెంట్ సౌకర్యం లేదు, ప్రభుత్వ పరమైన సంక్షేమ పథకాలు వర్తించటం లేదు, ఒక్కొక్కటి ఉన్న హక్కులన్నింటిని తొలగిస్తూ కార్మికుల మీద పెనుబారం మోపుతున్నారు. కష్టపడి పని చేసిన కార్మికుని శ్రమకు తగ్గ ఫలితం రావడం లేదు. ఉత్పత్తి పెంచి లాభాలు తెచ్చిన కార్మికునికి నష్టాలు తప్ప లాభాలు లేవు. అసంఘటితరంగా కార్మికులు అనేక రకాల సేవలు చేసిన ప్రభుత్వం గుర్తించడం లేదు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమిధం సమరశీల పోరాటాలు నిర్వహిద్దాం. ప్రజలందరినీ సంఘటితం చేద్దాం రైతులను , కూలీలు, సామాజిక వర్గాలను కలుపుకొని ఉద్యమించటం కోసం గ్రామ గ్రామాన పల్లె పల్లెనా మేడే జెండాలు ఎగరవేయండి ఆట పాట డ్యాన్సు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సిఐటియు జిల్లా కమిటీ శ్రేణులకు విజ్ఞప్తి చేస్తుంది. తద్వారా ప్రభుత్వ మీద ఒత్తిడి పెంచడానికి భవిష్యత్తులో సమరశీల పోరాటాలు నిర్వహించడానికి సన్నద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి కార్మికులు, జనకో కార్మికులు, గ్రామీణ అమాలి బజారు హామాలి, కూరగాయల హామాలి, మిల్లు హామాలి, అంగన్వాడీ టీచర్స్, ఆశాలు, మున్సిపాలిటీ కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, ఆటో కార్మికులు, బిల్డింగ్ కార్మికులు, ఆర్పీలు, షాపు గుమస్తాలు, రుక్షా కార్మికులు, హోటల్ కార్మికులు, రెస్టారెంట్ కార్మికులు, పెట్రోల్ బంకు కార్మికులు, గ్యాస్ గోదాం కార్మికులు, యానిమేటర్సు, మధ్యాహ్న భోజనం కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితర కార్మికులు మీరు ఉన్న ప్రాంతంలో మీ సమస్యలను రాసి ప్లే కార్డ్స్ పెట్టి జెండాలు ఎగరవేయండి సాంస్కృతిక కార్యక్రమాల సందర్భంగా మీ డిమాండ్లను ప్రదర్శించాలని తద్వారా ప్రభుత్వాలకు తెలిసే అటువంటి పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచుదామని అన్ని రకాల కార్మికులను కలుపుకొని పెద్ద ఎత్తున మేడే వారోత్సవాల్ని ఘనంగా నిర్వహించాలని కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు

## రోహన్ హాస్పిటల్ 25వ వార్షికోత్సవ కానుక 'దేవి పుత్రిక' పథకం ప్రారంభం



కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 25(ది క్రైమ్ న్యూస్) ప్రముఖ మహిళారోగ్య సంతాన సాఫల్య కేంద్రమైన 'రోహన్ హాస్పిటల్' తన 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సమాజంలో ఆడపిల్లల ప్రాముఖ్యతను చాటిచెప్పేలా ఒక అద్భుతమైన నిర్ణయాన్ని తీసుకుంది. హాస్పిటల్ యాజమాన్యం డా.ఎనమల్ల శ్రీదేవి నరేష్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, గైనకాలజిస్ట్, అబ్ స్ట్రేట్రిషియన్,డా. ఎనమల్ల నరేష్ ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ ఫిజిషియన్ ఈ సందర్భంగా 'దేవి పుత్రిక' అనే వినూత్న పథకాన్ని ప్రవేశపెట్టింది. 25 ఏప్రిల్ 2026 నుండి 16 జూన్ 2027 వరకు వర్తిస్తుంది అన్నారు. ఈ పథకం ద్వారా, రోహన్ హాస్పిటల్‌లో ఎవరైనా గర్భిణీకి ఆడపిల్ల జన్మిస్తే, వారికి పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్లు హాస్పిటల్ యాజమాన్యం ప్రకటించింది. అది సాధారణ ప్రసవం అయినా లేదా ఆపరేషన్ అయినా సరే, ఎటువంటి ఖర్చు లేకుండా వైద్య సేవలు అందుతాయని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యం మాట్లాడుతూ "గత 25 ఏళ్లుగా వేల సంఖ్యలో దంపతులకు సంతాన సాఫల్య భాగ్యాన్ని కల్పించడంలో మేము ముందున్నాము. మా ఈ ప్రయాణంలో మాపై నమ్మకం ఉంచిన ప్రజలకు కృతజ్ఞతగా, అలాగే ఆడపిల్లల పట్ల సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు 'దేవి పుత్రిక' పథకాన్ని ప్రారంభించాము. మా హాస్పిటల్‌లో మహాలక్ష్మి అడుగుపెడితే, ఆ ఆనందంలో మేము కూడా భాగస్వాములవుతూ ఉచిత సేవలు అందిస్తాము," అని తెలిపారు. ఈ సదుపాయాన్ని గర్భిణీలు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆత్మహత్యలు కాదు....పోరాడుతూ సాధించాలి: గంప వెంకన్న



గన్నేరువరం, ఎప్రిల్25(ది క్రైం న్యూస్):ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు కాకుండా శాతీయుతంగా పోరాడాలని కరీంనగర్ జిల్లా గన్నేరువరం బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంప వెంకన్న సూచించారు. నర్సంపేట ఆర్టీసీ డ్రైవర్ శంకర్ ను కోల్పోవడం అత్యంత బాధాకరమంటూ, ఆత్మబలిదానంపై ఆలోచన కలిగితే కుటుంబాలను గుర్తుచేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణా సాదకుడు కేసిఆర్ బాటలో శాంతియుతంగా సమస్యలపై పోరాడుతూ సాధించాలని సూచిస్తూ ప్రభుత్వం మొద్దు నిద్రను వీడి తక్షణమే ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను పరిశీలించకపోతే ఉద్యోగులకు అండగా నిలిచి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని గంప వెంకన్న ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం

**శ్రీ లక్ష్మి లాండ్రీ షాప్ లో కట్టలు కట్టలుగా నిజాయితీ నిజాయితీకి ప్యాంటు షర్టు వేస్తే బండి మొండయ్య**




రామగిరి, ఏప్రిల్ 25(ది క్రైమ్ న్యూస్):- కట్టలు కట్టలుగా నిజాయితీ, నిజాయితీకి ప్యాంటు షర్టు వేస్తే బండి మొండయ్య అని స్థానిక బిఆర్ఎస్ నాయకులు బూరుగురాజు గౌడ్ అన్నారు. శనివారం శ్రీలక్ష్మి చికెన్ సెంటర్ అండ్ లాండ్రీ షాప్ లో సెంటినరీ కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు మహమ్మద్ గులాం షమీ తన బట్టలు ఇస్త్రీ చేసుకోవడానికి శ్రీ లక్ష్మీ చికెన్ సెంటర్ అండ్ లాండ్రీ షాప్ కు వచ్చి లాండ్రీ షాపు యజమాని బండి మొండయ్యకు ఇచ్చి వెళ్ళాడు. అనంతరం మొండయ్య బట్టలు ఇస్త్రీ చేయడానికి ఓపెన్ చేయగా ప్యాంటు జేబులో 40, వేల రూపాయలు ఉండగా తక్షణమే బట్టలు ఇచ్చిన 'షమీని' అదేవిధంగా స్థానిక బిఆర్ఎస్ నాయకుడు బూరుగు రాజు గౌడ్ ను పిలిచి షమీకి 40,వేల రూపాయలు అందజేశాడు. ఈ సందర్భంగా బూరుగు రాజు మాట్లాడుతూ, ఈరోజుల్లో తొవ్వపొంటి పోతుంటే ఎవరి జేబులోనుండైన పది రూపాయల నోటు కింద పడితే ఎవరు చూడకుంటే తీసి జేబులో వేసుకుంటారని, అలాంటిది బండి మొండయ్య నిజాయితీకి నిలువుటద్దం లాంటివారని అదేవిధంగా సెంటినరీ కాలనీలో గత మూడు దశాబ్దాలుగా ఆయన సేవలు అందిస్తున్నారని, పేదవాడైనప్పటికీ నిజాయితీగా ఉండడం గొప్పతనం అని ఆయన ప్రశంసించారు. అదేవిధంగా నిజానికి రజకులు అంటే ఆడబిడ్డతో సమానమని గ్రామాలలో ఇప్పటికీ ఏ ఇంట్లో నైన ఏ శుభకార్యం, అపకార్యం, జరిగిన రజకులు లేనిదే జరగదని రజకులను తమ ఆడబిడ్డగా భావిస్తారని ఆయన కొనియాడారు. ఇలా బండి మొండయ్యను ఇక్కడి నాయకులతోపాటు రామగిరి వర్తక సంఘం అధ్యక్షులు ఆకుల నారాయణ, తదితరులు బండి మొండయ్యను అభినందనలతో ముంచెత్తారు.

## ఈషా ఫౌండేషన్ ఉచిత త్రోబాల్ శిక్షణా శిబిరం...:

**మహిళలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి: గూడూరి మమత**

మానకొండూర్, ఎప్రిల్25(ది క్రైం న్యూస్): కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మే నెలలో మహిళలకు ఉచిత త్రోబాల్ శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫౌండేషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'గ్రామోత్సవం' క్రీడా పోటీల్లో పాల్గొనేందుకై ఏర్పాటు చేసిన శిక్షణ ద్వారా త్రోబాల్ ఆటపై మెలకువలు, ప్రావీణ్యాన్ని పెంపొందించి పూర్తి అవగాహన కల్పించడమే కాక ఆత్మవిశ్వాసంతో క్రీడల్లో రాణించేలా త్వరలో జరిగే పోటీలకు సిద్ధమయ్యేందుకై మహిళలకు శిక్షణా ఎంతగానో ఉపయోగపడుతుందని సూచించారు. మే 20 నుండి 24 వరకు శికణ పూర్తిచేసి జూలై చివరి వారంలో 'గ్రామోత్సవం' క్లస్టర్ స్థాయి మ్యాచ్‌లను నిర్వహించనున్నామని, గ్రామాల్లోని 14సంవత్సరాలు పైబడిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, క్రీడా స్ఫూర్తితో గ్రామోత్సవంలో పాల్గొనాలని ప్రోగ్రాం ఇంచార్జీ గూడూరి మమత ప్రకటన ద్వారా కోరారు.

## కన్నాలలో శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

**-ఆరు రోజులపాటు వైభవంగా ఉత్సవాలు**



రామగిరి, ఏప్రిల్ 25(ది క్రైమ్ న్యూస్):- మంథని మండలం కన్నాల గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పంచాహ్నిక తిరుకళ్యాణ మహోత్సవాలు ఏప్రిల్ 26 ఆదివారం నుండి మే 1న శుక్రవారం వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు తెలిపారు. ఏప్రిల్ 26 ఆదివారం అభిషేకం, కలశస్థాపన, అఖండ దీపారాధన, అంకురారోపణ, దేవతాహ్వానం, ఏప్రిల్ 27 సోమవారం ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం 6:35 కు గోధూళి లగ్నంలో స్వామి వారి కళ్యాణం, ఏప్రిల్ 28 మంగళవారం నిత్యవిధి, సాయంత్రం గరుడసేవ, ఏప్రిల్ 29 బుధవారం సాయంత్రం పొన్నసేవ, ఏప్రిల్ 30 గురువారం దోపోత్సవం, మే 1 శుక్రవారం ఉదయం రథోత్సవం, నాగవెల్లి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరాభవ నామ సంవత్సరం, వైశాఖ శుద్ధ దశమి ఆదివారం నుండి ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలకు భక్తులందరూ కుటుంబ సమేతంగా హాజరై, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి, కృపకు పాత్రులు కావాలని ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు ఆహ్వానం పలికారు.

## సీజీఆర్ కార్యాలయం ప్రజలకు ఒక జనతా గ్యారేజ్

**ప్రజల సేవే మా లక్ష్యం.. వ్యక్తిగత విమర్శలు మానండి: గోవర్ధన్ రెడ్డి**



పటాన్‌చెరు(గుమ్మడిదల), ఏప్రిల్ 25(ది క్రైమ్ న్యూస్) : రాజకీయం అంటే ప్రజల కోసం పని చేయడమే గానీ, వ్యక్తిగత విమర్శలు చేయడం కాదని బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల తీరుపై ఆయన ఘాటుగా స్పందించారు. సీజీఆర్ కార్యాలయం సాధారణ కార్యాలయం కాదని, ప్రజల సమస్యలకు వెంటనే స్పందించే "జనతా గ్యారేజ్"గా పనిచేస్తోందని తెలిపారు. పార్టీలకు అతీతంగా 24 గంటలు ప్రజలకు సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా సీజీఆర్ కార్యాలయంలో పరిష్కారం లభిస్తుందని చెప్పారు. రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ పటాన్‌చెరులో ప్రజలు వారిని విశ్వసించలేదని, ఐదు మున్సిపాలిటీల్లో గులాబీ పార్టీ అభ్యర్థులనే గెలిపించారని అన్నారు. గుమ్మడిదల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ నాయకులకు సూచించిన గోవర్ధన్ రెడ్డి, ప్రజల్లో ఉండి పని చేస్తేనే విశ్వాసం వస్తుందని తెలిపారు. గతంలో కాటా శ్రీనివాస్ గౌడ్ సర్పంచ్‌గా ఉన్నప్పుడు ఎదురైన పరిస్థితులను గుర్తుచేస్తూ, తాము ఎప్పుడూ అలాంటి పరిస్థితులను ఎదుర్కోలేదని అన్నారు. పదవీకాలం పూర్తి చేసి మళ్లీ ప్రజల మద్దతుతో గెలుస్తున్నామని చెప్పారు. పటాన్‌చెరులో ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రజలకు అండగా నిలుస్తున్నారని, గుమ్మడిదలలో సీజీఆర్ నిరంతరం ప్రజాసేవలో ఉన్నారని పేర్కొన్నారు. జీఎంఆర్ తమకు పెద్దన్నలాంటివారని అన్నారు. ఓటమి, విజయం ప్రజల తీర్పేనని, అవసరం లేని రాజకీయాలు మానుకుని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజల సేవే తమ లక్ష్యమని, రాజకీయాల పేరుతో వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని గోవర్ధన్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్లు రాజశేఖర్, సంజీవరెడ్డి, కిషన్, సర్పంచ్ కొమ్ము శ్రీను, ఉప సర్పంచ్ యాదిరెడ్డి, నాయకులు దేవేందర్ రెడ్డి, సత్యనారాయణ, వెంకట్రాంరెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, జయపాల్ రెడ్డి, గోపాల్, బక్క సత్యనారాయణ, చిరుమని శ్రీనివాస్, సాయి రెడ్డి, భాస్కర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రవి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## పాంచజన్యం పూరించిన కవిత !

కల్వకుంట్ల కవిత..ఈ పేరు పెద్దగా పరిచయం అక్కర్లేదు. తెలంగాణలో కవిత అంటే బతుకమ్మ అన్న స్థాయిలో ప్రాచుర్యం పొందారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా దివిటీ పట్టి వెలగించారు. తండ్రి కెసిఆర్ ఒడిలో రాజకీయ ఓనమాలు దిద్దుకున్న కవిత..ఇవాళ తండ్రి పార్టీని ధిక్కరించి.. తండ్రినే ఎదిరించి.. నిలదీసే స్థాయిలో..కొత్తగా పార్టీని ప్రకటించి పాంచజన్యం పూరించారు. ఒక్కరోజు తేడాలో పాత టిఆర్ఎస్ అవిర్భావ దినోత్సవం జరుగనుంది. దానికి రెండ్రోజుల ముందు కవిత తన పార్టీ కోసం ఎంచుకున్న తేదీ యాదృచ్ఛికం కాకపోయినా...ముహూర్త బలం ఉండేవుంటుంది. ఓ మహిళగా కవిత మహిళా లోకానికి బాగా తెలుసు. బతుకమ్మతో తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటారు. తెలంగాణ ఉద్యమం లో మమేకం అయ్యారు. తెలంగాణ ఏర్పడితే అందరూ బాగుపడతారని నమ్మి అంతా కెసిఆర్ జెండా మోసారు. కానీ తెలంగాణ ఆగమయ్యింది. కెసిఆర్ కుటుంబం బాగుపడ్డది. అవినీతిలో ఆరితేరారు. లక్షల కోట్లు వెనకేసుకున్నారు. ఈ అవినీతి, తెలంగాణ ఆకాంక్షలను పక్కదారి పట్టించిన తీరుతోనే కెసిఆర్ పార్టీని ప్రజలు బొందపెట్టారు. టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చాక ఉన్న పేగుబంధం కూడా తెగిపోయింది. బిఆర్ఎస్ అవినీతిని ఎదరించిన రేవంత్ రెడ్డి కూడా ఇప్పుడు అదే దారిలో ప్రయాణిస్తున్నారు. రెండున్న రేళ్లు కావస్తున్నా..ఒక్కటంటే ఒక్క నిర్మాణాత్మక పని చేయలేదు. రేషన్ కార్డులు ఇచ్చాం..సన్న బియ్యం ఇచ్చాం..ఇదే పల్లవి. కానీ ప్రజల బాధ మరోలా ఉంది. ధాన్యం కొనడం లేదు. గిట్టుబాటు ధరలు రావడం లేదు. ఉద్యోగాలు దక్కడం లేదు. అవినీతి పెరిగింది. పైసా ఇవ్వనిదే ఫైలు కదలడం లేదు. కిందిస్థాయి నుంచి మంత్రుల వరకు అవినీతి అంటూ ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పేదల ఇళ్లను కూల్చేస్తున్నారు. వెలుగమట్ల ఘటన ఒక్కటి చాలు..పేదలను ఎంతగా రాచి రంపాన పెట్టారో అర్థం చేసుకోవచ్చు. 50శాతం ఉన్న మహిళలు. 50 శాతం ఉన్న దళిత,గిరిజన, బహుజనులకు రాజ్యాధికారంలో చోటులేదు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ...తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భావం అన్నది ఒక అవసరం. ఆవశ్యకత కూడా ఉంది. ప్రజల పక్షాన పోరాడాల్సిన పార్టీ ఒకటి ఇప్పుడు తక్షణా వసరంగా ఉంది. ఎందుకంటే రాజకీయ పార్టీలన్నీ తమ సొంత ఎజెండాతో పనిచేస్తున్నాయి. సొంత వ్యవహారాల కోసం పనిచేస్తున్నాయి. అన్నింటికి మించి అవినీతి, ఆశ్రిత పక్షపాతంలో కూరుకుపోయాయి. కేంద్రంలో అధికారం లో ఉన్న బిజెపి కూడా తెలంగాణకు చేసిందేమీ లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ ఊదరగొట్టుడే తప్ప నిలబడి తెలంగాణ పురోగతికి చేసిందేమీ లేదు. నిత్యం విమర్శలు తప్ప మరో ఎజెండా దానికి లేదు. అందుకే గత ఏడాదిగా ప్రజల్లో తిరుగుతూ..వారి సమస్యలను వింటూ..సమస్యలపై పోరాడుతూ వస్తున్న కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. గతంలో ఓమారు పార్టీ పెడతామని ప్రకటించిన సమయంలో పార్టీ పేరు గురించి అడిగితే ..అప్రయత్నంగానే టిఆర్ఎస్ పేరు కూడా ఖాళీగా ఉందన్నారు. అయితే అంతా టిఆర్ఎస్ పేరును ఓన్ చేసుకుంటుందని భావించారు. కానీ తెలివిగా టిఆర్ఎస్‌నే ప్రకటించినా..తెలంగాణ రాష్ట్రసేనగా ప్రకటించి ఆశ్చర్య పరిచారు. ఇది ఓ రకంగా బిఆర్ఎస్ పార్టీకి షాక్ లాంటిదే. టిఆర్ఎస్ పార్టీని పునరుద్ధరించాలనుకున్న ఆ పార్టీకి ఇదో అశనిపాతం లాంటిదే .నిజానికి గత టిఆర్ఎస్‌లో ఉంటూ.. తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్న కవిత మాటలు ముమ్మాటికీ నిజం. జాగృతి ద్వారా తెలంగాణ సాంస్కృతిక దీపాలను వెలిగించారు. తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి వెలుగునిచ్చింది. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారింది. మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నామంటే అందులో కవితనే కనిపిస్తారు. నిజానికి తెలంగాణ తెచ్చుకుంటే దరిద్రం పోతుందన్న భావనలో ఉండి పోరాడిన వారంతా ఆగమయ్యారు. ఆ కలలు నిజం కాలేదు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయింది. సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించిన వారంతా భంగపడ్డారు. పోరాటంలో ముందున్న కోదండరామ్ లాంటి వారు బయటకు తోయబడ్డారు. ఆయనే మరో పార్టీ పెట్టాల్సి వచ్చింది. కానీ ప్రజల మద్దతుల లేకపోవడంతో ఆయన ఇప్పుడు ఉనికి కోసం పాకులాడుతున్నారు. కాంగ్రెస్ చేస్తున్న అక్రమాలను ప్రశ్నించే శక్తి కూడా లేకుండా పోయింది. తెచ్చుకున్న తెలంగాణలో రైతులకు బేడీలు పడ్డాయి.. లాఠీలు విరిగాయి. ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారు. ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం గుప్పిట్లో బతికారు. వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బిక్కుబిక్కుమంటూ బతికింది. ఇవన్నీ కళ్లముందు కదలాడుతున్నాయి. బిఆర్ఎస్ పోయి కాంగ్రెస్ వచ్చినా మార్పు రాలేదు. మార్పు తెచ్చామని, స్వేచ్ఛను ఇచ్చామని ప్రకటించుకున్నా..అది సాకారంకాలేదు. సామాజిక తెలంగాణ అన్నది నినాదంగా మారింది. తెలంగాణలోని 3.5 కోట్ల మందికి అమ్మగా పరిణతి చెందాలనుకుంటున్న కవిత కష్టపడితే..ఆ పేరు సంపాదించుకోవచ్చు. కేవలం నినాదాల కోసం కాకుండా ప్రజలను అక్కున చేర్చుకునే అమ్మగా మారితే ప్రజలు బ్రహ్మరథం పడతారు. తెలంగాణ ప్రజలు నమ్మితే ప్రాణం ఇస్తారు. ఉద్యమకారులు పోరాడితేనే కొత్త రాష్ట్రం వచ్చింది. అది గుర్తించి కవిత అడుగుల వేయాల్సి ఉంటుంది. మాటలు చెప్పడం వేరు, అందుకు అనుగునంగా అడుగుల వేయడం వేరు. రాజకీయాల్లో చిరస్థాయిగా నిలవాలంటే నిబద్ధత ముఖ్యం. నిజాయితీ అవసరం. నిలబడే ధైర్యం కావాలి. ప్రజలను ఆకట్టుకునే ప్రసంగాలే కాదు..పనులు చేసే ధైర్యం కనిపించాలి. కవిత ప్రకటించిన ఐదు సూత్రాలను ఆచరణలో పెడితే అద్భుతాలు సాధించవచ్చు. అందుకు కావాల్సిందల్లా ప్రజల పక్షాన పోరాడడం. ఎన్నికలకు మరో రెండేళ్లు గడువు ఉంది. మహిళా రిజర్వేషన్లు కూడా వస్తున్నాయి. మహిళలను, బడుగు బలహీనవర్గాలను రాజ్యాధికారంలో భాగం చేసేలా ప్రణాళికలు రచిస్తే కవిత తప్పకుండా విజయం సాధిస్తారు. రాజకీయ పార్టీగా ముందు నిలబడతారు. అవినీతి లేకుండా సాగుతారన్న నమ్మకం కూడా ముఖ్యం. అందుకు వీరిందరినీ కలుపుకుని పోవడంతో పాటు, గుంటనక్కలను ఎదుర్కొనే చాణక్యం కూడా ముఖ్యం.

# దీదీ పాప్యులారిటీ గెలిపిస్తుందా?



పశ్చిమబెంగాల్‌లో ఇదివరకెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో మొదటి దశ పోలింగ్‌లో అత్యధికంగా 92 శాతం ఓటింగ్ జరగడం ఎవరికి వారే గెలుపు మాకే అన్న ఆశల పల్లకీలో ఊగుతున్నారు. ఈ మొదటి దశ నియోజకవర్గాల పరిధిలో ఓటర్ల జాబితా సవరణ తర్వాత 9.9 శాతం నుండి 11.6 శాతం వరకు ఓటర్ల పేర్లు తొలగించడంతో ఓటర్ల సంఖ్య తగ్గిపోయినప్పటికీ పోలింగ్ శాతం మాత్రం ఎక్కువగానే నమోదు కావడం విశేషం. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గాల పరిధిలో తృణమూల్ కాంగ్రెస్ 92, బిజెపి 59 స్థానాలు సాధించుకున్నాయి. అప్పటి ఎన్నికలకు ఇప్పటి ఎన్నికలకు చాలా తేడా కనిపిస్తోంది. మొత్తం 294 సీట్లకు తానే తృణమూల్ అభ్యర్థినని, తమ అభ్యర్థులపై అసంతృప్తి ఉన్నా తనపై నమ్మకం ఉంచాలని ఉధృతంగా ఆమె ప్రచారం సాగించారు. ఆమె పాప్యులారిటీ ఎన్నికల ప్రచారంలో కేంద్ర బిందువు అయింది. అయితే ఎంతవరకు ఈ పాప్యులారిటీ ఓట్లను కురిపిస్తుందో చెప్పలేం. రాష్ట్రంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎన్నో లోపాలు ఉన్నాయి. ఇవన్నీ విస్మరించి ఆమె మద్దతుదారులు అలాగే కొనసాగుతారా అన్నది ప్రశ్న. టిఎంసి గత పదిహేనేళ్ల పాలనలో పారిశ్రామిక వృద్ధి లేదు సరికదా క్షీణత కనిపిస్తోంది. రుణభారం ఎక్కువైంది. నిరుద్యోగం తాండవిస్తోంది. పాలనలో అవినీతి ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయి. పార్టీ అంతర్గత సమస్యలు, హింసాత్మక సంఘటనలు తీవ్రంగా సాగుతున్నాయి. ఇంతటి గందరగోళంలో కూడా ప్రజలు మమతా బెనర్జీ వ్యక్తిగత నాయకత్వాన్ని లేదా ప్రతిష్ఠను పొగుడుతున్నారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వ పాలనను తిడుతున్నారు. మమత వేరు, పార్టీ వేరు, ప్రభుత్వం వేరు అని విడివిడిగా ప్రజలు చూస్తున్నారు. ఈ రెండురకాల విభిన్న అభిప్రాయాలు సమాంతరంగా సాగుతున్నాయి. అందుకని ప్రజల తీర్పు ఎలా ఉంటుందో చెప్పలేం. బెంగాల్ వీర వనితగా, రక్షకురాలిగా, పోషకురాలిగా ప్రజలు భావిస్తూ దీదీ అని సంబోధిస్తున్నారు. ఆమె ఏదిచేసినా బెంగాల్ ప్రయోజనాల కోసమే అన్న నమ్మకం చెక్కుచెదరలేదు. ఓటర్ల జాబితా సవరణలో జరిగిన తప్పులపై ఆమె మడం తిప్పకుండా పోరాటం సాగించారు. చివరకు సుప్రీం కోర్టు ముందు ఆమె స్వయంగా వాదించడం విశేషం. కరోనా మహమ్మారి తీవ్రంగా విజృంభిస్తున్న సమయంలో 2021 నాటి అసెంబ్లీ ఎన్నికల్లో 82.30 శాతం పోలింగ్ జరిగింది. మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు 213 స్థానాలను తృణమూల్ కాంగ్రెస్ సాధించుకుని అధికార పీఠాన్ని రెండోసారి కైవసం చేసుకుంది. గురువారం 3.6 కోట్ల మంది ఓటర్లు ఓటు వేసినట్టు రికార్డయి 92.25 శాతం పోలింగ్ నమోదైంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పశ్చిమబెంగాల్ తోపాటు తమిళనాడులో కూడా అత్యంత ఎక్కువ శాతం పోలింగ్ ఇదేనని చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. ఈసారి ఎన్నికల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియ నిర్వహించడంలో ఎన్నో వివాదాలు, అనుమానాలు తలెత్తినప్పటికీ మొట్టమొదట 63 లక్షల ఓటర్ల పేర్లను తొలగించి, తరువాత న్యాయ పరిశీలనలో 27 లక్షల ఓటర్లు అనర్హులని ప్రకటించినా, పోలింగ్ ఎక్కడా పలచబడలేదు. మొదటి దశ ఎన్నికలకు ముందు గత వారం ఏడు లక్షల కొత్త ఓటర్లను చేర్చుకోవడమైందని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. పోల్ అధికారుల వివరాలు ప్రకారం మొదటి దశలో 3.22 లక్షల కొత్త ఓటర్లు ఓటు వేసి ఉంటారని భావిస్తున్నారు. మిగతా దాదాపు 3.88 లక్షల ఓటర్లు రెండో దశ పోలింగ్‌లో ఓటు వేయగలరని అంచనాగా చెబుతున్నారు. ముర్షిదాబాద్‌తో కలుపుకుని, ఉత్తర 24 పరగణాలు, మాల్డా, నాడియా, దక్షిణ 24 పరగణాలలో అనేక జిల్లాల్లో రికార్డు స్థాయిలో ఓటరు జాబితాలోంచి పేర్లు తొలగించబడ్డాయి. కోల్‌కతాలో అనేక నియోజకవర్గాలకు చెందిన దాదాపు 7 లక్షల ఓటర్లు జాబితా లోంచి తొలగించబడ్డారు. నగరంలోని ఉత్తర, దక్షిణ సెగ్మెంట్లలో ఓటరు సంఖ్య బాగా తగ్గింది. ఫ్యాక్టరీల్లో భగ్గుమంటున్న 'భద్రత' బీహార్‌లో సర్ ప్రక్రియ తరువాత అంతకు ముందు ఎన్నికల కన్నా ఓటర్ పోలింగ్ శాతం 2025 అసెంబ్లీ ఎన్నికల్లో బాగా పెరిగింది. బీహార్‌లో 2015 లో 56.91 శాతం, 2020లో 57.29 శాతం పోలింగ్ జరగ్గా, 2025లో 67.13 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాను సవరించిన తరువాత కొన్ని లక్షల పేర్లను తొలగించారు. ఈ ప్రక్రియపై ఎన్నో విమర్శలు వచ్చినప్పటికీ, ఖరారైన సంఖ్యతో బీహార్‌లో గత కొన్ని దశాబ్దాలలో లేని విధంగా అత్యధికంగా ఓటింగ్ జరగడం, స్వచ్ఛమైన ఓటర్ల జాబితాతోపాటు బలమైన ఎన్నికల నిర్ణయంగా అభివర్ణిస్తున్నారు. బెంగాల్‌లో మొత్తం 294 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 152 నియోజకవర్గాలకే తొలిదశలో పోలింగ్ జరిగింది. సౌత్ దినాజ్‌పూర్‌లో 94.37 శాతం అత్యధికంగా పోలింగ్ జరిగింది. కూచ్‌బీహార్‌లో 93.73 శాతం పోలింగ్ జరిగింది. దేశం లోనే అత్యధికంగా పశ్చిమబెంగాల్‌లో పోలింగ్ శాతం జరగడానికి బలమైన పార్టీ క్యాడర్లు, జనాభా, సమాజ గమన శీలత, అధికంగా మహిళలు ఓటింగ్‌లో పాల్గొనడం ప్రధాన కారణాలుగా విశ్లేషిస్తున్నారు. టిఎంసి, బిజెపి ఈ ట్రెండ్ తమకే అనుకూలంగా ఉందని ఎవరికి వారే గొప్పగా ఊహించుకోవడం విశేషం. మొదటి దఫా ఎన్నికల్లో ప్రజలు బిజెపికి గట్టి దెబ్బతీశారని, తమ పూర్తి మద్దతు టిఎంసికి, మమత ప్రభుత్వానికే ఇచ్చారని, 152 స్థానాలకు గాను టిఎంసి కనీసం 125 స్థానాలైనా దక్కించుకుంటుందని 90 శాతం పోలింగ్ జరగడాన్ని ఉదహరిస్తూ టిఎంసి నాయకుడు కునాల్ ఘోష్ ధీమా వ్యక్తం చేశారు.

# టిఆర్ఎస్ ఆవిర్భావంతో బిఆర్ఎస్‌కు షాక్

### తమ బ్రాండ్ పోవడంతో నేతల్లో ఆందోళన

హైదరాబాద్ : తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడు పోసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ఆవిష్కరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ మీటింగ్‌లో కవిత తన కొత్త పార్టీ పేరు 'తెలంగాణ రాష్ట్ర సేనగా అంటే టిఆర్ఎస్‌గా ప్రకటించారు. పార్టీ పేరు బిఆర్ఎస్‌కు షాక్‌కు గురి చేసింది. శనివారం ఉదయం కవిత సర్వ మత ప్రార్థనలు చేశారు. బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి ర్యాలీగా బయల్దేరారు. గన్‌పార్కులో అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం నేరుగా సభా ప్రాంగణానికి చేరుకుని ఉదయం 10 గంటలకు పార్టీ పేరు ప్రకటించారు. అనంతరం.. పార్టీ జెండా విష్కరించారు. ఈ పార్టీ పేరు బీఆర్ఎస్‌ను బిగ్ షాక్‌కు గురి చేసింది. ఇదిలా ఉండగా.. పార్టీ ప్రకటించే సభా ప్రాంగణాన్ని తెలంగాణ కలలు ఉట్టిపడేలా డిజైన్ చేయడం ఆకట్టుకుంది. వరంగల్ కాకతీయ కళా తోరణం ఆకృతిలో ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం, తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు ఫులే, ఆచార్య జయశంకర్ విగ్రహాలను సైతం ఏర్పాటు చేశారు. ద్వారానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టారు. బిఆర్ఎస్‌ను మళ్లీ టిఆర్ఎస్‌గా మార్చే ఆలోచన ఉందని ఇటీవలే ఓ సందర్భంలో కెటిఆర్ అన్నారు. ఇప్పుడు టిఆర్ఎస్ ఆవిర్భావంతో వారికి షాక్ తగిలినట్లు అయ్యింది. అంతేగాకుండా తండ్రిని, అన్నను ఆమె టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. ఫాంహౌస్ వీడి కేసీఆర్ బయటకు రాకపోవడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నా. కేసీఆర్ రాజకీయ పరిణితి కోల్పోయారు. ప్రజల కోసం కొట్లాడాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఎక్కడ?. అధికారం వచ్చాక ఆయన మమకారం కోల్పోయారు. మారిన మరబొమ్మ కేసీఆర్. మాటల మనిషి, మర మనిషి, మారిన మనిషి కేసీఆర్. ఎక్కడ కష్టం వచ్చినా ఆ సారు రారు. గుంట నక్కల, తోడేళ్ల చేతిలో బందీ అయిన మనిషి. అదే మన కేసీఆర్ అయితే పాలమూరు దగ్గర కుర్చీ వేసుకుని మరీ పనులు పూర్తి చేసేవారు. కేసీఆర్ మారతారేమో అని చూశా. ఇళ్లు, భూములు అమ్ముకుని రాష్ట్రం కోసం పోరాటం చేసిన ఉద్యమకారులను ఏం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల మీద కర్రలతో దాడులు చేసిన వారికి పదవులు ఇచ్చారు. ఉద్యమకారులకి మర్యాద ఇచ్చారా?. కేసీఆర్ మారిపోయారు కాబట్టే నేను యుద్ధం చేస్తున్నా. మనకు ప్రాణాలు అడ్డంపెట్టి పోరాడే సైన్యం కావాలి. నేను ఏం తప్పు చేశానని నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కాళేశ్వరం మీద మాట్లాడితే సస్పెండ్ చేస్తారా?. అవినీతి చేసిన పందికొక్కులని కేసీఆర్ పక్కన పెట్టుకున్నారు అంటూ విమర్శలు గుప్పించారు.

# ఎంతయినా ఒరిజినల్ ..ఒరిజినలే

### కవిత పార్టీపై బిఆర్ఎస్ సెటైర్లు

### అసలు ఒరిజినలే లేదుగా అంటూ టిఆర్ఎస్ ప్రతిదాడి

హైదరాబాద్,ఏప్రిల్25 : కవిత పార్టీపై బీఆర్ఎస్ వ్యంగ్యంగా స్పందించింది. కవిత తన కొత్త పార్టీ పేరును టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సేన)గా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై స్పందించిన బీఆర్ఎస్.. ఎంతైనా ఒరిజినల్ ఒరిజినలే అని సెటైర్ వేసింది. కవిత పార్టీ పేరును కాపీ కొట్టిందని అర్థం వచ్చేలా ట్వీట్ చేసింది. సెటైర్‌గా ఒరిజినల్, డూప్లికేట్ కోల్గేట్, బిస్లెరీ ఫొటోలు షేర్ చేసింది బీఆర్ఎస్. ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే అంటూ బీఆర్ఎస్ పోస్ట్ చేసింది. అయితే టిఆర్ఎస్ అన్న ఒరిజినల్ పార్టీ కూడా ఇప్పుడు తమ వద్ద లేదన్న ఇంగితం కూడా బిఆర్ఎస్ గుర్తించలేదు. ఒరిజినల్ ఉంటే డూప్లికేట్ గుర్తించవచ్చారు. ఒరిజినల్ లేకుండానే బిఆర్ఎస్ విమర్శలు చేస్తోందని కొత్తగా ఏర్పాటైన టిఆర్ఎస్ నేతలు అప్పుడే విమర్శలకు పదను పెట్టారు. అంతేగాదు ఆయన ఫామ్‌హౌజ్నుంచి రారు అని కూడా కెసిఆర్‌పై సెటైలర్లు గుప్పించారు.


# ఖచ్చితంగా ముఖ్యమంత్రిని అవుతా

### గన్‌పార్క్ వద్ద అమరులకు కవిత నివాళి

హైదరాబాద్,ఏప్రిల్25 : చ్చితంగా ముఖ్యమంత్రి అయ్యి తీరుతానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణలో కొత్త విప్లవం మొదలైందని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఇవాళ పార్టీ ఆవిర్భావం సందర్భంగా.. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో భారీ సభ ఏర్పాటు చేశారు. ఆవిర్భావ సభకు ర్యాలీగా వెళ్తున్న కవితను మీడియా ప్రశ్నించగా.. ఈ మేరకు సమాధానమిచ్చారు. అంతకుముందు ఇంట్లో సర్వమత ప్రార్థనలు నిర్వహించిన కవిత.. తన భర్త, కుటుంబ సభ్యుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం గన్‌పార్కు వద్దకు చేరుకొని తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. అక్కడి నుంచి మునీరాబాద్‌కు ర్యాలీగా బయల్దేరారు.

# సత్యనిష్ఠే..ఏకైక మార్గం

'భావనమే' జీవనం. జీవ దేహం కేవలం ఒక ఉపకరణం. ఇంద్రియ గ్రహణం, ప్రజ్ఞ, ఉద్వేగాలు, అభ్యాసం, అస్తిత్వరూపం, నిర్ణయాలు, పట్టుదల, అనుభూతి విస్తృతి.. అన్నీ భావప్రపంచమే. అయితే .. ఈ భావప్రపంచం సత్య, శాంత, స్పష్ట సమర్థతతో, సుసంస్కారంతో సాగాలంటే.. శరీరం సంతులిత సమర్థతతో పనిచేస్తూ ఆరోగ్యంగా ఉండటం అత్యవసరం. కానీ, తగినంత ఆరోగ్యంగా ఉన్నవారిలో కూడా చాలావరకు భావప్రపంచం సమర్థతతో పనిచేయకపోవడం కీలకమైన సమస్య. అందులోనూ అధికారం, ధనం, విద్య (మేధస్సు) ఉన్నవారిలో ఈ దోషం ఉండటం సమాజానికి ప్రబలమైన సమస్య. భావప్రపంచాన్ని సంస్కార బలంతో నడుపగలిగింది సదా 'సత్యనిష్ఠ'. సత్యజీవనం.. విద్య. అసత్య జీవనం.. అవిద్య. దైనందిన మానవ జీవనం సత్యాసత్యాల 'మిశ్రమం'. 'సమానతా భావమయమైన' సరళ జీవనం, సమష్టి శాంతి, నిర్భయత, ఆరోగ్యం, కృషి, పరస్పర ఆదరణ, ఆధ్యాత్మిక సాధన, సంతృప్తి, ఆనందా నుభవం ఇవన్నీ అనివార్యంగా సత్యాన్ని ఆశ్రయించి సాగుతుంటాయి. 'ఆధిక్యతాభావమయమైన' సంపద్గత జీవనం, కాంక్ష , ప్రకృతిశోషణ, ఘర్షణ, హననం, ఆక్రమణ, ప్రాణ నష్టం, భయం ఇవి అసత్యాన్ని ఆశ్ర యించి సాగుతాయి. మానవ 'జీవితాన్ని శాసించవలసిన సత్యాలు.



ఆధ్యాత్మికం

# స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యం..

## కాంగ్రెస్ శ్రేణులు సమరోత్సాహంతో పనిచేయాలి: నీలం మధు ముదిరాజ్



పటాన్చెరు, ఏప్రిల్ 25(ది క్రైమ్ న్యూస్) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేలా ప్రతి కార్యకర్త సమరోత్సాహంతో పనిచేయాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని, ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. గత పాలనలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను అధిగమిస్తూ, ప్రస్తుతం పేదల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి వంటి పథకాలు ప్రజల్లో పార్టీపై విశ్వాసాన్ని పెంచాయని పేర్కొన్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న సిద్దిపేటలో మళ్లీ పార్టీ జెండా ఎగరవేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యకర్తలే పార్టీ బలం అని, కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు తప్పకుండా ఉంటుందని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. గ్రూపు రాజకీయాలకు తావు లేకుండా అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అభ్యర్థుల ఎంపికలో కష్టపడి పనిచేసే వారికే ప్రాధాన్యత ఉంటుందని, సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో క్లీన్ స్వీప్ సాధించడమే లక్ష్యమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం సిద్దిపేట పట్టణంలోని శ్రీ పెద్దమ్మ దేవాలయంలో జరిగిన కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక కాంగ్రెస్ నాయకులు చెంది శ్రీనివాస్, ఇబ్రహీం షా నివాసాల్లో తేనేటి విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భూధం లక్ష్మీ, మండల అధ్యక్షులు బిక్షపతి, బ్రహ్మ రామచందర్, కౌన్సిలర్లు ఎల్లమ్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు నారాయణ, కలియుద్దీన్, దాస్ అంజన్న, మార్క్ సతీష్ గౌడ్, పెద్దమ్మ ఆలయ గౌరవ అధ్యక్షుడు చింతమడక రాజయ్య, గుడి చైర్మన్ నాయిని శేఖర్, నిర్వాహకులు గడిల శ్రీనివాస్, సత్యనారాయణ, గుర్రాల శ్రీహరి, చాంది శ్రీనివాస్, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరోగ్య సంరక్షణపై ఉద్యోగులకు అవగాహన




రామగిరి, ఏప్రిల్ 25(ది క్రైమ్ న్యూస్):- ఆర్.జీ -త్రీ ఏరియాలోని ఓసిపి-టు ఉపరితల గని నందు శనివారం వైద్య-ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్య సంరక్షణ, వేసవి కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల పై ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ ఆఫీసర్ లిడాక్టర్ పద్మజలి వేసవికాలంలో ఉద్యోగులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానంగా ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉన్నందున ఆహారపు అలవాట్ల లో మార్పు రావాలన్నారు. మాంసాహారం, మద్యపానం, ధూమపానం జోలికి వెళ్లకపోవడం మంచిదని వారు అన్నారు. అంతేకాకుండా ఆరోగ్యం కోసం పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాతినిధ్య సంఘం ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, ఇంచార్జ్ మేనేజర్ సంపత్ కుమార్, పిట్ సెక్రెటరీలు సురేష్, రామిండ్ల మనోహర్, భద్రత అధికారి ఆసిఫ్ యాసిన్, సంక్షేమ అధికారులు ప్రీతి, కళ్యాణ్, తోపాటు ఇతర అధికారులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధి ప్రధాన ధ్యేయం

### - మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య




పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : పట్టణ అభివృద్ధి ప్రధాన ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య అన్నారు. శనివారం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ మల్లయ్య వార్డు కౌన్సిలర్లతో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆధ్వర్యంలో 4వ వార్డులో రైల్వే స్టేషన్ రోడ్డు హనుమాన్ నగర్ లో 30 లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణం, 5 వార్డులో 18 లక్షల రూపాయలతో వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మహిళా పోలీస్ స్టేషన్ వచ్చేవారికి రేకుల షెడ్డు మరియు టాయిలెట్స్ నిర్మాణం అలాగే 10వ వార్డులోని క్రిస్టియన్ స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణం చేయడం జరుగుతుందని అందుకు సహకరిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లకు, మున్సిపల్ కమిషనర్ కు, సిబ్బందికి పట్టణ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, కౌన్సిలర్లు కొమ్ము సుధాకర్,గుజ్జుల కుమార్,అక్కేపల్లి సుజాత క్రాంతి,పూదరి అనూష మహేందర్,మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్,వార్డ్ ఆఫీసర్లు శ్రీనివాస్, సాగర్,వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ లైన్ తొలగింపు పనులు పరిశీలించిన సర్పంచ్ పల్లె ప్రతిమ-పివి రావు

రామగిరి, ఏప్రిల్ 25(ది క్రైమ్ న్యూస్):- రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధి రాంనగర్ లో విద్యుత్తు లైన్ ల తొలగింపు ప్రక్రియ పనులను శనివారం సర్పంచ్ పల్లె ప్రతిమ-పివి రావు పరిశీలించారు. ఈ ప్రాంతంలో ఇందిరమ్మ గృహాల నిర్మాణం కు 11 కెవి విద్యుత్తు లైన్ లు అడ్డంకిగా మారాయి దీనితో వీటిని తొలగించాలని సర్పంచ్ జిల్లా కలెక్టర్, విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు దీనితో స్పందించిన అధికారులు 8 విద్యుత్ స్తంభాలు (9 మీటర్లవి) వేయడానికి నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న పొట్టి విద్యుత్ స్తంభాలను తొలగిస్తున్నారు, వీటికి 50 వాట్స్ వీధి దీపాలు బిగిస్తామని సర్పంచ్ ప్రతిమ పివి రావు తెలిపారు. ఇప్పటికే నర్సరీ నుంచి పోచమ్మ గుడి వరకు, ఆర్ అండ్ ఆర్ కాలనీలో 33 వాట్స్ వీధి దీపాలు ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ఉపసర్పంచ్ భాద్రపు ప్రవళిక ప్రశాంత్, వార్డు సభ్యులు అల్లి రమేష్, బత్తిని ప్రశాంత్, పున్నం మని తేజ ,జుట్టు యశోద, కార్యదర్శి గంగుల సంతోష్, కరోబార్ కొండపర్తి శ్రీనివాస్ ,స్థానిక నాయకులు సుంకర విజయ్,పబ్బ మొగిలి, భోగి సతీష్,కెక్కర్ల మోహన్, వేముల రాజు, అమరగొండ శ్రీనివాస్, ఓదెలు, కొదురుపాక భీమయ్య, పెట్ల శేఖర్, నూనె రామచందర్, సింగ్ లు పాల్గొన్నారు.





## అంతర్గాం తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను మే 30లోపు పూర్తి చేయాలి -- ప్రతి ఓటరికి ఆధారాలు తప్పనిసరి**

**అనవసర తొలగింపులు చేయొద్దు -- ఖచ్చితమైన వివరాలతో మ్యాపింగ్ నిర్వహించాలి**

**పెద్దపల్లి ఐటీఐ కళాశాలలో ఓటర్ మ్యాపింగ్ పరిశీలన**



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : జిల్లాలో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను ఖచ్చితంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. శనివారం అంతర్గాం తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, కార్యాలయ పనితీరును సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుతున్న సేవలు సమయానికి, పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మొగల్ పహాడ్ గ్రామ భూ సేకరణ ఎన్.టీ.పి.సి. అంశానికి సంబంధించి కొంతమంది రైతులు సమర్పించిన అభ్యంతరాలపై విచారణ చేసిన వివరములను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ తూము రవీందర్ పాల్గొన్నారు. అనంతరం పెద్దపల్లి ఐటీఐ కళాశాలలో నిర్వహిస్తున్న ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి ఓటరికి సంబంధించిన ఆధారాలను తప్పనిసరిగా సేకరించాలని, మ్యాపింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనవసరంగా ఓటర్ల తొలగింపులు చేయరాదని స్పష్టం చేస్తూ, ప్రతి వివరాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను మే 30వ తేదీ లోపు పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాజయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఓ జిల్లా కాన్ఫరెన్స్ విజయవంతం చేయాలి

### - జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ముజైపుద్దీన్




పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే పెద్దపల్లి జిల్లా కాన్ఫరెన్సును విజయవంతం చేయాలని ఎస్ఐఓ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ముజైపుద్దీన్ పిలుపునిచ్చారు. శనివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్బులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. ఆదివారం సాయంత్రం 6గంటలకు ఎంబీ గార్డెనులో జరిగే సమావేశానికి యువత పెద్దసంఖ్యలో హాజరుకావాలన్నారు. ప్రస్తుతం యువత అక్షరాస్యతలో వెనకబాటు, లక్ష్యరాహిత్యం, నిరుద్యోగ భయం, సోషల్ మీడియా దుర్వినియోగం, నైతిక విలువల నుండి దూరమైతున్నారన్నారు. ఎంతో ప్రతిభ ఉన్నప్పటికి సరైన మార్గదర్శకత్వం లేకపోవడంతో తమ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోలేక పోతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో యువతకు దిశానిర్ధేశం చేసి వారు భవిష్యత్‌లో స్పష్టమైన జీవిత లక్ష్యాన్ని ఏర్పరుచుకోని, నైతికవిలువలు, సామాజిక బ్యాధ్యతతో కూడిన జీవిన విధానాన్ని అనుసరించేలా జాతీయ, రాష్ట్రస్థాయి ప్రముఖ నాయకుల ప్రసంగాలతో యువతకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కావున ఈ సదావకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ ఆతిఫ్, సయ్యద్ నస్రుల్లా తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారుల సూచనతో వేసిన పామాయిల్ పంటకు విద్యుత్ అధికారుల నోటీసులు

### - తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన రైతు



జమ్మికుంట ఏప్రిల్ 25(ది క్రైమ్ న్యూస్) : జమ్మికుంట మండలం తనుగుల గ్రామంలో రైతుకు లక్షల నష్టంవాటిల్లింది వివరల్లోకి వెళితే తనుగుల గ్రామంలో వ్యవసాయ, విద్యుత్ శాఖల సమన్వయ లోపంతో ఓ రైతు లక్షల విలువైన పంటను కోల్పోయే పరిస్థితి నెలకొంది. రైతు చింతల శ్రీనివాస్ తనకు చెందిన సర్వేనెంబర్ 272/ఏ /1, 278/బి , 279/బి /ఏ లలోని 3 ఎకరాల 38 గుంటల భూమిలో గతంలో వరి పంట సాగు చేసేవారు. అప్పుడు ఏటా సుమారు 5 నుంచి 6 లక్షల రూపాయల ఆదాయం వచ్చేదని ఆయన తెలిపారు. ఈ క్రమంలో వ్యవసాయ అధికారులు గ్రామంలో రైతులను పామాయిల్ సాగు వైపు ప్రోత్సహిస్తూ, మంచి లాభాలు వస్తాయని చెప్పడంతో శ్రీనివాస్ వారి సహకారంతో మూడేళ్ల క్రితం పామాయిల్ పంటను సాగు చేశారు. పంట వేసే సమయంలో వ్యవసాయ అధికారులు హైటెన్షన్ వైర్లను చూసినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు ఉండవని భరోసా ఇవ్వడంతోనే పంట సాగు చేసినట్లు రైతు వాపోతున్నాడు. మూడేళ్ల తర్వాత పంట చేతికి వచ్చే సమయంలో పామాయిల్ తోట మీదుగా హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్నాయంటూ విద్యుత్ అధికారులు పంటను తొలగించాలని నోటీసులు జారీ చేశారు. దీంతో రైతు శ్రీనివాస్ తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. "పంట తొలగిస్తే మూడేళ్లుగా పెట్టిన పెట్టుబడి, శ్రమ మొత్తం వృధా అవుతుంది. నష్టపరిహారం ఎవరు చెల్లిస్తారు?" అని ఆయన ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయ అధికారుల సలహాతో సాగు చేసిన పంటను ఇప్పుడు విద్యుత్ అధికారులు తొలగించాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. పామాయిల్ పంట మూడేళ్ల తర్వాతే దిగుబడి ఇస్తుంది. ఇప్పుడు పంట తొలగిస్తే రైతుకు లక్షల్లో నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో రైతు నష్టపోతున్నాడని స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో నష్టపరిహారం అందించాలని, రైతుకు న్యాయం చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## కాలువ పూడికతీతను పరిశీలించిన డిఆర్డివో



మానకొండూర్, ఎప్రిల్25(ది క్రైం న్యూస్): కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ముంజంపల్లిలో గుంటమడుగు సమీపంలోని చెరువు కాలువ వద్ద జరుగుతున్న ఉపాధి పనులను డిఆర్డిఓ శ్రీధర్ శనివారం సందర్శించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన కాలువ పూడిక తీత పనుల్లో కూలీల సమీకరణ,వేతన బకాయిలు, తదితర సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకుని కూలీలకు ఓఆర్ఎస్,మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో వరలక్ష్మి,ఈజీఎస్ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శి, కారోబార్ తదితరులు పరిశీలనలో డిఆర్డివో వెంట ఉన్నారు.

## సర్వీస్ రోడ్డు నిర్మాణంపై అధికారుల విచారణ



మానకొండూర్, ఎప్రిల్25(ది క్రైం న్యూస్): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లి గ్రామానికి సర్వీస్ రోడ్డు నిర్మాణంపై కలెక్టర్ ఆదేశం మేరకు జెడ్పీ సిఇఒ ఏం.శ్రీనివాస్, డిప్యూటీ సిఈఓ టి.పవన్ స్థానిక అధికారులతో కలిసి శనివారం క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. ఎంపీడీవో వి.వి.వరలక్ష్మి, తహశీల్దార్ విజయ్ కుమార్,ఎంపిఓ.సతీష్ కుమార్, పంచాయతీ రాజ్ ఏఈ కే.వెంకన్న, పంచాయతీ కార్యదర్శి, స్థానిక సర్పంచ్, గ్రామస్తులు విచారణలో పాల్గొన్నారు.

## బోరింగులను మరమ్మతు చేయించిన సర్పంచ్



రామగిరి, ఏప్రిల్ 25(ది క్రైమ్ న్యూస్):- రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధి లో చెడిపోయిన బోరింగులను శనివారం సర్పంచ్ పల్లె ప్రతిమ పివి రావు ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. రత్నాపూర్ పరిధి లోని పల్లె మీద మేకల రామ్మూర్తి ఇంటి వద్ద,ఎస్సి వాడలోని మద్దెల బాణయ్య ఇంటి వద్ద,రాంనగర్ లోని సబ్బు లింగయ్య ఇంటి వద్ద గల బోరింగ్ లను మరమ్మతులు చేయించి ప్రజలకు వాడుకలోకి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప ఉపసర్పంచ్ భాద్రపు ప్రవళిక ప్రశాంత్, వార్డు సభ్యులు అల్లి రమేష్, బత్తిని ప్రశాంత్, పున్నం మని తేజ ,జుట్టు యశోద, కార్యదర్శి గంగుల సంతోష్, కరోబార్ కొండపర్తి శ్రీనివాస్ ,స్థానిక నాయకులు సుంకర విజయ్,పబ్బ మొగిలి, భోగి సతీష్,కెక్కర్ల మోహన్, వేముల రాజు, అమరగొండ శ్రీనివాస్, ఓదెలు, కొదురుపాక భీమయ్య, పిట్ల రవి, నూనె రామచందర్, బల్వీందర్ సింగ్, గ్రామపంచాయతీ సిబ్బంది కొండా శంకర్, కండే సంజీవ్ , బూత్కూరి శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

## ఘన నివాళి...



జమ్మికుంట ఏప్రిల్ 25 (ది క్రైమ్ న్యూస్) : జమ్మికుంట బస్టాండ్ లో ఆర్ టీ సి కార్మికులు నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ ఆత్మహుతి చేసుకున్న శంకర్ గౌడ్ కు జె ఏ సి తరుపున జిమ్మికుంట సెక్టారు చెందిన కార్మికులు కోవ్వత్తులతో నివాళులు అర్పించారు ఈ కార్యక్రమములో జమ్ముకుంట పెక్టార్ కు చెందిన కార్మికులు అధిక సంఖ్యలో పాల్గోన్నారు

# భ్రమరాంబికా మాతకు 5 తులాల బంగారు హారం సమర్పించిన భక్తులు



పటాన్చెరు, ఏప్రిల్ 25(ది క్రైమ్ న్యూస్) : అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ శ్రీ భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి ఆలయంలో భ్రమరాంబికా మాతకు భక్తులు ఐదు తులాల బంగారు హారాన్ని సమర్పించారు. రామచంద్రాపురం మల్లికార్జుననగర్ కాలనీకి చెందిన ముక్కిరాల పద్మనాభరావు--శారదాదేవి దంపతులు, ముక్కిరాల మదన్‌మోహన్‌రావు--గిరిజాదేవి దంపతులు తమ మొక్కు తీర్చుకునేందుకు ఈ బంగారు హారాన్ని సమర్పించారు. ఆలయ చైర్మన్ బైంసా సుధాకర్ యాదవ్, కార్యనిర్వాహణాధికారి శశిధర్ గుప్తా సమక్షంలో హారాన్ని అమ్మవారికి అందజేశారు. రంగూడ ఆలయం మరో శ్రీశైలంగా ప్రసిద్ధి చెందగా, ఇక్కడ వెలసిన భ్రమరాంబికా దేవి కోరిన కోరికలను తీర్చే కల్పవల్లిగా భక్తుల విశ్వాసం. విశేష మహిమలతో ప్రసిద్ధి చెందిన మల్లికార్జున స్వామి, భ్రమరాంబికా దేవి ఆశీస్సులు తమ కుటుంబంపై ఎల్లవేళలా ఉండాలని దాతలు ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ, భక్తులు నిండు నిష్టతో కోరుకున్న వ్రతాలను స్వామి తప్పకుండా తీర్చుతాడని పేర్కొన్నారు. భక్తుల సహకారంతో ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ ప్రసిద్ధి పొందుతోందన్నారు. ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమాలు, విశిష్ట దినాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు తోడ్పడి స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, దేవాదాయ శాఖ అధికారి మల్లికార్జున రెడ్డి, ముక్కిరాల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం...




క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీ చాముండేశ్వరి, మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడం, దాని నివారణ, నియంత్రణ చర్యలను ప్రోత్సహించడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశ్యమని చెప్పారు. 2007లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ దినోత్సవాన్ని ప్రారంభించిందని వివరించారు. ఆడ అనాఫిలిస్ దోమ కాటు వల్ల మలేరియా వ్యాధి వ్యాపిస్తుందని తెలిపారు. 2026 సంవత్సరానికి మలేరియాను అంతం చేయాలనే తపన: ఇప్పుడు మనం చేయగలం, ఇప్పుడు మనం తప్పక చేయాలి అనే థీమ్‌ను ప్రకటించారని పేర్కొన్నారు. భారతదేశం 2027 నాటికి దేశీయ మలేరియా కేసులను సున్నాకి తగ్గించి, 2030 నాటికి పూర్తిగా నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. మలేరియా నివారణకు ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని గాంధీ సూచించారు. దోమతెరలు ఉపయోగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, దోమల నివారణ మందులు వాడడం వంటి చర్యలు తీసుకోవాలని చెప్పారు. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వారానికి ఒకసారి నీటి డ్రమ్ములు, కూలర్లు శుభ్రం చేయాలని సూచించారు. పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ కప్పులు, బాటిళ్లు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా తొలగించాలని చెప్పారు. ఇంటి చెత్తను మోరీల్లో వేయకుండా మున్సిపల్ చెత్త బండికి ఇవ్వాలని సూచించారు. డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి సీజనల్ వ్యాధుల నివారణ కోసం ప్రజలంతా కలిసికట్టుగా పనిచేయాలని గాంధీ పిలుపునిచ్చారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటినుంచే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, గణేష్ ముదిరాజు, మారబోయిన రాజు యాదవ్, అక్తర్, నాయినేని చంద్రకాంత్ రావు, దొడ్ల రామకృష్ణ గౌడ్, చిరుమర్తి రాజు, పాలమూరు భాస్కర్ రావు, కార్యకర్తలు, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

# మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు

## అధ్యక్షుడిగా బోళ్ల శంకర్ ఏకగ్రీవం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 25(ది క్రైమ్ న్యూస్)కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు ఈ ఎన్నికలను నిర్వహించినట్లు ఎన్నికల అధికారి సాజిద్ ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం నూతన కార్యవర్గం చైర్మన్ బోళ్ల శంకర్, ఉపాధ్యక్షులు రేగుల శ్రీనివాస్,కోశాధికారి దాసరి తిరుపతి,డైరెక్టర్లు కోతి రాజ్ కుమార్, పండుగ శ్రీనివాస్, గంగు రాయమల్లు, కోతి మల్లేశం, గోనెల పర్శరాములు, గోనెల ఎల్లయ్య,ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా అభినందించారు. మత్స్యకారుల సంక్షేమం కోసం నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు.





# విద్యతోనే సమాజాభివృద్ధి

## -మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్

## -మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో ఎఫ్ సెట్ అధ్యయన సామగ్రి పంపిణీ

రామగిరి, ఏప్రిల్ 25(ది క్రైమ్ న్యూస్) : విద్యతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ఇంటర్ లో ఎక్కువ మార్కులు సాధించి ఎఫ్ సెట్ కు సన్నద్ధం అవుతున్న విద్యార్థులకు అత్యుత్తమ ప్రతిభకనబరిచి ఉన్నత స్థాయి స్థానాలు సాధించేందుకు ఉపయుక్తమయ్యే నాణ్యమైన ఎఫ్ సెట్ అధ్యయన సామగ్రిని మంథని పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కుడుదల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్, విశ్రాంత ఉపాధ్యాయుడు దుద్దిళ్ల గణపతి ల చేతులు మీదుగా పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకునేందుకు ఆర్థిక స్థోమత అడ్డు కావద్దని మంత్రి శ్రీధర్ బాబు సంకల్పంచి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ను అందించారన్నారు. క్రమశిక్షణతో కూడిన సిద్ధత, అందించిన అధ్యయన సామగ్రిని సమర్థవంతంగా వినియోగించడం, అలాగే భవిష్యత్ లక్ష్యాలపై ఏకాగ్రతతో ఉండడం విజయానికి కీలకమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఆత్మవిశ్వాసంతో పరీక్షకు సిద్ధమయ్యి మంచి ర్యాంకులు తెచ్చుకోవాలన్నారు. విభిన్న సామాజిక, ఆర్థిక నేపథ్యాల నుండి వచ్చిన విద్యార్థుల విద్యాభివృద్ధికి మంత్రి శ్రీధర్ బాబు తన పూర్తి సహకారాన్ని అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలక సభ్యులు నూకల కమల్, మద్దికట్ల స్రవంతి,జంబోజు శ్రీమతి, మారుపాక నిహారిక, వేముల లక్ష్మి, యెల్లంకి వంశీధర్, నాయకులు పర్షవేణ మోహన్ యాదవ్, వంగల తిరుమలేష్, జంబోజు సమ్మయ్య, ఎరుకల రమేష్ బాబు, మారుపాక నటరాజు, తదితరులు పాల్గొన్నారు.

# డీటీఎఫ్ విద్యా సదస్సును విజయవంతం చేయండి..

## -డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి




జమ్మికుంట ఏప్రిల్ 25 (ది క్రైమ్ న్యూస్) : డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. రాజిరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీటీఎఫ్ శాఖలు సంయుక్తంగా ఈ నెల 28-04-2026, మంగళవారం రోజున కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మహత్తర విద్యా సదస్సును విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు అధ్యక్షులు ఆవాల నరహరి ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, ప్రజాసంఘాల నాయకులను కోరారు. ఈ రోజు జమ్మికుంట మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యా సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరహరి గారు మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో విద్యా రంగం అనేక మార్పులు, సవాళ్లను ఎదుర్కొంటోందని, ప్రభుత్వ విధానాలు, ప్రైవేటీకరణ ప్రభావం, నాణ్యమైన విద్య అందుబాటు వంటి కీలక అంశాలపై సమగ్ర చర్చ అవసరమని తెలిపారు. డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో "తెలంగాణ విద్యా రంగం -- వర్తమానం, భవిష్యత్తు, సవాళ్లు" అనే ప్రధాన అంశంపై ఈ విద్యా సదస్సు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో జరుగుతున్న మార్పులు, విద్యార్థుల భవిష్యత్తుపై వాటి ప్రభావం, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, ఉపాధ్యాయుల పాత్ర వంటి అంశాలపై ఈ సదస్సులో విస్తృత చర్చ జరుగుతుందని అన్నారు. ఈ సదస్సుకు వీక్షణం పత్రిక సంపాదకులు ఎన్. వేణుగోపాల్ ముఖ్య వక్తగా హాజరై ప్రస్తుత విద్యా పరిస్థితులపై విశ్లేషణాత్మకంగా మాట్లాడనున్నారని తెలిపారు. ఆయన ప్రసంగం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, విద్యా రంగంపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. విద్యా సదస్సు అనంతరం రాజిరెడ్డి గారి అభినందన కార్యక్రమం ఉంటుందని కావున ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ విద్యా సదస్సును విజయవంతం చేయాలని, అలాగే ప్రస్తుత విద్యా పరిస్థితులపై లోతైన అవగాహన పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి హేమలత , డీటీఎఫ్ మండల అధ్యక్షులు బి. వేణుగోపాల్, హరీష్ కుమార్, అనూష, పద్మ , బలరాం ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మానవ శరీరంలోని నాభిలా గ్రామానికి బొడ్రాయి కేంద్రబిందువు

## పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : మానవ శరీరంలోని నాభిలా గ్రామానికి బొడ్రాయి కేంద్రబిందువుగా ఉంటుందని, అందుకే దీనికి ఆ పేరు వచ్చిందని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ వివరించారు. శనివారం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని లింగంపల్లి గ్రామంలో శ్రీ నాభిశీల (బొడ్రాయి) ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై, సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో ప్రతి గ్రామంలో బొడ్రాయిని పూజించే సంప్రదాయం మన పూర్వీకుల నుంచి కొనసాగుతూ వస్తోందన్నారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, ఎలాంటి అపశకునాలు జరగకుండా ఉండాలని భావించి పూర్వకాలంలో పెద్దలు బొడ్రాయిని ప్రతిష్ఠించేవారని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. గ్రామ దేవతలపై ఉన్న విశ్వాసాన్ని వివరించిన ఆయన, కష్టకాలంలో గ్రామ దేవతలే ప్రజలను కాపాడుతాయని పల్లె ప్రజలు నమ్ముతారని చెప్పారు. బొడ్రాయి పండుగ సందర్భంగా గ్రామ ప్రజలంతా కులమతాలకు అతీతంగా ఒకటిగా చేరి జాతర నిర్వహించడం ఐక్యతకు నిదర్శనమని అన్నారు. బొడ్రాయి నిర్మాణానికి సంబంధించిన విశేషాలను కూడా ఆయన వివరించారు. గ్రామ మధ్య భాగంలో నిలువుగా నాటిన రాయిని బొడ్రాయి లేదా బొడ్డురాయి అని పిలుస్తారని తెలిపారు. గ్రామ నిర్మాణ సమయంలో పొలిమేరలను నిర్ణయించి, ఆ ప్రాంతం మధ్యలో బొడ్రాయిని ప్రతిష్ఠిస్తారని చెప్పారు. బొడ్రాయి మూడు భాగాలుగా ఉండే ప్రత్యేకతను వివరించిన ఆయన, కింది భాగాన్ని బ్రహ్మ స్వరూపంగా నాలుగు పలకలుగా, మధ్య భాగాన్ని విష్ణువు ప్రతీకగా ఎనిమిది పలకలతో, పైభాగాన్ని శివుడి స్వరూపంగా లింగాకారంలో నిర్మిస్తారని తెలిపారు. అలాగే బొడ్రాయి కింద శీతలాదేవి యంత్రాన్ని ప్రతిష్ఠించి, పొలిమేర దేవతల యంత్రాలను సర్వతోభద్రంగా ఏర్పాటు చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారబోయిన రాజు యాదవ్, అక్తర్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, చింతకింది రవీందర్ గౌడ్, రవి యాదవ్, మల్లేష్ యాదవ్, మల్లేష్ గౌడ్, పవన్ తదితరులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐక్యతకు ప్రతీకగా నిలిచిన బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమం

## జగదీశ్వర్ గౌడ్



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : కలిసుంటే బలం... విడిపోతే బలహీనత అనే సందేశాన్ని బొడ్రాయి అందిస్తుందని, గ్రామంలో ఐక్యత ఉన్నంతకాలం అభివృద్ధి కొనసాగుతుందని జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని లింగంపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని, స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, డివిజన్ నాయకులు, గ్రామ ప్రజలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ బొడ్రాయి మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. గ్రామ దేవతగా బొడ్రాయిని భావిస్తూ ప్రజలు తమ ఐక్యతను కాపాడుకోవాలని ఆయన సూచించారు. గ్రామ ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు సాగితే గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు, యువతతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక శక్తి కేంద్రం గ్రామ బొడ్రాయి ప్రతిష్ఠాపన

## రవికుమార్ యాదవ్



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : గ్రామ బొడ్రాయిని గ్రామానికి ఆధ్యాత్మిక శక్తి కేంద్రంగా భావించే పవిత్ర స్థలమని రవికుమార్ యాదవ్ అన్నారు. శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని లింగంపల్లి డివిజన్‌లో గ్రామ నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమం కంటెస్టెడ్ కార్పొరేటర్ ఎల్లేష్, డివిజన్ అధ్యక్షుడు కిషోర్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ ఎంపీలు ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ మారబోయిన రవికుమార్ యాదవ్ పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ గ్రామాన్ని అంటువ్యాధులు, దుష్ట శక్తుల నుండి రక్షిస్తూ ప్రజలకు సుఖశాంతులు కలిగించే శక్తిగా బొడ్రాయిని ప్రజలు విశ్వసిస్తున్నారని అన్నారు. గ్రామ బొడ్రాయి పండుగ గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి పవిత్ర సంప్రదాయాలను కొనసాగించడం ఆనందదాయకమని ఆయన తెలిపారు. శేరిలింగంపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్టించడం సంతోషకరమని, ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీలు ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కిషోర్ కుమార్, సాయి విజయ్, సోమయ్య యాదవ్, లింగం శ్రీనివాసు, రవి, కృష్ణ యాదవ్ తదితరులు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేసవి శిక్షణ తరగతుల పోస్టర్‌ను విడుదల చేసిన సర్పంచులు

కరీంనగర్ టౌన్,ఏప్రిల్ 25(ది క్రైమ్ న్యూస్)విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని, వారిలోని సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి శిక్షణ తరగతులు దోహదపడతాయని సర్పంచులు పేర్కొన్నారు. గుండ్లపల్లిలోని స్పార్కిల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో మే 2వ తేదీ నుండి నెల రోజుల పాటు నిర్వహించనున్న డ్యాన్స్, డ్రామా (చిల్డ్రన్ యాక్టింగ్) శిక్షణ తరగతుల పోస్టర్‌ను శనివారం నాడు సర్పంచులు ఆవిష్కరించారు.గుండ్లపల్లి స్టేజీ సర్పంచ్ చింతల అనిల్, గునుకుల కొండాపూర్ సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ, పీచుపల్లి సర్పంచ్ సామ రాజిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఈ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతో పాటు కళల పట్ల ఆసక్తి పెంచుకోవడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. స్థానిక విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పార్కిల్ స్కూల్ యాజమాన్యం, కరీంనగర్‌కు చెందిన మాస్క్ ఇన్‌స్టిట్యూట్ (యాక్టింగ్), డిస్కో డ్యాన్స్ అకాడమీ ప్రతినిధులు, కోచ్‌లు, స్థానికులు పాల్గొన్నారు.



# సైబరాబాద్‌లో 'మార్గదర్శక్ 3.0' కార్యక్రమం ప్రారంభం...

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : సైబరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) నిర్వహించిన "మార్గదర్శక్ -- యువర్ బడ్డీ ఇన్ డిస్ట్రెస్ (3.0, ఫస్ట్ బ్యాచ్)" సర్టిఫికేషన్ కార్యక్రమం శనివారం ఘనంగా ప్రారంభమైంది. సమాజంలో కష్టాల్లో ఉన్నవారికి సమయానుకూలంగా సహాయం అందించే భావోద్వేగ సహాయకుల తయారీ దిశగా ఈ కార్యక్రమం కీలక ముందడుగు అయింది. ఈ కార్యక్రమానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఐపీఎస్ అధ్యక్షత వహించగా, మహిళా, బాలల భద్రత విభాగం డీసీపీ కే. సృజనతో పాటు ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సైబరాబాద్ మహిళా, బాలల భద్రత విభాగం ఎస్సీఎస్సీ సంయుక్తంగా రూపొందించిన స్టాకింగ్ అవగాహన వీడియోను కూడా విడుదల చేశారు. మార్గదర్శక్ 3.0 కార్యక్రమం, గతంలో నిర్వహించిన మార్గదర్శక్, సంఘమిత్ర కార్యక్రమాల సమ్మిళిత రూపంగా రూపొందించబడింది. మూడు వారాలపాటు సాగిన ఈ శిక్షణ కార్యక్రమానికి వివిధ సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల నుంచి సుమారు 80 మంది నామినేషన్లు వచ్చాయి. అందులో 60 మంది



ఎంపికై శిక్షణ పొందారు. మహిళా పోలీస్ స్టేషన్లు, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్, భరోసా సెంటర్, ఏహెచ్‌టీయూ, సీడీఈడబ్ల్యూ, షీ టీమ్స్ వంటి కీలక విభాగాలకు ఫీల్డ్ విజిట్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన 60 మందికి మార్గదర్శక్ సర్టిఫికెట్లు అందజేశారు. ఎస్సీఎస్సీ డైరెక్టర్ స్ట్రాటజిక్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూషన్ రష్మి శ్రీవాస్తవ ఈ వాలంటీర్లను ఒక సమగ్ర కమ్యూనిటీ నెట్‌వర్క్‌గా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఎస్సీ నాయకులు రమేష్ కాజా, నవేద్ ఆలమ్ ఖాన్, రఘు కన్నన్, వెంకట శేషు, మహిళా భద్రత ఫోరం సభ్యులు సోనియా సహగల్, శాలిని సింగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. శిక్షణలో నిపుణులు పద్మప్రియా చిలకమర్తి, సీనియర్ సైకాలజిస్ట్ జారా అహ్మద్ సిద్ధిఖీ కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం పోలీసింగ్ కేవలం చట్ట అమలుకే పరిమితం కాకుండా, సమాజంతో అనుసంధానం, మానసిక సహాయం అందించడం పైనా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. మార్గదర్శక్ కార్యక్రమం ద్వారా వాలంటీర్లు కష్టాల్లో ఉన్నవారికి తొలి సహాయకులుగా మారి, సమస్యలు మరింత తీవ్రత చెందకముందే సరైన దారి చూపగలరని తెలిపారు. సురక్షితమైన, స్పందనాత్మక సమాజ నిర్మాణానికి సైబరాబాద్ పోలీసులు, ఎస్సీఎస్సీ కట్టుబడి ఉన్నాయని అధికారులు తెలిపారు.

# మురుగు సమస్యలపై త్వరిత పరిష్కారానికి చర్యలు

### తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : మురుగు సమస్యలపై త్వరిత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. శనివారం మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ ప్రశాంత్ నగర్ కాలనీలో తలెత్తిన మురుగు సమస్యలను మియాపూర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, జలమండలి ఉప ప్రధాన అధికారి నారాయణ కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ కాలనీలో చాలా కాలంగా కొనసాగుతున్న మురుగు సమస్యలను గుర్తించి, జలమండలి అధికారులతో కలిసి స్థల పరిశీలన నిర్వహించామని తెలిపారు. అసంపూర్తిగా మిగిలిపోయిన మురుగు పనులను త్వరితగతిన పూర్తి చేసి, మురుగు వ్యవస్థను పూర్తిగా మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. అలాగే పొంగుతున్న మురుగు గొట్టాల వద్ద పునరుద్ధరణ చర్యలు చేపట్టి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మంచినీటి సరఫరా వ్యవస్థను కూడా సరిచేసి, లీకేజీ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సహకారంతో కాలనీలో పలు అభివృద్ధి పనులు చేపట్టి, నివాసితులకు శుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించిన శ్రీకాంత్, ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే స్పందించి పరిష్కరిస్తానని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఉదయ్ కుమార్, రవీందర్ రెడ్డి, వర్క్ పరిశీలకుడు లింగయ్య, నరేష్ నాయక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపిలో పలు చోట్ల పెట్రోల్ బంకుల్లో నో స్టాక్

### బారులు తీరిన వాహనదారులు

### పెట్రోల్, జీజిల్ కోసం అగచాట్లు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో పలు జిల్లాల్లో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రరూపం దాల్చింది. ముఖ్యంగా ఎన్టీఆర్ జిల్లాతో పాటు మరికొన్ని జిల్లాల్లో అనేక పెట్రోల్ బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిచ్చాయి. దీంతో ఇంధనం కోసం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉందని సమాచారం. పలు పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు పూర్తిగా అయిపోవడంతో వాహనదారులు బంకుల వద్ద నిరాశగా వెనుదిరుగుతున్నారు. కొన్నిచోట్ల బంక్ సిబ్బందితో వాహనదారుల మధ్య వాగ్వాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా ఆయిల్ కంపెనీలు అప్పు ప్రతిపాదికన ఇంధన సరఫరాను నిలిపివేయడమేనని తెలుస్తోంది. పెండింగ్ బకాయిలు చెల్లించిన తర్వాతే సరఫరా పునరుద్ధరిస్తామని ఆయిల్ కంపెనీలు స్పష్టం చేసినట్లు సమాచారం. పాత బకాయిల చెల్లింపుల్లో జాప్యం కారణంగా ఈ సంక్షోభం ఏర్పడిందని తెలుస్తోంది. ఇక నష్టాలు, పరిశ్రమల్లో వినియోగం తగ్గుదల కూడా సరఫరాపై ప్రభావం చూపినట్లు చెబుతున్నారు. కొండపల్లి పారిశ్రామిక వాడ సమీపంలో భారీ సంఖ్యలో ట్యాంకర్లు నిలిచిపోయాయి. ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద వందల సంఖ్యలో ట్యాంకర్లు స్టాండ్‌స్టిల్‌లో ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు కూడా సరఫరా అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. దీంతో రవాణా, పరిశ్రమలు, వ్యవసాయం రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇంధన సంక్షోభంపై నిన్న విజయవాడలో సివిల్ సప్లైస్ అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, ఏపీ పెట్రోల్ డీలర్స్ అసోసియేషన్ సంయుక్త సమావేశం నిర్వహించారు. చర్చలు సఫలమయ్యాయని, నిరంతర సరఫరా కొనసాగుతుందని ఆయిల్ కంపెనీలు తెలిపినట్లు డీలర్స్ అసోసియేషన్ పేర్కొంది. అయితే సమావేశం తర్వాత కూడా పలు బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు కనిపిస్తుండటంతో ప్రజల్లో ఆందోళన కొనసాగుతోంది. సమస్యను వెంటనే పరిష్కరించి సాధారణ సరఫరా పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అటు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో డీజిల్ కొరత తీవ్రంగా కనిపిస్తోంది. పలు పెట్రోల్ బంకుల వద్ద డీజిల్ కోసం వినియోగదారులు, రైతులు, వాహనదారులు టిన్నులతో బారులు తీరుతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనుల సీజన్‌లో ఈ కొరత రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం జిల్లాలో వరి పంట కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రైతులు వరి కోత యంత్రాల సహాయంతో పంట మాసూళ్లలో నిమగ్నమై ఉన్నారు. అయితే కోత యంత్రాలకు అవసరమైన డీజిల్ బంకుల్లో అందుబాటులో లేకపోవడంతో కోత పనులు అంతరాయం కలుగుతున్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని నేపథ్యంలో రైతులు పండించిన పంటను ఎలాగైనా కాపాడుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇదే సమయంలో డీజిల్ కొరత మరింత ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేసిన రైతులు వరి కోత కోసం యంత్రాలపై ఆధారపడుతున్నారు. ఇప్పుడు వాటికి ఇంధనం దొరకకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# తారానగర్ రోడ్డు విస్తరణపై ఆందోళన


### ప్రభుత్వానికి లేఖ రాస్తానన్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని తారానగర్‌లో ప్రతిపాదిత రోడ్డు విస్తరణపై వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ నేత రవికుమార్ యాదవ్ తారానగర్ మార్కెట్‌ను సందర్శించి వ్యాపారులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తారానగర్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రవికుమార్ యాదవ్‌లకు తమ ఆవేదన వ్యక్తం చేశారు. పోచమ్మ గుడి నుంచి హనుమాన్ గుడి వరకు 100 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టడం వల్ల తమకు తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు. సుల్తాన్ బజార్, బేగం బజార్‌ల తరహాలో ఈ మార్కెట్ కూడా మూడు తరాలుగా కొనసాగుతోందని, ప్రతిపాదిత ప్రణాళికతో చిన్న వ్యాపారులు, రోజువారీ కూలీలు, నివాసులు, ఉద్యోగులు వంటి వేలాది కుటుంబాల జీవనోపాధిపై ప్రభావం పడే అవకాశముందని పేర్కొన్నారు. రోడ్డు విస్తరణను 100 అడుగుల బదులుగా 60 అడుగులకు పరిమితం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు వ్యాపారులు తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణ వల్ల వ్యాపారుల జీవనోపాధి దెబ్బతినకూడదని, ఎన్నో ఏళ్లుగా వ్యాపారాలు చేసుకుంటున్న వారి జీవితం ప్రమాదంలో పడకుండా ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. వ్యాపారులకు ఎలాంటి అన్యాయం జరిగినా భారతీయ జనతా పార్టీ తరపున పోరాటానికి సిద్ధమని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వ్యాపారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తాను లేఖ రాస్తానని తెలిపారు. వ్యాపారులు ధైర్యంగా తమ హక్కుల కోసం పోరాటం కొనసాగించాలని, తాను వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్ ఎల్లేష్, దినేష్ బోరా, గోవింద్, అశ్విన్ జోషి, రామ్ సుఖ్, రామ్ నివాస్, బచ్చు శ్రీనివాస్, మంగీలాల్, సత్యనారాయణ గౌడ్, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవి సెలవుల్లో సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలను పెంపొందించుకోండి

### 'రోహేలాస్ టెక్' ప్రతినిధుల పిలుపు




కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 25(ది క్రైమ్ న్యూస్)ఈ వేసవి సెలవులను కేవలం సెల్ ఫోన్లు, టీవీలు, ట్యాబ్‌లకే పరిమితం చేయకుండా, విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తు కోసం సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలను నేర్చుకోవాలని రోహేలాస్ టెక్ ప్రతినిధులు కోరారు. రోల్ టెక్ ఐటీ సొల్యూషన్స్ వారు తమ 'ట్రైనీ టెక్కి' విభాగం ద్వారా 6వ తరగతి నుండి 12వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మూడు సాఫ్ట్‌వేర్ కోర్సులను ప్రారంభించారు.కోర్సుల వివరాలు:డిజిటల్ మార్కెటింగ్,పైథాన్ కోడింగ్ బిగినర్స్, ఏఐ టూల్స్,ఈ 45 రోజుల శిక్షణా కాలంలో విద్యార్థులకు సింగపూర్, పూణే, హైదరాబాద్ వంటి నగరాలకు చెందిన అనుభవజ్ఞులైన అంతర్జాతీయ స్థాయి నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. కరీంనగర్ విద్యార్థులకు గ్లోబల్ టెక్నాలజీని స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావడం గర్వకారణమని సంస్థ ప్రతినిధులు తెలిపారు.ప్రత్యేక ఆఫర్:విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, రూ. 8,999 విలువైన ఈ కోర్సును కేవలం రూ. 3,499 కే అందిస్తున్నారు. సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా తల్లిదండ్రులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. మరిన్ని వివరాల కోసం కరీంనగర్‌లోని రోహేలాస్ టెక్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు లేదా 8008931263, 7674098844 నంబర్లకు ఫోన్ చేయవచ్చు అని అన్నారు.

# అన్నదాతకు అండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

### ప్రజా ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి పెద్దపీట

### తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కొనుగోలు కేంద్రాలలో కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తూ అన్నదాతకు అండగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శనివారం పెద్దపల్లి మండలం రాఘవాపూర్, అప్పన్నపేట, సుల్తానాబాద్ మండలంలోని కనుకుల,రాముని పల్లి, మంచిరామి,తొగరాయి గ్రామాల్లో ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అనంతరం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణ రావు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి గింజ కటింగులు లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు.అన్ని గ్రామాలలో ఐకెపి సహకార సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. రైతులెవరు ధైర్యపడవద్దని ప్రభుత్వం పూర్తి కొనుగోలు చేపట్టి మద్దతు ధరను అందిస్తామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు విధిగా తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని ప్రభుత్వ నిబంధనల ప్రకారం మ్యాచర్ వచ్చేలా ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని సూచించారు. రెండున్నర సంవత్సరాల కాలంలో 5 పసళ్ళు గింజ కటింగ్ లేకుండా కొనుగోలు చేపట్టామని గత ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని 15 నుండి 20 కిలోల వరకు కటింగ్లు చేపట్టారని అన్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్యపడవద్దని ప్రజా ప్రభుత్వం రైతులకు అండగా ఉందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చెర్మన్,వ్యవసాయ మార్కెట్ చైర్మన్, డైరెక్టర్లు, పలు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, రైతులు మరియు తదితరులు పాల్గొన్నారు..

# సెలూన్ కార్మికుడిపై దురుసు ప్రవర్తన

### కరీంనగర్ త్రీ టౌన్ ఎస్ఐ సస్పెన్షన్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్25(ది క్రైమ్ న్యూస్) : కరీంనగర్ నగరంలోని దుర్గమ్మగడ్డ, ఖాన్‌పురా ప్రాంతంలో ఉన్న ఒక హెయిర్ కట్టింగ్ సెలూన్ లో పోలీసు అధికారి ప్రవర్తనకు సంబంధించిన ఘటనపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు సదరు అధికారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈరోజు ఉదయం సుమారు 07:30 గంటల సమయంలో కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ ఎన్. చైతన్య చందర్, 'న్యూ ప్రజా హెయిర్ స్టైల్' సెలూన్‌కు వెళ్లారు. ఆ సమయంలో షాప్ శుభ్రపరిచే పనుల్లో నిమగ్నమై ఉన్న కార్మికుడు పగడాల రాము (50) ఎస్ఐను చూసి మర్యాదపూర్వకంగా "అన్నా కూర్చో" అని పలికారు. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఎస్ఐ, బాధితుడిని అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా అతనిపై చేయిచేసుకున్నాడు. ఈ దృశ్యాలన్నీ సెలూన్‌లోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయి, సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ?ఘటన జరిగిన సమయంలో ఎస్ఐ చైతన్య చందర్ ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద బందోబస్త్ విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్నట్లు విచారణలో తేలింది. సామాన్య పౌరుడిపై దాడి చేయడం, అధికార దుర్వినియోగానికి పాల్పడటం మరియు విధి నిర్వహణలో అనుచితంగా ప్రవర్తించినట్లు విచారణ నివేదికలో స్పష్టమవ్వడంతో కరీంనగర్ సీపీ గౌస్ ఆలం రాజన్న జోన్-త్రీ డి.ఐ.జి. సిఫారసు మేరకు ఉన్నతాధికారులు సదరు ఎస్ఐను సస్పెండ్ చేశారు. పోలీస్ శాఖ క్రమశిక్షణకు మారుపేరు. సామాన్య ప్రజలతో అసభ్యంగా ప్రవర్తించినా, చట్టాన్ని అతిక్రమించి అధికారాన్ని దుర్వినియోగం చేసినా ఎంతటి వారినైనా సహించేది లేదు. క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవు అని కరీంనగర్ సీపీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# జగనన్న లే ఔట్ పేరుతో భారీ అవినీతి

### నివాస యోగ్యం కాని భూములు కొని నొక్కేశారు

### కర్రగ్రహారం లే ఔట్‌ను పరిశీలించిన మంత్రి కొల్లు

మచిలీపట్నం,ఏప్రిల్25 : వైసీపీ హయాంలో జగనన్న లే అవుట్ పేరుతో భారీగా అవినీతికి పాల్పడ్డారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. నివాస యోగ్యం లేని, సముద్ర తీర భూములను కొనుగోలు చేసి పెద్దఎత్తున కమిషన్లు దండుకున్నారని ధ్వజమెత్తారు. జగన్ హయాంలో నివాస యోగ్యం లేని స్థలాలను పేదలకు కేటాయించారని.. ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని ఆగ్రహించారు. వైసీపీ హయాంలో మచిలీపట్నంలోని కర్రగ్రహారం గ్రామంలో జగనన్న కాలనీని ఏర్పాటు చేసింది. 300 ఎకరాల్లో జగనన్న లే అవుట్‌ను ఏర్పాటు చేసి 16వేల ఇళ్ల స్థలాలు కేటాయించింది. కనీస సౌకర్యాలు లేకపోవటంతో ఇళ్ల నిర్మాణాలకు లబ్దిదారులు ముందుకు రావడం లేదన్నారు. శనివారం ఆ కాలనీలో పర్యటించి వసతులు, సౌకర్యాలను మంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు. సెంటు స్థలంలో నిర్మించిన ఇళ్లకు వెళ్లి లబ్దిదారులతో మంత్రి రవీంద్ర మాట్లాడారు. కనీస వసతులు లేవని మంత్రి వద్ద లబ్దిదారులు వాపోయారు. చౌడు భూములు కావడంతో పెద్ద మొత్తంలో నిర్మాణ వ్యయమైందని లబ్దిదారులు తెలిపారు. ఈ కాలనీలో వసతుల కల్పనకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పరిశీలించారు. లబ్దిదారులతో మాట్లాడి నిర్మాణాలు చేపట్టకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలు నిర్మాణాల కోసం ముందుకు రాకపోతే ఆ స్థలాలను వెంటనే రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జగన్ హయాంలో ఈ కాలనీని నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఇళ్ల నిర్మాణాల కోసం లబ్దిదారులు ముందుకు రాలేదని మంత్రి చెప్పుకొచ్చారు. రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన కాలనీల్లో సౌకర్యాల కల్పనకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కాలనీలో కనీస వసతుల కల్పనకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఈ కాలనీలో అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# ల్యాండ్ పూలింగ్ రైతులకు శుభవార్త

### మే1నుంచి రైతులకు కౌలు నిధులు జమ

### మంత్రి నారాయణ వెల్లడి

అమరావతి,ఏప్రిల్25 : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇస్తున్న రైతులకు ఏపీ మంత్రి నారాయణ శుభవార్త తెలిపారు. ప్రస్తుతం ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇస్తున్న రైతులకు మే 1వ తేదీ నుంచి కౌలు నిధులు జమ చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. అమరావతిలో ల్యాండ్ పూలింగ్‌ను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమరావతిలో ల్యాండ్ పూలింగ్ కొనసాగుతున్న తీరుపై అధికారులతో మంత్రి నారాయణ శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు శ్రవణ్ కుమార్, భాష్యం ప్రవీణ్, సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు, అడిషనల్ కమిషనర్లు భార్గవ తేజ, కార్తీక్, డిప్యూటీ కలెక్టర్లు, ఎమ్మార్వోలు హాజరయ్యారు. ఇంటర్ నేషనల్ స్పోర్ట్స్ సిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వేలైన్, రైల్వేస్టేషన్ కోసం 7 గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. ఎంజాయ్‌మెంట్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే, లెగసీ వేస్ట్, ఫ్రెష్ వేస్ట్ నిర్వహణ ఏజెన్సీలతో పలు కీలక అంశాలపై మంత్రి నారాయణ చర్చించారు.

# ట్రంప్‌ను నిలువరించేదెవరు?

పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలు ఆరేలా లేవు. పరస్పర దాడులతో మరింత ఉద్రిక్తంగా మారుతోంది. దీంతో ప్రపంచ దేశాలు ఏమీ చేయలేని దుస్థితిలో ఉండిపోయాయి. అమెరికాను నిలువరించే పరిస్థితి ఏ దేశానికి లేకుండా పోయింది. సుంకాలు విధించినా చైనా, భారత్ లాంటి దేశాలు సైతం కిమ్మనకుండా మిన్నకుండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు చమురు సంక్షోభం నేపథ్యంలోనూ అమెరికాను కట్టడిచేయగల శక్తి ఎవరికీ లేకుండా పోయింది. ట్రంప్ కూడా ఆయుధ బలంతో రెచ్చిపోతున్నాడు. ఇది ప్రపంచ వినాశనానికి కంకణం కట్టుకున్నట్ఉగా ఉంది. ఇంతటితోనే ఇది ఆగుతుందనుకోవడానికి లేదు. ఇక భూతలదాడులు జరిగితే నష్టం మరింత తీవ్రంగా ఉంటుంది. ఇరాన్‌లో భూతల దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వస్తున్న వార్తలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ దాడులను అడ్డుకొనేందుకు ఇరాన్ కూడా సన్నాహాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అందులోభాగంగా 10 లక్షల మందికి పైగా సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సైనికాధికారులను ఉటంకిస్తూ ఆ దేశ మీడియా ఈ విషయాన్ని ఇప్పటికే వెల్లడించింది. ఓ వైపు చర్చలు కొనసాగుతున్నాయంటూనే.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియాలో తన సైనిక ఉనికిని విస్తరిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో తీవ్ర సంక్షోభం నెలకొన్నా పట్టించు కోవడం లేదు. ఆర్థికంగా దెబ్బతింటున్న పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే బసిజ్ ఫోర్స్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తో సహా అనేక విభాగాలు తక్షణమే కదనరంగంలోకి వచ్చేవిధంగా దళాలను బలోపేతం చేస్తున్నట్లు ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి. ఇరాన్ నేలపై అమెరికా సైన్యం అడుగుపెడితే.. వారికి నరకం చూపించేందుకు తమ యోధులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించాయి. స్వచ్ఛందంగా సైన్యంలో చేరతామని బసిజ్ ఫోర్స్, ఐఆర్‌జీసీలకు యువకుల నుంచి పెద్దఎత్తున అభ్యర్థన లు వస్తున్నట్లు వెల్లడించాయి. ఇదిలాఉండగా.. ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో యుద్ధంలో పాల్గొనేందుకు అర్హత వయసును కూడా ఇరాన్ తగ్గించినట్లు తెలుస్తోంది. 12 ఏళ్ల పిల్లలను సైతం యుద్ధంలో పాల్గొనేందుకు అనుమతివ్వాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీనికి 'ఫర్ ఇరాన్' అని పేరు పెట్టినట్లు వెల్లడించాయి. పెట్రోలింగ్, చెక్ పాయింట్ల దగ్గర వీరిని ఉంచనున్నారు. ఇదిలాఉండగా.. ఇరాన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ సైనిక కొరతను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. అవసరమైన దానికంటే 12వేల మంది తగ్గినట్లు సైనికాధికారులు ప్రభుత్వానికి వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ కొరత కారణంగా ఐడీఎఫ్ కూలిపోయే ప్రమాదం ఉందని.. ఆ సంస్థ చీఫ్ ఆఫ్ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఐయాల్ జమీర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు. దీనికి సంబంధించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో సహా ఇతర ఉన్నతాధికారులకు కూడా ఆయన లేఖ రాశారు. ఇకపోతే హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ సాగిస్తున్న దిగ్బంధనంతో నౌకాయానం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. చాలా దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభానికి ఇది కారణమైంది. ఇప్పుడు మరో జలసంధికి ముప్పు ముంచుకొచ్చింది. తమ ఖర్గ్ దీవిని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే బాబ్ అల్ మాండెబ్ జలసంధిని అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించడమే ఇందుకు కారణం. ఆ నౌకామార్గమూ మూసుకుపోతే ప్రపంచానికి మరిన్ని కష్టాలు తప్పవంటున్నారు. అరేబియా ద్వీపకల్పానికి పశ్చిమాన మరో జలమార్గమే బాబ్ అల్ మాండెబ్ జలసంధి. అరబిక్ భాషలో బాబ్ అల్ మాండెబ్ అంటే 'కన్నీటి ద్వారం' లేదా 'విషాద ద్వారం' అని అర్థం. అక్కడ ప్రతికూల పరిస్థితుల కారణంగా అనేక నౌకలు ప్రమాదానికి లోనయ్యాయి. అందువల్లే ఈ మార్గానికి ఆ పేరు వచ్చింది. 1869లో సూయజ్ కాలువను తెరిచాక మాండెబ్ జలసంధికి ప్రాముఖ్యత పెరిగింది. ఇది మధ్యధరా సముద్రం, హిందుమహాసముద్రానికి మధ్య కీలక లంకెగా మారింది. మాండెబ్ జలసంధికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఇది యెమన్, జిబౌటి మధ్య ఉంది. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేస్తోంది. సూయెజ్ కాలువ దిశగా వెళ్లే నౌకలు, చమురు ట్యాంకర్లకు ఇది కీలక నడవాగా మారింది. ఎర్ర సముద్రానికి, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌కు మధ్య ద్వారంలా వ్యవహరిస్తోంది. దీని వెడల్పు 30 మీటర్లు మాత్రమే.ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా మధ్య ప్రయాణించే నౌకల మధ్య మాండెబ్ జలసంధి ఒక గేట్‌వేలా పనిచేస్తోంది. నిత్యం ఈ మార్గంలో 45 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా అవుతోంది. అంతర్జాతీయ వాణిజ్యం లో 10-12 శాతం దీని గుండానే పయనిస్తోంది. ప్రధానమైన మార్కెట్ల మధ్య ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ), తయారీ వస్తువులు, ఆహార పదార్థాలు ఈ మార్గంలోనే రవాణా అవుతున్నాయి. ఏటా రూ.93.95 లక్షల కోట్ల విలువైన సరకులు మాండెబ్ జలసంధి గుండా రవాణా అవుతున్నట్లు అంచనా. తన అజమాయిషీ లో పనిచేసే హూతీలను ఇప్పటికే మాండెబ్ మార్గంలో ఇరాన్ మోహరించింది. యెమెన్‌లోని ఈ ముఠా.. ఎర్ర సముద్ర తీరంలోని కొన్ని భాగాలను నియంత్రిస్తోంది. సముద్రంలోని లక్ష్యాలపై దాడి చేసే సామర్థ్యం ఈ ముఠాకు ఉంది. 2023 అక్టోబరు 7న గాజా యుద్ధం చెలరేగాక.. పాలస్తీనావాసులకు సంఘీభావంగా హూతీలు రంగంలోకి దిగారు. ఇరాన్, చైనాలు అందించిన డ్రోన్లు, నౌకా విధ్వంసక క్షిపణులు, విస్ఫోటక బోట్లతో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకున్నాయి. దీంతో ప్రధాన నౌకాయాన కంపెనీలు వేరే మార్గంలో పయనించాల్సి వచ్చింది. 2 నెలల కాలంలో 134 నౌకలపై దాడి చేశారు. ఫలితంగా ఎర్ర సముద్ర వర్తక నడవాలో అంతర్జాతీయ వాణిజ్యం 60 శాతానికిపైగా తగ్గింది. ఇందులో చాలావరకూ పశ్చిమ దేశాలతో ముడిపడినవే. నాలుగు నౌకలు మునిగిపోయాయి. మాండెబ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధిస్తే సరకు రవాణా నౌకలు ఆఫ్రికాలోని దక్షిణ భాగం నుంచి పయనించాల్సి వస్తుంది. దీనివల్ల ప్రయాణ సమయంతోపాటు ఖర్చులూ పెరుగుతాయి. ఇది అంతిమంగా చమురు ధరల పెరుగుదలకు, ఇంధన మార్కెట్‌లో మరింత అస్థిరతకు దారితీయవచ్చు. అయితే ఈ జలసంధి దిగ్బంధనానికి ప్రయత్నిస్తే అమెరికా గట్టిగా ప్రతిఘటించవచ్చు. మాండెబ్ జలసంధిలో జిబౌటి వైపున అగ్రరాజ్యానికి భారీ సైనిక స్థావరం ఉంది.

# అల్లకల్లోలంలో సముద్ర వాణిజ్యం



ఆధునిక ప్రపంచ వాణిజ్యంలో 80% నుండి 90% వరకు నిత్యావసర సరకులు సముద్రమార్గం ద్వారానే రవాణా అవుతుంటాయి. ఇంధనం, దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆహార పదార్థాలు, కాఫీగింజలు ఇవన్నీ ఒక దేశం నుంచి మరో దేశానికి నౌకల ద్వారానే రవాణా అవుతుంటాయి. రోడ్లు, విమానాలద్వారా కన్నా నౌకలద్వారా రవాణాకు తక్కువ ఖర్చు అవుతుంది. ప్రపంచ జిడిపిలో సముద్ర వాణిజ్యం సుమారు 60% వాటాను కలిగి ఉంది. అంతర్జాతీయ వాణిజ్యానికి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర రవాణా వెన్నెముక వంటిది. హోర్ముజ్, ఎర్రసముద్రం, సూయెజ్ కాలువల ద్వారా జరిగే సముద్ర వాణిజ్య నౌకల రవాణాలో ఎలాంటి అవాంతరాలు వచ్చినా అది ప్రపంచం మొత్తంమీద వాణిజ్యంపై విపరీత ప్రభావం చూపిస్తుంది. కొన్ని నౌకలపై దాడులు జరిగినా మొత్తం సముద్ర రవాణా మార్గాల మూసివేతకు దారి తీస్తుంది. ఇప్పుడు హోర్ముజ్ జలసంధిద్వారా జరిగే వాణిజ్య నౌకల రవాణా ఎలాంటి సంక్షోభంలో అల్లాడుతోందో మనం చూస్తున్నాం. ఇరాన్, ఉక్రెయిన్, అమెరికా దేశాలు వాణిజ్య నౌకలను టార్గెట్ చేసుకుని దాడులు సాగిస్తుండడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమైన పరిణామంగా మారుతోంది. ఇరాన్ యుద్ధం మొదటి రెండు వారాల్లోనే ఆయిల్ టాంకర్లతోసహా మొత్తం 16 సరకుల రవాణా నౌకలు దాడికి గురయ్యాయి. ఇవి కాక వందలాది నౌకలు గల్ఫ్ జలసంధిలో చిక్కుకున్నాయి. దీంతో చమురు, గ్యాస్, ఎరువులు, అల్యూమినియం, సల్ఫర్, హీలియం తదితర అనేక సరకులు కరువైపోతున్నాయి. ఇరాన్ తన వ్యూహం మార్చుకుని భూతల, గగన దాడుల కన్నా సముద్ర వాణిజ్య నౌకలపైనే దాడులు సాగిస్తూ సముద్ర వాణిజ్యాన్ని మొత్తం తన గుప్పిటలో బందీగా చేసుకుంటోంది. మరోవైపు ఉక్రెయిన్ కూడా రష్యా వాణిజ్య నౌకలపై దాడులు ప్రారంభించింది. రష్యా చమురు ఎగుమతి యంత్రాంగంలో 40 శాతాన్ని స్తంభింపచేసింది. రేవులపైన, పైపులైన్లపైనా ఉక్రెయిన్ దాడులు కొనసాగిస్తుండడంతో రష్యా నుంచి చమురు సరఫరా దెబ్బతింటోంది. రోజువారీ సరఫరాలో 2 మిలియన్ బ్యారెళ్ల వరకు తగ్గిపోతోంది. మరిన్ని కనుగొనండి ప్రాంతీయ వంటకాల రెసిపీ పుస్తకాలు ఆరోగ్య బీమా పథకాలు ఎలక్ట్రానిక్ పేపర్ సభ్యత్వం ఇది భారత్ రోజువారీ వినియోగంలో మూడో వంతు కన్నా ఎక్కువ. దీనికి తోడు రష్యా రహస్య నౌకాదళం ట్యాంకర్లను ఐరోపా ముట్టడించడంతో సరఫరా మరింత దెబ్బతింది. ప్రపంచ వాణిజ్యంపై ఈ ప్రభావం ఎంతో ఇప్పుడు చెప్పడం కష్టం. అంతర్జాతీయ చట్టాల ప్రకారం సైనిక కార్యకలాపాలతో సంబంధం లేని వాణిజ్య నౌకలపై ఎలాంటి దాడులు చేయకూడదు. ఈ వాణిజ్య నౌకలు సైనిక కార్యకలాపాలకు సహాయం చేసినా, ఆయుధాలను రవాణా చేసినా లేదా శత్రువుకు మద్దతుగా పనిచేసినా అప్పుడు వాటిని సైనిక లక్ష్యాలుగా భావించి దాడిచేసే అవకాశం ఉంటుంది. సముద్రంలో ప్రయాణించే వాణిజ్య నౌకలు సాధారణ పౌర ఆస్తులుగా పరిగణించబడతాయి. ఐక్యరాజ్యసమితి చార్టర్, సముద్ర చట్టాల కన్వెన్షన్ ప్రకారం సాధారణ పరిస్థితుల్లో వాణిజ్య నౌకలకు రక్షణ కల్పించడం ముఖ్యమైన కర్తవ్యం. పశ్చిమాసియా యుద్ధం బీభత్సంగా మారడంతో తన వాణిజ్య నౌకల రక్షణ కోసం అంతర్జాతీయ నిబంధనల ప్రకారం భారత్ నౌకాదళం యుద్ధ నౌకలను మోహరింప చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు హోర్ముజ్ జలసంధి సంక్షోభం మాదిరిగానే రెండేళ్ల క్రితం ఎర్రసముద్ర రవాణా మార్గం లోనూ సంఘర్షణ జరిగింది. రష్యా నుంచి చమురు తీసుకుని వస్తున్న బ్రిటన్‌కు చెందిన మార్టిన్ లువాండా అనే నౌకపై ఎర్రసముద్ర మార్గంలో హోతీలు దాడులు చేయడంతో మంటలు చెలరేగి పెను ప్రమాదం సంభవించింది. దాంతో భారత్‌కు చెందిన ఐఎన్ఎస్ విశాఖ యుద్ధ నౌక అప్రమత్తమై ఆ నౌకను మంటల నుంచి రక్షించింది. దీంతో రవాణా సంస్థలన్నీ తమ సముద్ర మార్గాలను మార్చుకోవలసి వచ్చింది. ఇది జరిగి రెండేళ్లయినా ఎర్రసముద్ర రవాణా మార్గం ఇంకా సాధారణ స్థితికి రాకపోవడం గమనార్హం. యుద్ధంలో వాణిజ్య నౌకలపై దాడులు చేయడం వల్ల వచ్చే అనర్థాలను మనం మరిచిపోయినట్టుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ 2426, అమెరికా 1768 వాణిజ్య నౌకలను కోల్పోయాయి. ప్రపంచంలోనే మూడో అతిభారీ ప్యాసింజర్, కార్గో నౌకలను సమకూర్చుకున్న జపాన్ ఈ రెండో ప్రపంచ యుద్ధంలో 2346 వాణిజ్య నౌకలను కోల్పోయింది. ఇంకా తేలని లక్షలాది ఓటర్ల భవిత ఈ యుద్ధం పూర్తయ్యేసరికి కనీసం 1000 టన్నులకు మించి సామర్థం కలిగిన ఒక్క నౌకను కూడా దక్కించుకోలేకపోయింది. ఆ రోజుల్లో యుద్ధాలన్నీ కేవలం మిలిటరీ సామర్థాల బట్టే జరిగేవి. భారీ నౌకలను మిలిటరీయే ధ్వంసం చేసేది. కానీ ఇప్పుడు అలా కాదు, సాంకేతికంగా ఎన్నో వ్యూహాలు రూపొందుతున్నాయి. ఒక్క బటన్ నొక్కితే టార్గెట్ ప్రకారం అంతా ధ్వంసమైపోతోంది. ఇరాన్, ఉక్రెయిన్, హోతీ దళాలు ఇప్పుడు యుద్ధంలో విధ్వంసానికి భారీ క్షిపణులను వినియోగించడం లేదు. కేవలం కొన్ని వేల డాలర్ల ఖర్చుతో తయారయ్యే అత్యల్ప డ్రోన్లతోనే లక్షాలను సాధించుకుం టున్నాయి. ప్రభుత్వాల మద్దతుతో దుండగులు సృష్టించగల విధ్వంసం ఎలా ఉంటుందో స్పష్టంగా కనిపిస్తోంది. భూతల, గగనమార్గాలు కాకుండా సముద్ర మార్గాలే రణరంగాలుగా మారుతున్నాయి. ఆర్థిక సంక్షోభానికి దారితీస్తున్నాయి. అందువల్ల సముద్రమార్గాలను సురక్షితంగా అందరికీ అందుబాటులో ఉంచేలా కొత్తగా దేశాల మధ్య ఏకాభిప్రాయాన్ని పెంపొందించడానికి తగిన చర్యలు చేపట్టే అవసరం ఏర్పడింది. ఈ విషయంలో అమెరికాయే చొరవ తీసుకుంటుందన్న అభిప్రాయం వినిపించినా నమ్మకం కుదరడం లేదు.

## కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం దారుణం

### డిమాండ్ బుక్స్‌లో అవుట్ కమ్ బడ్జెట్ ముద్రించారు

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ జగదీశ్ రెడ్డి

హైదరాబాద్,మార్చి28 : కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. బడ్జెట్‌కు సంబంధించి డిమాండ్ బుక్, అవుట్ కమ్ బడ్జెట్ బుక్ ఒకేలా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారో? సర్కస్ నడిపిస్తున్నారో అర్థం కావడం లేదంటే నిప్పులు చెరిగారు. జగదీశ్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. డిమాండ్ బుక్స్‌లో అవుట్ కమ్ బడ్జెట్ ముద్రించారని తెలిపారు. అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి తన సొంత ఆర్థిక కారణాలపై బిజీగా ఉన్నట్లు అనిపిస్తుందని విమర్శించారు. తప్పు చేసి సరిదిద్దుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవుట్ కమ్ బ్జడెట్, ఈ ఏడాది గ్రాంట్స్ బుక్‌లు ఒకేలా ఉన్నాయని విమర్శించారు. గతంలో సాధించిన ఫలితాలు, ఈ ఏడాది గ్రాంట్స్‌పై ప్రభుత్వానికి స్పష్టత లేదని అన్నారు. డిమాండ్ బుక్, అవుట్ కమ్ బ్జడెట్ బుక్ ఒకేలా కాపీ పెస్ట్ చేశారని అన్నారు. ఉన్నది ఉన్నట్లు రెండు బుక్‌లు తయారుచేస్తే.. ప్రభుత్వం ఎలా నడుపుతున్నారని ప్రశ్నించారు. పవిత్రమైన అసెంబ్లీలో ప్రవేశపెట్టే బిల్లులపై ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ఇది పొరపాటు కాదు నేరమే అని స్పష్టం చేశారు. తక్షణమే తప్పును సర్దుకొని సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సభలో ఇదే విషయమై మాట్లాడతానని స్పష్టం చేశారు.

## గోదావరిలోకి దూకి తల్లీబిడ్డల ఆత్మహత్యాయత్నం

### వెంటనే నదిలోకి కాపాడిన మత్స్యకారులు

భద్రాచలం,మార్చి28 : భద్రాచలం గోదావరి వంతెన పై శనివారం మధ్యాహ్నం తీవ్ర కలకలం రేగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన ఓ మహిళ తన చిన్నారితో సహా వంతెనపై నుంచి నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.స్థానికుల కథనం ప్రకారం పాల్వంచకు చెందిన ఆ మహిళ శనివారం మధ్యాహ్నం తన బిడ్డతో కలిసి భద్రాచలం గోదావరి వంతెన వద్దకు చేరుకుని చిన్నారితో సహ నదిలోకి దూకింది. గమనించిన ప్రయాణికులు, స్థానికులు ఒక్కసారిగా కేకలు వేయడంతో స్థానికంగా ఉన్న మత్స్యకారులు వారిని వెంటనే కాపాడారు. క్షేమంగా తల్లీబిడ్డను బయటకు తీసుకువచ్చి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం వారిద్దరి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వారి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

## వారం రోజుల వ్యవధిలో ఇద్దరు ఉద్యోగుల మృతి

### ఆకస్మిక గుండెపోటుతో మృతిపై ఆందోళన

హైదరాబాద్ : హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ స్థాయి వ్యవసాయ పరిశోధన, విద్యా నిర్వహణ సంస్థలో వరుస గుండెపోటు మరణాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఉద్యోగులు మరణించడం అక్కడి సిబ్బందిని దిగ్భ్రాంతికి గురిచేసింది. తాజాగా శుక్రవారం రాత్రి అనిల్ కుమార్ అనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి మరణించాడు. బిహార్‌కు చెందిన అనిల్ కుమార్ ట్రైనింగ్ నిమిత్తం హైదరాబాద్‌లోని నార్మ్‌కు వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఆకస్మికంగా ఛాతిలో నొప్పి అంటూ కుప్పకూలాడు. అతనికి చికిత్స అందించేలోపే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. గత ఆదివారం కూడా నార్మ్‌లో విషాదం చోటుచేసుకుంది. సైంటిస్ట్ దామోదర్ రాత్రి భోజనం చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుతో మరణించాడు. ఇలా వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఉద్యోగులు గుండెపోటుతో మరణించడంతో నార్మ్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## మంటలు చెలరేగి కారు దగ్ధం

యాదాద్రి భువనగిరి,మార్చి28 : బీబీనగర్ మండలం పరిధిలో జైన్ కంపెనీ సమీపంలో కేపాల్ వద్ద ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ కారు వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కారు ఇంజిన్ నుంచి మంటలు రావడాన్ని గమనించిన కారు యజమాని అప్రమత్తమై వాహనం ఆపి, అందులో నుంచి దిగడంతో ప్రాణాపాయం తప్పింది. ఇది గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కానీ మంటలు వేగంగా వ్యాపించడంతో కారు మాత్రం పూర్తిగ్గా దగ్ధమైంది.

## అందరూ చెడ్డవాళ్లు కాదు


'మనుషులందరూ స్వార్థపరులే. దయగలిగిన వారు, సహాయం చేయాలన్న తలంపు ఉన్నవారు లేరుగాక లేరు' అని నాలుగు రోడ్ల కూడలిలో నిలబడి ఓ మహిళ గట్టిగా నిష్ఠూరపడింది. అదే దారిన వెళ్తున్న ఒక జ్ఞాని అది గమనించాడు. ఆమెను దగ్గరికి పిలిచాడు. 'అందరూ అలా ఉండరు. మంచి హృదయం, నిజాయతీ ఉన్నవాళ్లు ఎందరో ఈ సమాజంలో ఉన్నారు. నీకు ఆ విషయం అర్థం కావాలంటే నాకు తెలిసిన పాత కథ ఒకటి చెబుతాను విను' అన్నాడు. ఆమె ఆశ్చర్యపోతూ 'నిజంగా మంచి మనుషులు ఉన్నారంటారా?' అని మళ్లీ అడిగింది. దానికి జ్ఞాని నవ్వి 'ఒక ఊరిలో ఓ బంగారు వ్యాపారి ఉండేవాడు. ఒక రోజు ఉదయం అతని అంగడి చాలా రద్దీగా ఉంది. అప్పుడే ఒక భిక్షగాడు అక్కడికి వచ్చాడు. ఆ అంగడికి ఏ భిక్షగాడు వచ్చినా ఆ వ్యాపారి భిక్షం వేయకుండా ఉండడు. అలాగే ఆ రోజు కూడా దానం చేశాడు. కానీ వ్యాపార ఒత్తిడిలో గమనించకుండా మామూలు నాణేనికి బదులు ఒక బంగారు నాణేన్ని ఆ భిక్షగాడికి ఇచ్చాడు. భోజన విరామానికని అంగడి కట్టేసే సమయంలో లెక్క చూసుకున్నాడు. పొరపాటుగా భిక్షగాడికి బంగారు నాణేన్ని ఇచ్చేశానని గుర్తించాడు. ఇంతలో అతని భార్య అక్కడికి వచ్చింది. భర్త చేసిన నిర్వాకానికి తిట్ల దండకం అందుకుంది. ఏమి చెయ్యాలో ఆ వ్యాపారికి అర్థం కాలేదు. మధ్యాహ్నం భిక్షగాళ్లందరూ శివాలయం దగ్గర చేరి సేద తీరుతారని తెలుసుకున్నాడు. ఎండలకి అస్సుబుస్సుమని చెమట కార్చుకుంటూ అక్కడికి బయలుదేరాడు. కొద్దిదూరం నడిచాడో లేదో ఆ భిక్షగాడు ఎదురు వచ్చాడు. 'తెలియక నేను బంగారు నాణేన్ని ఇచ్చినా.. ఎలా తీసుకొని వెళ్లిపోయావని' కోపంగా అరవబోయాడు. అయితే ఆ భిక్షగాడు వినమ్రంగా నమస్కరించి 'మీరు పొరపాటుగా నాకు బంగారు నాణేన్ని ఇచ్చారు. ఇంత ఖరీదైన దాన్ని నేను ఏమి చేసుకోను? నాకు కావాల్సింది పూటకు పిడికెడు మెతుకులు. అందుకే నేను మీకు దీన్ని వెనక్కి ఇవ్వడానికి వస్తున్నాను' అని చెప్పి దాన్ని ఇచ్చేసి అక్కడినుంచి వెళ్లిపోయాడు. ఆశ్చర్యపోవడం వ్యాపారి వంతు అయ్యింది' అని కథ చెప్పడం ముగించాడు.



ఆధ్యాత్మికం

# తక్కువ క్రెడిట్ స్కోర్‌తో బోలెడు సమస్యలు..

## ఈ టిప్స్ పాటిస్తే సమస్యలు ఫసక్..!




భారతదేశంలో ఇటీవల కాలంలో పెరిగిన టెక్నాలజీ కారణంగా బ్యాంకింగ్ రంగంలో కీలక మార్పులు వచ్చాయి. ముఖ్యంగా లోన్ ఇవ్వడానికి బ్యాంకులు కస్టమర్ చెల్లింపు పరిస్థితిని తెలుసుకోవడానికి వివిధ మార్గాలను ఎంచుకుంటున్నాయి. పెరిగిన ఖర్చులు, అవసరాల నేపథ్యంలో లోన్ తీసుకోవడం అనేది ప్రస్తుత రోజుల్లో సర్వసాధారణమైంది. అయితే లోన్ తీసుకోవడానికి బ్యాంకుకు వెళ్లినప్పుడు లోన్ ఇవ్వడానికి బ్యాంకులు నిరాకరిస్తూ ఉంటాయి. ముఖ్యంగా బ్యాంకులు లోన్ ఇవ్వడానికి కస్టమర్ క్రెడిట్ స్కోర్‌ను పరిగణలోకి తీసుకుంటున్నాయి. అయితే క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉంటే చాలా సింపుల్‌గా రుణాన్ని రిజెక్ట్ చేస్తూ ఉంటాయి. కస్టమర్లు చేసే కొన్ని తప్పుల కారణంగా తక్కువ సిబిల్ స్కోర్ ఉంటుందని చాలా మందికి తెలియదు. ఈ నేపథ్యంలో లోన్ రిజెక్ట్ కాకుండా ఉండడానికి మెరుగైన క్రెడిట్ స్కోర్ ఎలా మెయింటెన్ చేయాలో? ఓసారి తెలుసుకుందాం. బిల్లుల చెల్లింపు మంచి క్రెడిట్ స్కోర్ మెయింటేన్ చేయాలంటే మీ క్రెడిట్ కార్డ్ బిల్లులు, లోన్ ఈఎంఐలు, ఇతర బకాయిలను సకాలంలో చెల్లించాలని నిపుణులు చెబుతున్నారు. చెల్లింపులు ఆలస్యంగా చేయడం వల్ల క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని వివరిస్తున్నారు. క్రెడిట్ కార్డుల వినియోగం కస్టమర్లు వారి వద్ద ఉన్న క్రెడిట్ కార్డుల్లో వినియోగ పరిమితిని 30 శాతం కంటే తక్కువ ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. అధిక క్రెడిట్ వినియోగం ఆర్థిక ఇబ్బందులను సూచిస్తుందని తద్వారా క్రెడిట్ స్కోర్‌ను తగ్గిస్తుందని పేర్కొంటున్నారు. రుణాల మిశ్రమం సాధారణంగా మన అవసరానికి సంబంధించి తీసుకున్న రుణాలు మన క్రెడిట్ స్కోర్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. సెక్యూర్డ్ రుణాలు అంటే గృహ రుణాలు వంటివి, అలాగే అసురక్షిత క్రెడిట్ అంటే క్రెడిట్ కార్డ్‌ల వంటివి ఉపయోగించే సమయంలో జాగ్రత్త వహించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా క్రెడిట్ కార్డుల తీసుకునే సమయంలో మనకు అవసరమైన క్రెడిట్‌ను మాత్రమే తీసుకోవాలని పేర్కొంటున్నారు. లోన్ అప్లికేషన్ల వినియోగం మీరు లోన్ లేదా క్రెడిట్ కార్డ్ కోసం దరఖాస్తు చేసిన ప్రతిసారీ రుణదాత మీ క్రెడిట్ స్కోర్‌ను తనిఖీ చేస్తాడు. ఫలితంగా మీ రుణ అవసరాన్ని బేరీజు వేసుకుని మీ క్రెడిట్ స్కోర్ తగ్గే ప్రమాదం ఉంది. అందువల్ల లోన్ తీసుకోవాలని అనుకున్నప్పుడు 15 రోజుల వ్యవధిలోనే మీకు అవసరమైన బ్యాంకులకు వెళ్లి రుణ వడ్డీ రేట్లను కనుగొనడం ఉత్తమం. ఇలా చేయడం ద్వారా క్రెడిట్ స్కోర్ తగ్గదని నిపుణులు పేర్కొంటున్నారు. క్రెడిట్ నివేదిక లోపాలు లేదా అనధికారిక లావాదేవీలు లేవని నిర్ధారించుకోవడానికి మీ క్రెడిట్ నివేదికను కాలానుగుణంగా సమీక్షించడం ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మీరు ఏవైనా వ్యత్యాసాలను కనుగొంటే వాటిని సరిదిద్దడానికి వెంటనే సంబంధిత ఏజెన్సీకు నివేదించాలని సూచిస్తున్నారు.

# ప్రయాణికులకు శుభవార్త! ఈ అన్ని రైల్వే స్టేషన్లలో టికెట్ల కోసం డిజిటల్ చెల్లింపు సదుపాయం




రైల్వే ప్రయాణికులకు శుభవార్త. ఇప్పుడు రైల్వే స్టేషన్లలో రైలు టిక్కెట్లు కొనుగోలు చేసేటప్పుడు ప్రయాణీకులు  కోడ్ ద్వారా డిజిటల్‌గా ఛార్జీలను చెల్లించవచ్చు. పశ్చిమ రైల్వేలు గుజరాత్‌లోని రాజ్‌కోట్, భావ్‌నగర్ డివిజన్‌లలోని అన్ని స్టేషన్లలో  కోడ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇక త్వరలో అన్ని స్టేషన్‌లలో ఈ విధానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ కొత్త కార్యక్రమం కింద రాజ్‌కోట్ డివిజన్‌లోని రాజ్‌కోట్, జామ్‌నగర్, సురేంద్రనగర్, ద్వారక సహా అన్ని చిన్న, పెద్ద స్టేషన్‌లలోని అన్ని రిజర్వ్‌డ్, అన్‌రిజర్వ్‌డ్ టికెట్ కౌంటర్లలో క్యూఆర్ కోడ్ ద్వారా రైల్వే టిక్కెట్‌ల చెల్లింపును అంగీకరించే సౌకర్యం కల్పించామని డివిజనల్ రైల్వే ప్రతినిధి తెలిపారు. డివిజనల్ రైల్వే మేనేజర్ అశ్వనీ కుమార్, భావ్‌నగర్ డివిజనల్ రైల్వే మేనేజర్ రవీష్ కుమార్ లు క్యూఆర్ కోడ్‌ని ఉపయోగించి టికెట్ ఛార్జీలను డిజిటల్‌గా చెల్లించాలని ప్రయాణికులను అభ్యర్థించారు. భావ్‌నగర్ డివిజన్‌లోని భావ్‌నగర్ టెర్మినస్, బోటాడ్, గాంధీగ్రామ్, జునాగఢ్, పోర్ బందర్, వెరావల్‌తో సహా అన్ని చిన్న, పెద్ద స్టేషన్‌లలోని అన్ని రిజర్వ్ చేయబడిన, రిజర్వ్ చేయని టికెట్ కౌంటర్లలో  కోడ్ ద్వారా రైల్వే టిక్కెట్‌ల చెల్లింపును అంగీకరించే సౌకర్యం అందించారు. రాజ్‌కోట్, భావ్‌నగర్ డివిజన్ డిజిటల్ చెల్లింపు పద్ధతులను ఉపయోగించి నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడానికి, ప్రయాణీకులకు సాఫీగా, మరింత సమర్థవంతమైన సేవలను అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నాయి. డివిజన్‌లోని రిజర్వేషన్ కార్యాలయం, బుకింగ్ కార్యాలయం అన్ని కౌంటర్లలో  కోడ్ పరికరాలు అమర్చారు. రైల్వే ప్రయాణికులు టిక్కెట్ ఛార్జీలు చెల్లించేందుకు క్యూఆర్ కోడ్ డిజిటల్ మాధ్యమం సౌకర్యం కల్పిస్తున్నారు. ౖరెల్వే ప్రయాణికులు ఇప్పటికే యూటీఎస్ మొబైల్ యాప్, వంటి వివిధ డిజిటల్ చెల్లింపు ఎంపికలను టిక్కెట్ ఛార్జీని చెల్లించడానికి అందుబాటులో ఉన్నాయి. ఈ రకమైన డిజిటల్ చెల్లింపు వ్యవస్థను మరింత ఉపయోగకరంగా, సాఫీగా మార్చే లక్ష్యంతో, రాజ్‌కోట్ డివిజన్ దీనిని విస్తరించింది. ఈ కొత్త డిజిటల్ చెల్లింపు విధానం ఇప్పుడు క్యూఆర్ కోడ్ ద్వారా టిక్కెట్ ఛార్జీలు చెల్లించడానికి ప్రయాణీకులకు మరింత సౌలభ్యాన్ని అందిస్తుంది. దీని ద్వారా ఏ ప్రయాణీకుడైనా తన టికెట్ ఛార్జీలను సజావుగా, ఎలాంటి ఇబ్బంది లేకుండా చెల్లించవచ్చు.

# అద్దె ఒప్పందం 11 నెలలకే ఎందుకు చేసుకుంటారో తెలుసా.?




ఇంటి కోసం లేదా దుకాణం కోసం అద్దెకు తీసుకోవడం సర్వసాధారణమైన విషయం. దేశంలో చాలా సొంతింటిలో ఉంటున్న వారి కంటే, సొంత దుకాణాల్లో వ్యాపారాలు చేస్తున్న వారి కంటే అద్దె ఇంట్లో ఉంటున్న వారే ఎక్కువని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే అద్దెకు తీసుకునే సమయంలో రెంటల్ అగ్రిమెంట్ చేసుకుంటారని మనకు తెలిసిందే. అద్దెకు ఇచ్చే వారికి, అద్దె తీసుకునే వారి మధ్య ఈ ఒప్పందం జరుగుతుంటుంది. రెంటల్ అగ్రిమెంట్‌లో యజమాని పేరు, చిరునామా, అద్దె మొత్తం ఎంత.? ఎంత వ్యవధి కోసం అద్దె తీసుకుంటున్నారు, ఇంకా ఏమైనా ఇతర నిబంధనలు లేదా షరతులు ఉంటే వాటిని అందులో పేర్కొంటారు. అద్దె ఒప్పందం అనేది ఒక రకమై లీజు ఒప్పందం లాంటిది. వీటిని వైట్ పేపర్స్‌పై లేదా, బాండ్ పేపర్‌పై రాసి సాక్ష్యుల సమక్షంలో ఒప్పందాలు చేసుకుంటారు. అయితే చాలా వరకు రెంటల్ అగ్రిమెంట్స్ 11 నెలల వ్యవధికి మాత్రమే చేసుకుంటారు. అయితే 11 నెలలకే రెంటల్ అగ్రిమెంట్ ఎందుకు చేసుకుంటారన్న దానిపై ఎప్పుడైనా సందేహం వచ్చిందా.? దీని వెనకాల అసలు కారణం ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. 11 నెలలకు రెంటల్ అగ్రిమెంట్ చేసుకోవడానికి కారణాల్లో రిజిస్ట్రేషన్ చట్టం 108 ఒకటి. రిజిస్ట్రేషన్ చట్టం 1908లో సెక్షన్ 17 నిబంధనల ప్రకారం ఏడాది కంటే తక్కువ లీజు ఒప్పందం చేసుకోవడం కుదరదు. ఏడాదికి లీజు ఒప్పందం చేసుకుంటే రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. ఇదంతా కాస్త వ్యయప్రయాసలతో కూడుకున్న అంశం కావడంతో చాలా మంది కేవలం 11 నెలలకే రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. తిరిగి 11వ తనెల పూర్తి కాగానే మళ్లీ, మరో 11 నెలలకు రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. ఇదండీ 11 నెలల రెంటల్ అగ్రిమెంట్ వెనకాల ఉన్న అసలు ఉద్దేశం.

# 21 ఏళ్లలో రూ. 70 లక్షలు.. నెలకు ఎంత సేవ్ చేయాలంటే..



సంపాదించిన దాంట్లో ఎంతో కొంత సేవ్ చేసుకోవాలని ప్రతీ ఒక్కరూ కోరుకుంటారు. అయితే ఇది వారి వారి ఆదాయాలకు అనుగుణంగా మారుతుంటుంది. సంపాదించే ప్రతీ ఒక్కరూ సేవింగ్స్ చేయాలని ఆర్థిక నిపుణులు సైతం చెబుతుంటారు. ఒకప్పుడు కర్చు పెట్టిన తర్వాత మిగిలిన మొత్తాన్ని సేవ్ చేసే వారు. కానీ ప్రస్తుతం పొదుపు చేసిన తర్వాత మిగిలిన మొత్తాన్నే ఖర్చు చేస్తున్నారు. ఇక పెట్టుబడి పెట్టేందుకు ఎన్నో రకాల పథకాలు అందుబాటులో ఉన్నాయి. కష్టపడి సంపాదించిన సొమ్ముకు భద్రతతో పాటు, మంచి రిటర్న్ రావాలని ప్రతీ ఒక్కరూ ఆశిస్తుంటారు. అలాంటి వారి కోసమే కేంద్ర ప్రభుత్వ సంస్థ పోస్టాఫీస్ పలు రకాల పథకాలను అందిస్తోంది. ఇలాంటి బెస్ట్ స్కీమ్స్‌లో సుకన్య సమృద్ధి యోజన ఒకటి. బాలికల బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో రూ. 250 నుంచి గరిష్టంగా ఏడాదికి రూ. 1.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టొచ్చు. ఈ పథకంలో మొత్తం 15 ఏళ్లు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. 21 ఏళ్ల తర్వాత మెచ్యూరిటీ లభిస్తుంది. మరి ఈ పథకంలో భాగంగా రూ. 70 లక్షలు పొందాలంటే నెలకు ఎంత ఇన్వెస్ట్ చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. మీ కూతురు పుట్టిన రోజు నుంచే సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని ప్రారంభించి ఏటా రూ. 1.5 లక్ష డిపాజిట్ చేశారనుకుందాం. ఈ లెక్కన మీరు ప్రతీ నెల రూ. 12,500 సేవ్ చేయాల్సి ఉంటుంది. ఇలా 15 ఏళ్లు పెట్టుబడి పెడితే మొత్తం రూ. 22,50,000 అవుతుంది. ప్రస్తుతం ఈ పథకానికి 8.2 శాతం వడ్డీ లభిస్తోంది. 21 ఏళ్ల తర్వాత మెచ్యూరిటీ సమయంలో ర. 46,77,578 వడ్డీగా పొందుతారు. దీంతో మీ కూతురు 21 ఏళ్ల నాటికి అసలు, వడ్డీతో కలిపి మొత్తం రూ. 69,27,578 అంటే సుమారు రూ.70 లక్షలు పొందొచ్చు.ఉదాహరణకు మీరు ఒకవేళ 2024 సెప్టెంబర్‌లో ఈ పథకంలో చేరితే మీకు 2045 నాటికి రూ.7 లక్షలు పొందొచన్నమాట.ఇక ఈ పథకంలో పెట్టుబడిఎట్టినవారికి1961లోనిసెక్షన్80%కిందపన్నుఆదాఅవకాశం కూడా లభిస్తుంది.




# దృష్టి లోపం ఉన్న వారికి కూడా మేలైన బ్యాంకింగ్ సేవలు..

### బ్రెయిలీ డెబిట్ కార్డు లాంచ్ ద్వారా ఆ సమస్యలు దూరం




భారతదేశంలో ఇటీవల కాలంలో బ్యాంకింగ్ సేవలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వివిధ సంక్షేమ పథకాల లబ్ధిని బ్యాంకు ఖాతాల ద్వారానే లబ్ధిదారులకు అందిస్తున్నాయి. ముఖ్యంగా జన్-ధన్-ఖాతాలు భారతదేశంలో బ్యాంకింగ్ విప్లవాన్నే సృష్టించాయని చెప్పాలి. భారతదేశ పౌరులందరికీ జీరో బ్యాలెన్స్ అకౌంట్ల ద్వారా బ్యాంకింగ్ సేవలను అన్ని బ్యాంకులు అందించాయి. ముఖ్యంగా డెబిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు కూడా పెరిగాయి. డబ్బు విత్‌డ్రా చేసుకోవడానికి బ్యాంకులకు వెళ్లే అవసరం లేకుండా డెబిట్ కార్డులను ఉపయోగించి ఏటీఎంల ద్వారా నగదు విత్‌డ్రా చేసుకునే వారు ఇటీవల కాలంలో బాగా పెరిగారు. అయితే దృష్టి లోపం ఉన్న వారు బ్యాంకింగ్ సేవలను పొందడంలో ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా వారికంటూ ప్రత్యేక చర్యలు ఏవీ లేకపోవడంతో వారు ఇంకా నగదు డిపాజిట్, విత్‌డ్రా కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో దృష్టి లోపం ఉన్న వారికి పంజాబ్ నేషనల్ బ్యాంక్ గుడ్‌న్యూస్ చెప్పింది. బ్రెయిలీ డెబిట్ కార్డులను లాంచ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో పీఎన్‌బీ తీసుకున్న చర్యలు గురించి వివరాలను తెలుసుకుందాం. ప్రభుత్వ యాజమాన్యంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ దృష్టి లోపం ఉన్న కస్టమర్ల కోసం పీఎన్‌బీ అంత: దృష్టి పేరులో బ్రెయిలీ డెబిట్ కార్డ్‌ను ప్రారంభించింది. ఈ కాంటాక్ట్‌లెస్ నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ (ఎన్‌సీఎంసీ) డెబిట్ కార్డ్ రూపే నెట్‌వర్క్‌లో అందుబాటులో ఉందని పీఎన్‌బీ ఇటీవల ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త బ్రెయిలీ డెబిట్ కార్డ్‌ను ప్రవేశపెట్టడం అనేది చేరిక, ఆర్థిక సౌలభ్యంపై పీఎన్‌బీ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆ బ్యాంకు ప్రతినిధులు చెబుతున్నారు. ముఖ్యంగా దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించేందుకు పీఎన్‌బీ ఇలాంటి చర్యలను తీసుకుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇతర బ్యాంకులతో పోలిస్తే పీఎన్‌బీ దృష్టి లోపం ఉన్న కస్టమర్ల కోసం ప్రత్యేక చర్యలను తీసుకోవడం అభినందనీయమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దేశంలోని అందరికీ బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ఇలాంటి చర్యలు ఉపయోగపడతాయని వివరిస్తున్నారు.

## యూపీఐ నగదు చెల్లింపుల్లో ఆ తప్పు చేశారా..? ఈ టిప్స్ పాటిస్తే మీ సొమ్ము వాపస్




భారతదేశంలో 2016లో నోట్లను రద్దు చేశాక ఆన్‌లైన్ చెల్లింపులు ఊపందుకున్నాయి. ముఖ్యంగా ఎన్‌పీసీఐ అందుబాటులోకి తీసుకువచ్చిన యూపీఐ పేమెంట్స్ సదుపాయం ద్వారా చాలా మంది నగదును ఈజీగా బదిలీ చేస్తున్నారు. ముఖ్యంగా యూపీఐ చెల్లింపుల వల్ల దేశంలో చిల్లర సమస్యకు చెక్ పడినట్లు అయ్యింది. అలాగే వ్యక్తిగత బ్యాంకు అకౌంట్లకు నగదు బదిలీ కూడా బ్యాంకునకు వెళ్లాల్సిన అవసరం లేకుండా యూపీఐ చెల్లింపులు ద్వారా చేయడం ప్రజలకు అలవాటు అయ్యింది. అయితే యూపీఐ ద్వారా ఒక వ్యక్తికి పంపబోయి వేరే వ్యక్తికి నగదును బదిలీ చేస్తే అవి తిరిగి రావు అని చాలా మంది చెబుతూ ఉంటారు. కానీ, నిర్దిష్ట విధానాన్ని పాటించడం ద్వారా మనం పొరపాటున వేరే వ్యక్తికి బదిలీ చేసిన సొమ్మును వాపస్ పొందవచ్చని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో యూపీఐ ద్వారా వేరే వ్యక్తికి బదిలీ చేసిన సొమ్మును ఎలా వాపసు పొందవచ్చో? ఓసారి తెలుసుకుందాం. యూపీఐ ద్వారా బదిలీ చేసిన నగదు వాపసు పొందడం ఇలా మీరు ముందుగా ఏ యాప్ ద్వారా నగదు బదిలీ చేశారో? ఆ యాప్‌లో లావాదేవీ నెంబర్ ద్వారా టిక్కెట్ రైజ్ చేసి కంప్లైంట్ చేయాలి. అనంతరం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌ను సందర్శించి, 'వివాద పరిష్కార యంత్రాంగం' విభాగాన్ని సెలెక్ట్ చేసి ఆన్‌లైన్ ఫారమ్‌ను పూరించాలి. లావాదేవీ ఐడీ, వర్చువల్ చెల్లింపు చిరునామా, బదిలీ చేసిన మొత్తం, లావాదేవీ తేదీ, ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌తో సహా అవసరమైన వివరాలను అందించాలి. అనంతరం అకౌంట్‌లో సొమ్ము బదిలీ జరిగినట్లు మీ బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను అప్‌లోడ్ చేయాలి. అక్కడ మీ ఫిర్యాదుకు కారణం 'మరో ఖాతాకు తప్పుగా బదిలీ చేయబడింది' ఎంచుకోవాలి. అనంతరం మీ ఫిర్యాదు పరిష్కారమవుతుంది. ఒకవేళ సమస్య పరిష్కరించకపోతే ముందుగా టీపీఏపీ, తర్వాత పీఎస్‌పీ బ్యాంక్ (చెల్లింపు సర్వీస్ ప్రొవైడర్ బ్యాంక్), అనంతరం బ్యాంకును సమస్య పరిష్కారం కోసం సంప్రదించాలి. ఒక నెల తర్వాత కూడా సమస్య పరిష్కారం కాకపోతే లేదా ప్రతిస్పందనతో మీరు అసంతృప్తి చెందితే, డిజిటల్ లావాదేవీల కోసం ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌ని సంప్రదించాలి.

## ప్రత్యేక ఎఫ్‌డీలపై కాలపరిమితి పెంపు.. ఆ బ్యాంకుల్లో ప్రత్యేక ఆఫర్లు

భారతదేశంలో పెట్టుబడిదారులు నమ్మకమైన పెట్టుబడి ఎంపికగా ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఎంచుకుంటూ ఉంటారు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా బ్యాంకింగ్ రంగంలో వచ్చిన మార్పుల వల్ల ఎఫ్‌డీల కంటే మంచి పెట్టుబడి ఎంపికలు ప్రజాదరణ పొందుతున్నాయి. క్రమేపి బ్యాంకుల్లో ఎఫ్‌డీల్లో డిపాజిట్ చేసే వారి సంఖ్య క్రమేపి తగ్గుతుంది. ఈ నేపథ్యంలో కస్టమర్లను ఎఫ్‌డీల్లో పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహించడానికి చాలా బ్యాంకులు ప్రత్యేక ఎఫ్‌డీ స్కీమ్‌లను లాంచ్ చేస్తున్నాయి. సాధారణ ఎఫ్‌డీలతో పోలిస్తే ఈ ప్రత్యేక ఎఫ్‌డీలు అధిక వడ్డీను అందిస్తున్నాయి. తాజాగా ప్రముఖ బ్యాంకులు అన్నీ ప్రత్యేక ఎఫ్‌డీల కాలపరిమితిని పెంచాయి. ఈ నేపథ్యంలో ఏయే బ్యాంకులు ప్రత్యేక ఎఫ్‌డీలపై కాలపరిమితిని పెంచాయో? ఓ సారి తెలుసుకుందాం. పొడగింపులను ప్రకటించిన బ్యాంకులు ఇవే ఇండియన్ బ్యాంక్ తన ప్రత్యేక ఎఫ్‌డీల కోసం పొడిగింపును ప్రకటించింది. ఎఫ్‌డీ పెట్టుబడిదారులు సెప్టెంబర్ 30 వరకు ప్రత్యేక ఎఫ్‌డీ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. ఈ గడవు జూన్ 30తో ముగిసినా మరోసారి పెంచారు. ఐడీబీఐ బ్యాంక్‌కు సంబంధించిన ప్రత్యేక ఉత్సవ్ ఎఫ్‌డీల గడువు కూడా సెప్టెంబర్ 30, 2024 వరకు పొడిగించారు. వాస్తవానికి ఈ పథకం గడువు జూన్ 30, 2024న ముగిసినా వినియోగదారులను ఆకర్షించడానికి బ్యాంకు మరోసారి గడువును పొడగించింది. పంజాబ్ సింధ్ బ్యాంక్ లిమిటెడ్ పిరియడ్ ప్రత్యేక డిపాజిట్ల కాలపరిమితిని పెంచింది. ఈ గడువు సెప్టెంబర్ 30, 2024కి ముగుస్తుంది. ప్రముఖ బ్యాంకు ఎస్‌బీఐ కూడా ప్రత్యేక డిపాజిట్లపై కాలపరిమితిని పెంచింది. అమృత్ కలాష్ స్కీమ్, ఎస్‌బీఐ వీ కేర్ ఎఫ్‌డీల కాలపరిమితిని ఎస్‌బీఐ పెంచింది. ఎస్‌బీఐ కూడా ప్రత్యేక ఎఫ్‌డీలపై కాలపరిమితిని సెప్టెంబరు 30, 2024 వరకు పెంచింది.

# జీర్ణ సమస్యలతో బాధపడుతున్నారా? అయితే కాసిన్ని ఖర్జూరాలు తినండి..



ఏడాది పొడవునా మార్కెట్‌లో లభించే పండ్లలో ఖర్జూరం ఒకటి. వివిధ రకాల ఖర్జూరాలు మార్కెట్లో లభిస్తుంటాయి. అన్ని రకాల ఖర్జూరాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే వీటిని 'సూపర్ ఫుడ్' అని కూడా పిలుస్తారు. ప్రతిరోజూ ఖర్జూరం తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. రోజూ ఖర్జూరం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇక్కడ తెలుసుకుందాం. ఖర్జూరంలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇందులో మెగ్నీషియం, పొటాషియం, కాపర్, మాంగనీస్, విటమిన్ బి6, కె అధికంగా ఉంటాయి. విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే ఖర్జూరంలో పోషక విలువలు చాలా



ఎక్కువ. ఖర్జూరం తినడం వల్ల ఫ్రక్టోజ్, సుక్రోజ్ వంటి చక్కెరలు శరీరంలోకి ప్రవేశిస్తాయి. శరీరానికి వెంటనే శక్తి అందుతుంది. అందుకే ఉపవాసం తర్వాత ఖర్జూరం తినడం మంచిది. ఖర్జూరం పొట్టకు చాలా మంచిది. ఖర్జూరాలు జీర్ణక్రియలో సహాయపడతాయి. జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. పీచు పుష్కలంగా ఉండటం వల్ల మలబద్ధకం నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. ఖర్జూరం గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే ఖర్జూరాలు హృదయనాళ వ్యవస్థకు చాలా మేలు చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించే శక్తి కూడా ఖర్జూరాలకు అధికంగా ఉంటుంది. ఖర్జూరంలో చక్కెర ఉన్నప్పటికీ ఇవి రక్తంలో చక్కెరను పెంచవు. అయినప్పటికీ డయాబెడిస్ పేషెంట్లు వీటిని తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. ఖర్జూరాలు మెదడు ఆరోగ్యాన్ని పెంచడానికి, మెదడు పనితీరును పెంచడంలో సహాయపడతాయి.

# వీరికి సంజీవని ఈ పండు.. రోజూ ఒకటి తిన్నారంటే ఈ వ్యాధికి దీన్ని మించిన దివ్యౌషధం లేదు.!

రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా నియంత్రించడానికి అనేక మార్గాలు ఉన్నాయి. వాటిలో ఒకటి పండ్లు తినడం. కొన్ని పండ్లను తీసుకోవడం వల్ల సహజంగా మీ శరీరానికి ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. అలాంటి వాటిలో అవకాడో ఒకటి. దీనిని బటర్ ఫ్రూట్ అని కూడా పిలుస్తారు. ఈ పండు మన శరీరానికి చాలా పోషకాలను అందిస్తుంది. అవకాడోలో కూరగాయల మాదిరిగానే ఆరోగ్యకరమైన పదార్థాలు ఉంటాయి. ఇందులో కొవ్వు అధికంగా ఉన్నప్పటికీ, ఇది మీ శరీరాన్ని అదనపు కొవ్వు నుండి రక్షిస్తుంది.మీ శరీరం ఫోలిక్ యాసిడ్ వంటి విటమిన్లను ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది. కాబట్టి మీరు ఈ పండును పచ్చిగా తినవచ్చు. అవకాడో మీ శరీరంలో రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడానికి సహాయపడుతుంది. ఇది కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను కూడా నియంత్రణలో ఉంచుతుంది. అవకాడోను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల స్ట్రోక్ లేదా గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.అవకాడోలో ఉండే కొవ్వు ఆమ్లాలు, లైపేస్ ఎంజైమ్ శరీరంలోని కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. అవకాడోలో విటమిన్ బి, విటమిన్ కె, విటమిన్ ఇ, విటమిన్ సి పుష్కలంగా ఉన్నాయి. అవకాడోలో ఉండే పొటాషియం మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. మీ రక్తపోటును అదుపులో ఉంచుతుంది. అవకాడోలో ఉండే ఫైబర్ మీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.



## కొబ్బరినీళ్లు తాగే అలవాటుందా..? ఈ సమస్యలున్న వారు అస్సలు తాగకూడదంట.. ఇక మీ ఇష్టం..

ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఈ తరుణంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం.. ముఖ్యంగా ఎండాకాలంలో చాలామంది డీహైడ్రేషన్ సమస్యతో బాధపడుతుంటారు. వాస్తవానికి.. శరీరంలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఒకవేళ నీటిశాతం తగ్గితే.. అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. బాడీ డీహైడ్రేషన్‌కు గురైనప్పుడు కొబ్బరి నీరు అమృతంలా పనిచేస్తుంది.. వాస్తవానికి కొబ్బరి నీరు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఎందుకంటే ఇందులో విటమిన్ సి, విటమిన్ ఇ, ఐరన్, కాల్షియం, కాపర్, ఫాస్ఫరస్, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సాయపడతాయి.. కొబ్బరినీళ్లు ఎప్పుడు తాగినా తాగినా మంచిదే కానీ.. కొందరికి మాత్రం సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయని పేర్కొంటున్నారు వైద్య నిపుణులు.. కొన్ని సమస్యలున్న వారు కొబ్బరినీటికి దూరంగా ఉండాలి.. ఏ వ్యాధితో బాధపడేవారు కొబ్బరినీళ్లు తాగకూడదో ఇప్పుడు తెలుసుకోండి. కిడ్నీ సంబంధిత వ్యాధులు ఉన్నవారు: కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడేవారు కొబ్బరినీళ్లు తాగకూడదు. ఇందులో పొటాషియం ఎక్కువగా ఉండటం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. మధుమేహ రోగులు: మధుమేహ వ్యాధిగ్రస్తులు కొబ్బరినీళ్లు తాగకూడదు. ఎందుకంటే దానిలో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా ఎక్కువ. అందుకే.. కొబ్బరినీళ్లు తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి వేగంగా పెరుగుతుంది. అలర్జీ: అలర్జీ బాధితులు కొబ్బరినీళ్లు తాగకూడదు. కొబ్బరి నీరు తాగితే చర్మంపై దురద, మంట, చర్మం ఎర్రబడడం వంటి అనేక సమస్యలను ఎదుర్కొవలసి ఉంటుంది. అధిక రక్తపోటు: అధిక రక్తపోటుతో బాధపడేవారు కూడా సాధ్యమైనంతమేరకు కొబ్బరినీటికి దూరంగా ఉండాలి.. అయితే, వైద్యుల సలహా మేరకు మాత్రం కొబ్బరి నీళ్లు తాగవచ్చు.



## కప్పు కాఫీ.. తాగితే అమేజింగ్ అంతే.! వీళ్లు మాత్రం అస్సలు జోలికి వెళ్లొద్దు..



ప్రపంచవ్యాప్తంగా కాఫీ లవర్స్ చాలామందే ఉంటారని చెప్పడంలో అతిశయోక్తి లేదు. కొంతమందికి కాఫీ తాగనిదే రోజు గడవదు. అంతలా ఎడిక్ట్ అవుతారు. ఉదయాన్నే బెడ్ కాఫీ తాగితేనే గానీ తమ రోజు మొదలుపెట్టరు. అయితే కాఫీ లిమిట్‌గా తాగితే ఫర్వాలేదు. కాని అధిక మోతాదులో తీసుకుంటేనే అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా ఈ వ్యాధులు ఉన్నవారు కాఫీని అస్సలు తాగకూడదు. మీరు మైగ్రేన్ సమస్యతో బాధపడుతుంటే.. అస్సలు కాఫీ తాగొద్దు. కాఫీలో కెఫిన్ శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది మెదడు నరాలపై ప్రభావం చూపిస్తుంది. అలాగే రక్త ప్రసరణ కూడా మందగిస్తుంది. అధిక మొత్తంలో కెఫిన్ శరీరంలోకి చేరితే.. మైగ్రేన్ మరింత ఎక్కువ అయ్యే అవకాశం ఉంటుంది. మీకు హై-బీపీ ఉన్నట్లయితే.. కాఫీ తాగకండి. కాఫీ తాగడం వల్ల రక్తపోటు స్థాయి మరింతగా పెరుగుతుంది. దాని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. అలాగే కాఫీ తాగడం వల్ల ఒత్తిడి పెరుగుతుంది. దీంతో బీపీలో హెచ్చుతగ్గులు ఉండొచ్చు. డయాబెటిక్ పేషెంట్లు కాఫీ తాగడం మానేయాలని చాలామంది ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కాఫీ తాగడం వల్ల డయాబెటిక్ రోగులకు అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం ఉంది. రక్తంలో చక్కెర స్థాయి అసమత్యుల్యంగా ఉన్నవారు కూడా కాఫీ తాగకూడదు. గర్భధారణ సమయంలో కాఫీ తాగడం మంచిది కాదు. కాఫీలో ఉండే కెఫిన్ శాతం మీ శరీరంలోని రక్త ప్రసరణను ప్రభావితం చేస్తుంది. దీని వల్ల కడుపులో పెరుగుతున్న పిండానికి రక్తం సరఫరాలో అసమతుల్యత ఏర్పడుతుంది. ఒకవేళ మీకు ఒత్తిడిని ఎదురుకుంటున్నట్లయితే.. కాఫీ గురించి అస్సలు ఆలోచించొద్దు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, కాఫీని ఎక్కువగా తాగడం వల్ల శరీరంలో కార్టిసోల్ హార్మోన్‌పై అధిక ప్రభావం పడుతుంది. ఇది ఒత్తిడిని మరింత ఎక్కువ చేస్తుంది. కాగా, ఈ వార్త కేవలం పలు అధ్యయనాలు, వైద్య నిపుణుల రీసెర్చ్ ఆర్టికల్స్ ఆధారంగా ప్రచురించింది మాత్రమే. మీరు ఏదైనా డైట్ ఫాలో కావాలన్నా.. డాక్టర్ సలహా కచ్చితంగా తీసుకోండి.

## మీ బుజ్జాయి కళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే.. రోజుకొక్కసారి ఇలా చేయండి



మన శరీరంలోని ముఖ్యమైన అవయవాలలో కన్ను ఒకటి. చూపు లేని లోకం అంధకారం అని పెద్దలు అందుకే అంటారు. కాబట్టి కంటి సంరక్షణ చాలా ముఖ్యం. ముఖ్యంగా నేటి డిజిటల్ యుగంలో పిల్లలు చిన్నప్పటి నుంచే ఫోన్ స్క్రీన్‌కు అలవాటు పడుతున్నారు. దీంతో పిల్లల కళ్ళు బాల్యం దశలోనే ప్రమాదంలో పడుతున్నాయి. కాబట్టి చిన్న వయసు నుంచే పిల్లల కళ్లకు తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే వయసు పెరిగే కొద్దీ సమస్యలు మరింత తీవ్రతరం అవుతాయి. మీ కంటిపాప చూపును జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. ఇందుకోసం ఆయుర్వేదాన్ని ఆశ్రయించవచ్చు. మంచి కంటి చూపుకు, కంటి సంరక్షణకు ఆయుర్వేద నివారణలు ఎంతో ఉపయోగపడతాయి. తర్పన్ అనేది ఒక రకమైన ఆయుర్వేద చికిత్స. ఇది కళ్ళను తేమగా ఉంచడానికి, దృష్టిని మెరుగుపరచడానికి సహాయపడుతుంది. ఇది కంటి దురదను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. దీనిని ఎలా వినియోగించాలంటే.. నెయ్యిని కళ్లపై నెమ్మదిగా రాసి, ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కళ్లను కడగాలి. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల కళ్లకు చాలా మంచిది. కళ్లలోకి చేరే రకరకాల దుమ్ము, కాలుష్య కారకాలను తొలగించి కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. అయితే అధిక వేడి, చల్లటి నెయ్యిన కళ్లకు ఎప్పుడూ పూయకూడదు. అలాగే కళ్లపై ప్రత్యక్ష సూర్యకాంతి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల కళ్లలోకి యువి కిరణాలు నేరుగా పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సూర్యుడి నుండి కళ్ళను రక్షించడం కూడా అవసరమే. నేటి యుగంలో పిల్లల ముందు టీవీ, ల్యాప్‌టాప్, మొబైల్ స్క్రీన్‌లు కనిపిస్తున్నాయి. వాటిని నివారించలేం. అయితే పిల్లలను స్క్రీన్‌కు దూరం ఉంచడం మీ చేతుల్లో పనే. ఇది మీ పాపాయి కళ్లను కొంత వరకు కాపాడుతుంది. ఆయుర్వేదం ప్రకారం సోంపు గింజలు తినడం కళ్ళకు ఎంతో మేలు జరుగుతుంది. సోంపు గింజలు నోటి దుర్వాసనను తొలగించడంలో కూడా ఉపయోగపడతాయి. కాబట్టి రోజూ భోజనం తిన్న తర్వాత సోపు తింటే కళ్లకు మేలు చేస్తుంది. అలాగే త్రిఫల, ఉసిరి కళ్లకు చాలా మేలు చేస్తుంది. త్రిఫల పొడి, ఉసిరి పొడి కలిపి మీ చిన్నారికి ఆహారంలో ఇవ్వవచ్చు. దానితో పాటు కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి కూడా అలవాటు చేయాలి. విటమిన్ ఎ అధికంగా ఉండే ఆహారాన్ని పిల్లలకు తినిపిస్తే కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

## పోషకాల్లో తిరుగులేని పొద్దుతిరుగుడు.. తింటే అద్భుతమైన శక్తి



పొద్దుతిరుగుడు విత్తనాలలో విటమిన్ సి, విటమిన్ ఇ, విటమిన్ బి6, ఫైబర్, ఐరన్, జింక్, కాపర్, ఫాస్ఫరస్ మరియు కాల్షియం వంటి అనేక ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిని తీసుకోవడం ద్వారా మీరు మీ ఎముకలను బలోపేతం చేయడమే కాకుండా మీ జీర్ణవ్యవస్థను కూడా మెరుగుపరుచుకోవచ్చు. అలాగే, అవి డయాబెటిక్ రోగులకు ఔషధం లాంటివి. ఎందుకంటే వీటి సహాయంతో రక్తంలో చక్కెర స్థాయిని నిర్వహించడంలో సహాయపడతాయి. పొద్దుతిరుగుడు పువ్వుకు ఎంత అందం ఉంటుందో, దాని గింజల్లో అంత ఆరోగ్యం దాగివుందని నిపుణులు అంటున్నారు. పొద్దుతిరుగుడు విత్తనాలు ఆరోగ్యానికి వరం లాంటివి. ప్రతిరోజూ వాటిని తినడం వల్ల ఈ అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయి. నేటి అనారోగ్యకరమైన జీవనశైలిలో, ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం చాలా ముఖ్యం. మీ ఆహారంలో పొద్దుతిరుగుడు విత్తనాలను చేర్చుకోవడం ద్వారా కొలెస్ట్రాల్ నుండి రక్తపోటు వరకు నియంత్రించవచ్చు. పొద్దుతిరుగుడులో డైటరీ ఫైబర్, ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్ కూడా ఉంటాయి. ఇవి అనేక వ్యాధులలో గొప్ప ప్రయోజనాలను అందిస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాలలో అద్భుతమైన ఆరోగ్య నిధి దాగి ఉంది. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి ఆహారంలో కొన్ని గింజలను చేర్చుకోవడం చాలా మేలు చేస్తుంది. పొద్దుతిరుగుడు విత్తనాలను ఉపయోగించడం వల్ల అనేక ఆరోగ్య సమస్యల నుండి మిమ్మల్ని రక్షించడంలో సహాయపడుతుంది. ఫైబర్ అధికంగా ఉండే పొద్దుతిరుగుడు విత్తనాలను తీసుకోవడం ద్వారా, మీరు మలబద్ధకం సమస్య నుండి కూడా ఉపశమనం పొందవచ్చు. పొద్దుతిరుగుడు విత్తనాలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి వాటిని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల కడుపు సంబంధిత సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. మీరు మలబద్ధకంతో బాధపడుతుంటే, ఈ విత్తనాలను తీసుకోవడం ద్వారా మీరు చాలా వరకు ఉపశమనం పొందవచ్చు. పొద్దుతిరుగుడు గింజలు డయాబెటిక్ రోగులకు ఒక ఔషధం లాంటివి., ఎందుకంటే వాటిలో పాలీసాచురేటెడ్ కొవ్వు పుష్కలంగా ఉంటుంది. కార్బోహైడ్రేట్ పరిమాణం తక్కువగా ఉంటుంది. పొద్దుతిరుగుడు విత్తనాలను తినడం వల్ల జీవక్రియ రేటు పెరుగుతుంది. వాటిలో మెగ్నీషియం కూడా పుష్కలంగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో సన్‌ఫ్లవర్ సీడ్స్ రెగ్యులర్ వినియోగం బరువు తగ్గడానికి, స్థూలకాయాన్ని అదుపులోకి తీసుకురావడానికి సహాయపడుతుంది. ఎముకల ఆరోగ్యాన్ని పెంపొందించడంలో కూడా ఈ విత్తనాలు చాలా మేలు చేస్తాయి. మీరు కూడా కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఎందుకంటే ఇందులో కాల్షియం, మెగ్నీషియం, జింక్ మరియు ఇనుము మంచి మొత్తంలో ఉంటాయి. పొట్టను శుభ్రం చేయడంలో పొద్దుతిరుగుడు గింజలకు మరొకటి పోటీ లేదు. వీటిని తీసుకోవడం ద్వారా మీరు మీ జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, శరీరంలోని టాక్సిన్స్‌ను కూడా బయటకు పంపవచ్చు . ప్రతిరోజూ 2 టేబుల్ స్పూన్ల పొద్దుతిరుగుడు విత్తనాలు మీ ఆరోగ్యానికి వరం కంటే తక్కువ కాదు.

విశ్వజి



## దుర్వాసన దూరం..

గుట్కాలు తినేవారిలో, మద్య పానం-ధూమపానం చేసేవారిలో నోటి దుర్వాసన ఎక్కువగా కనిపిస్తుంది. దంతధావనం సరిగ్గా చేయపోయినా.. ఈ సమస్య వేధిస్తుంది. కానీ, కొందరిలో ఏ దురలవాట్లూ లేకపోయినా.. రోజుకు రెండుసార్లు బ్రష్ చేసినా.. నోటి నుంచి చెడువాసన వస్తుంటుంది. ఇది నలుగురిలో తీవ్రమైన ఇబ్బందికి గురిచేస్తుంది. కాబట్టి, నోటి దుర్వాసనను దూరం చేసే కొన్ని ఇంటి చిట్కాలను నిపుణులు వివరిస్తున్నారు. నోటిలో పేరుకుపోయే బ్యాక్టీరియా, ఇతర ఆరోగ్య సమస్యలు.. నోటి దుర్వాసనకు ప్రధాన కారణాలు. కాబట్టి, రోజుకు రెండుసార్లు బ్రష్ చేయడంతోపాటు ఫ్లాస్ చేయడం, నాలుకపై బ్యాక్టీరియాను తొలగించుకోవడం ముఖ్యం. నోటి దుర్వాసనను కలిగించే బ్యాక్టీరియాను ఉప్పు నీటితో పుక్కిలించడం ద్వారా నిర్మూలించవచ్చు. బేకింగ్ సోడాలో యాంటి బ్యాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. దీనిని మౌత్ వాష్‌గా వాడితే మంచి ఫలితాలు ఉంటాయి. నోరు పొడిబారినా.. దుర్వాసన వేస్తుంది. కాబట్టి, ఈ సమస్య నుంచి బయట పడటానికి నీళ్లు ఎక్కువగా తాగండి. దాంతో, శరీరం హైడ్రేటెడ్‌గా ఉండి, నోటి ఆరోగ్యం బాగుంటుంది. శ్వాసను తాజాగా ఉంచడంలో తులసి, పుదీనా ఆకులు అద్భుతంగా పనిచేస్తాయి. రాత్రిపూట విధులు నిర్వహించే సమయంలో.. తులసి, పుదీనా ఆకులను నమలండి. ఆపిల్, క్యారెట్లు, పుచ్చకాయలు, పైనాపిల్ వంటి పండ్లు.. నోటి దుర్వాసనను తగ్గిస్తాయి. నోటిలో బ్యాక్టీరియాను తొలగించడం, లాలాజల ఉత్పత్తిని పెంచడంలో ముందుంటాయి. అయినా.. సమస్య అలాగే ఉంటే దంతవైద్యులను సంప్రదించండి.

## నిద్ర రావట్లేదా?

వృద్ధుల్లో నిద్రలేమి సాధారణ సమస్యగా మారింది. నిద్ర మాత్రలు తాత్కాలిక ఉపశమనాన్ని అందించినా.. తరచుగా వాడితే దుష్ప్రభావాల ప్రమాదం ఉంటుంది. ఇందుకు నిపుణులు సిఫారసు చేస్తున్న ఒక సులభమైన చిట్కా.. క్రమం తప్పని శారీరక శ్రమ. వయసు పెరిగేకొద్దీ.. నిద్రను నియంత్రించే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గుతుంది. అదనంగా ఆర్థరైటిస్, గుండె సమస్యలు, మందుల వాడకం వంటివి నిద్రకు భంగం కలిగిస్తాయి. దాంతో పెద్దవాళ్లు నిద్రపోవడంలో ఇబ్బంది పడుతుంటారు. రాత్రిపూట తరచుగా మేల్కొంటూ ఉంటారు. ఫలితంగా జ్ఞాపకశక్తి సమస్యలు, రోగ నిరోధక శక్తి తగ్గడం, మానసిక స్థితిలో మార్పులు లాంటి సమస్యలు ఎదురవుతాయి. వీటినుంచి బయటపడాలంటే.. వృద్ధుల్లో నిద్ర సమస్యలను నివారించాలి. అందుకు 'వ్యాయామం' చక్కని పరిష్కారం చూపుతుంది. వ్యాయామంతో నిద్ర... చిన్నచిన్న వ్యాయామాలతోనూ కార్టిసాల్ (ఒత్తిడి హార్మోన్) స్థాయిలు తగ్గుతాయి. దాంతో ఒత్తిడి, ఆందోళన దూరమవుతుంది. మనసు విశ్రాంతి తీసుకోవడానికి సహాయపడుతుంది. వ్యాయామం.. జీవ గడియారాన్ని రీసెట్ చేస్తుంది. ముఖ్యంగా ఉదయంపూట ఆరుబయట నడక వల్ల.. శరీరానికి సహజమైన సూర్యకాంతి అందుతుంది. ఇది రాత్రిపూట మెలటోనిన్ ఉత్పత్తిని పెంచుతుంది. మితమైన వ్యాయామంతో శరీరం ఆరోగ్యకరమైన రీతిలో అలసిపోతుంది. ఫలితంగా.. రాత్రిపూట మంచి నిద్రపట్టేస్తుంది. సాయంత్రాల్లో ఓ మోస్తరు యోగాసనాలు వేయడం వల్ల.. శరీరానికి తగినంత విశ్రాంతి లభిస్తుంది. రాత్రి గాఢనిద్రలోకి జారుకునేలా చేస్తుంది. నిరంతరం వ్యాయామం చేసే వృద్ధులు నాణ్యమైన నిద్రపోతారని ఇటీవలి అధ్యయనాలు వెల్లడించాయి. అయితే, పడుకునే రెండు గంటల ముందు వ్యాయామాలకు దూరంగా ఉండటమే మంచిది. వ్యాయామం.. కేవలం శారీరక ఆరోగ్యం కోసమే కాదు. ఇది పెద్దల్లో మనశ్శాంతిని పునరుద్ధరిస్తుంది.

# లైఫ్ ట్రాప్స్‌లో లవ్



ఈరోజుల్లో ప్రేమంటే? కాఫీ డేట్స్, రీల్స్, స్టోరీస్‌లో లవ్ వైబ్స్, షాపింగ్.. అంతేనా? నిజానికి బంధాలు అంత తేలికైనవి కావు. మీరు మనస్ఫూర్తిగా ఎవరినైనా ప్రేమిస్తే, ఆ బంధం మీకు సంతోషాన్ని ఇవ్వాలి. కానీ, కొన్నిసార్లు ప్రేమ పేరుతో విసిరే ఉచ్చులో మనం చిక్కుకుపోతుంటాం. పదేపదే మనకు సరిపోని వాళ్ల మాయలోనే పడిపోతుంటాం. అందుకు కారణం కూడా మన ఆలోచనలే కావడం విచిత్రం. మనలో కొన్ని 'లైఫ్ ట్రాప్‌లు' పనిచేస్తుంటాయి అని మీకు తెలుసా? బాల్యంలో మొదలయ్యే కొన్ని భావనలు పెద్దయ్యాక సంబంధాలను ప్రభావితం చేస్తాయి. డాక్టర్ జెఫ్రీ యంగ్ అనే సైకాలజిస్ట్ 'స్కీమా థియరీ'తో ఈ 'లైఫ్ ట్రాప్‌ల' గురించి ఏనాడో చెప్పారు. ఇవి మన ఆలోచనల్ని, నిర్ణయాల్ని ప్రభావితం చేస్తాయి. సరైన భాగస్వామిని ఎంచుకోవడంలో తప్పులు చేసేలా ప్రోత్సహిస్తాయి. చివరికి ఇంకేముంది హార్ట్‌బ్రేక్!! అమ్మాయిలు ముఖ్యంగా మూడు లైఫ్‌ట్రాప్‌ల వల్ల ఇబ్బందులు పడుతుంటారు. ఎమోషనల్ డిప్రివేషన్ (భావోద్వేగాల లేమి), అబాండన్‌మెంట్ (విడిచి వెళ్లిపోతారేమో అనే భయం), సెల్ఫ్ శాక్రిఫైస్ (స్వీయ త్యాగం). ఈ మూడు ధోరణుల వల్ల భాగస్వామి ఎంపికలో, ప్రేమను నిలబెట్టుకోవడంలో తప్పులు చేస్తుంటారు.

కావాల్సిన ప్రేమ దొరకదేమో?!

నాకు కావాల్సిన ప్రేమ దొరకడం లేదు!! వాళ్లు నన్ను ప్రేమించినా.. సరిగ్గా వ్యక్తపరచడం లేదు.. ఇలాంటి ఆలోచనలు మీలో ఉన్నాయా? చిన్నప్పుడు మీకు సరైన ఆప్యాయత దొరకలేదా? అమ్మానాన్నలు దూరంగా ఉన్నారా? వాళ్లు మీకు అన్నీ ఇచ్చినా, మీ మనసులో ఏం ఉందో అర్థం చేసుకోలేదా? అలాంటప్పుడు, మీరు భావోద్వేగాలు అంతగా వ్యక్తపరచని వ్యక్తులకే త్వరగా ఆకర్షితురాలు అవుతారు. చిన్నప్పటి నుంచి భావోద్వేగాల లేమితో సతమతమైన మీ మనసు.. మీ తరహా వ్యక్తిత్వం ఉన్నవారికే అట్రాక్ట్ అవుతుంది. కానీ, లేనిది వెతుక్కోవడమే కదా జీవితం! బాల్యం నుంచి దొరకని ఆప్యాయత భాగస్వామి నుంచి ఆశించడం తప్పు కాదు. కన్సర్న్ చూపించే వారిని కాదని, మీలా బోర్‌గా ఫీలయ్యే వాళ్ల వెంటపడితే.. చివరికి జీవితంలో భావోద్వేగాలు మృగ్యమైపోతాయి.

నన్ను వదిలేస్తారేమో?! ప్రేమించినవాడు వదిలేస్తాడేమో అన్న అనుమానం..

### వాళ్లు కాస్త దూరం జరిగినా ఆత్మరక్షణలో పడిపోవడం..

మీలో ఈ తరహా ఫీలింగ్స్ వస్తుంటే కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి. చాలామంది తల్లిదండ్రులు ఎప్పుడూ ఒకేలా ఉండరు. పిల్లలంటే ప్రేమ ఉన్నప్పటికీ%ా% పరిస్థితులను బట్టి వాళ్ల అభిమానం వ్యక్తమవుతూ ఉంటుంది. కొన్నిసార్లు అతి గారాబం చేయడం, కొన్నిసార్లు మరీ ఎక్కువ నిర్లక్ష్యం చేయడం లాంటి పరిస్థితులు ఎదుర్కొన్న ఆడపిల్లల ఆలోచన కాస్త చిత్రంగా ఉంటుంది. ప్రేమలో అడుగుపెట్టినప్పటి నుంచి అనుమానాలు వాళ్లను పీడిస్తూ ఉంటాయి. భాగస్వామి ఏ కొంచెం స్పందించకపోయినా.. అతిగా స్పందిస్తుంటారు. ఎప్పుడూ అతణ్నే అంటిపెట్టుకొని ఉండటానికి ప్రయత్నిస్తుంటారు. మరింత గాఢమైన ప్రేమను ఆశిస్తూ ఉంటారు. ఈ భయం మీ నిబద్ధతను చూపించకపోగా, నిజమైన ప్రేమను కూడా అంగీకరించలేని పరిస్థితిలోకి నెట్టేస్తుంది.

ప్రాణం అయినా ఇస్తాను

నా భాగస్వామి సంతోషంగా ఉంటే చాలు.. వాళ్ల కోసంఏదైనా చేస్తాను..

పైకి చూస్తే ఇలా ఆలోచించడం గొప్ప విషయమే! ప్రేమంటే త్యాగమే!! కానీ, లవ్‌జర్నీలో ఇదో ప్రమాదకరమైన ట్రాప్. చిన్నప్పటి నుంచి ఇంట్లోవాళ్ల కోసం త్యాగాలకు అలవాటుపడిన ప్రాణమైతే మరీ ప్రమాదం. ఎదుటివ్యక్తిని సంతోషపర్చడానికి ఎలాంటి త్యాగాలకైనా సిద్ధపడుతుండటం అలవాటుగా చేసుకుంటారు. ఇక ప్రేమించిన వ్యక్తి కోసం విపరీత త్యాగాలకు పాల్పడుతుంటారు. సరైనోడు అయితే త్యాగం చేసినా కొంత ఫర్వాలేదు. కానీ, మీ బలహీనతను అలుసుగా తీసుకునే బాపతు ప్రేమికుడు ఎదురుపడితే.. మీ త్యాగాలకు విలువ ఉండదు సరికదా, కొన్నిసార్లు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి కూడా రావొచ్చు. ఈ త్యాగశీలురు తమ భాగస్వామి నుంచి కూడా అదే తరహా త్యాగాలను ఆశిస్తే%ా% మీ ప్రేమ మొగ్గలోనే వాడిపోవడం ఖాయం. జెన్-జీ అమ్మాయిలు సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్రపంచంలో పెరుగుతున్నారు. వారికి బంధాలపై స్పష్టమైన అవగాహన ఉండటంలేదు. అపరిచితులతో తేలికగా కనెక్ట్ అవుతున్నారు. ఈ క్రమంలో బాల్యంలో ఎదురైన అనుభవాలు, మనసుకు తగిలిన గాయాలు.. ఈ సంబంధాలపై పడితే.. మరింత డేంజర్ జోన్‌లోకి వెళ్లే ప్రమాదం ఉంది. కాబట్టి, రిలేషన్‌లోకి ప్రవేశించడానికి ముందు.. మానసికంగా దృఢంగా ఉండాలి. ఎదుటివ్యక్తిని సరిగ్గా అంచనా వేయగలగాలి. అప్పుడే ఆరోగ్యకరమైన ప్రేమను పొందే అవకాశాలు ఉంటాయి.

## జుట్టుకు మునగాకు!



మునగ ఆకుల్లో పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఇవి అనేక శారీరక సమస్యలను దూరం చేస్తాయి. జుట్టు ఆరోగ్యాన్ని కాపాడటంలోనూ ముందుంటాయి. మునగాకులో ప్రొటీన్, ఫైబర్, విటమిన్ బి6, సి, ఐరన్, జింక్, క్యాల్షియం సమృద్ధిగా లభిస్తాయి. అవన్నీ జుట్టు సమస్యలకు చక్కటిపరిష్కారం చూపుతాయి. మునగాకుతో హెయిర్ ప్యాక్స్ తయారుచేసుకొని వాడితే.. అద్భుత ఫలితాలు కనిపిస్తాయి. తయారీ విధానం.. ఒక గిన్నెలో టేబుల్ స్పూన్ మునగాకు పొడి, టేబుల్ స్పూన్ ఉసిరి పొడిని తీసుకోవాలి. రెండిటినీ బాగా మిక్స్ చేసి.. కొద్దికొద్దిగా పెరుగు కలుపుతూ మెత్తని పేస్ట్ తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్లకు పట్టేలా జుట్టుకు ప్యాక్ వేసుకోవాలి. అరగంట సేపు అలాగే ఉంచి.. గోరు వెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. అనేక ప్రయోజనాలు.. మునగాకులో యాంటి బ్యాక్టీరియల్, యాంటి ఫంగల్ గుణాలు పుష్కలం. ఇవి జుట్టు కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. వెంట్రుకలు ఒత్తుగా పెరిగేందుకు సాయపడతాయి. ఇందులో ఉండే జింక్.. జుట్టు కుదుళ్లలోని సీబమ్‌ను క్రమబద్ధీకరిస్తుంది. దాంతో కుదుళ్లు తేమగా మారుతాయి. చుండ్రు, దురద వంటి సమస్యలను తరిమేస్తాయి. తెల్ల జుట్టు సమస్యకూ మునగాకు చక్కని పరిష్కారం. ఇందులో ఉండే యాంటి ఆక్సిడెంట్లు, విటమిన్ సి.. వెంట్రుకలు నెరవడానికి కారణమయ్యే ఫ్రీరాడికల్స్‌తో పోరాడతాయి. మునగాకులో ఉండే బెహెనిక్, ఓలియిక్ ఆమ్లాలు.. జుట్టు ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. కుదుళ్లలో ఇన్‌ఫ్లమేషన్, ఇతర సమస్యల్ని తగ్గిస్తాయి.

# మార్కెట్

### ముంబైలో టెస్లా తొలి షోరూం.. నెల అద్దె ఎంతో తెలుసా..?

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత విపణిలోకి అడుగుపెట్టింది. ఇవాళ ఉదయం ముంబై నడిబొడ్డున బాంద్రా కుర్లా కాంప్లెక్స్ మేకర్ మ్యాక్సిటీ మాల్‌లో టెస్లా తన తొలి షోరూంను గ్రాండ్‌గా లాంఛ్ చేసింది. ఈ షోరూం కోసం బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని టెస్లా సంస్థ అద్దెకు తీసుకుంది. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగానూ కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ నెలకు రూ.35 లక్షల అద్దె (%వీశీత్ప్రశ్రీఎ =వత్%) చెల్లించనున్నారని తెలిసింది. అద్దె ఏడాదికి 5 శాతం పెంపు ప్రాతిపదికన ఐదేళ్ల కాలానికి యూనివ్‌కో ప్రాపర్టీస్ నుంచి లీజుకి తీసుకుంది. ఈ ప్రాపర్టీ గ్రౌండ్ ఫ్లోర్ దేశీయంగా ఏర్పాటైన తొలి యాపిల్ స్టోర్‌కు దగ్గరగా ఉంటుంది. రెంటల్ అగ్రిమెంట్ ఫిబ్రవరి 27న రిజిస్టరైంది. రూ.2.11 కోట్లు సెక్యూరిటీ డిపాజిట్‌గా కూడా టెస్లా జమ చేసినట్లు సమాచారం. మరోవైపు తొలిషోరూం కోసం టెస్లా సంస్థ వై మోడల్ కార్లను చైనాలోని షాంఘై నగరంలో గల తమ ఫ్యాక్టరీ నుంచి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన వై మోడల్ కారు ధర పన్నులు, బీమా కలిపితే రూ. 48 లక్షలపైనే ఉండనుంది. డిమాండ్‌ను బట్టి ఆ తర్వాత ఢిల్లీలోనూ రెండో షోరూంను ఏర్పాటు చేయాలనే ప్రణాళికతో టెస్లా ఉందని సమాచారం.




## నాలుగు రోజుల నష్టాలకు బ్రేక్..
# 317 పాయింట్లు సెన్సెక్స్ జంప్..!



దేశీయ స్టాక్ మార్కెట్‌లో నాలుగు రోజుల తర్వాత మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. జూన్ నెలలో భారత దేశ ద్రవ్యోల్బణం 77 నెలల కనిష్ట స్థాయి 2.1శాతానికి తగ్గింది. ఈ క్రమంలో మార్కెట్‌లో అన్నిరంగాల్లో కొనుగోళ్లు కనిపించాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 82,233.16 ఫ్లాట్‌గా మొదలైంది. ఈ తర్వాత కోలుకొని లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఇంట్రాడేలో 82,221.74 పాయింట్ల కనిష్టానికి పెరిగిన సెన్సెక్స్.. గరిష్టంగా 82,743.62 పాయింట్లకు చేరింది. చివరకు సెన్సెక్స్ 317.45 పాయింట్లు పెరిగి 82,570.91 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 113.50 పాయింట్లు పెరిగి 25,195.80 వద్ద ముగిసింది. అన్ని రంగాల సూచీలు ఫార్మా, ఆటో, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియాల్టీ 0.5-1 శాతం పెరిగాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు దాదాపు ఒకశాతం పెరిగాయి. హీరో మోటోకార్ప్, సన్ ఫార్మా, బజాజ్ ఆటో, అపోలో హాస్పిటల్స్, శ్రీరామ్ ఫైనాన్స్ నిఫ్టీలో ప్రధానంగా లాభాలను నమోదు చేశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఎటర్నల్, టాటా స్టీల్ నష్టపోయాయి. విస్తరణ ప్రణాళిక నేపథ్యంలో హీరో మోటోకార్ప్ షేర్లు 5 శాతం పెరిగాయి. ర్యాలీస్ ఇండియా షేర్లు 52 వారాల గరిష్టాన్ని తాకాయి. క్యూ 1లో లాభం దాదాపు రెట్టింపు అయిన విషయం తెలిసిందే. తేజస్ నెట్‌వర్క్స్ షేర్లు క్యూ 1లో నష్టాల నేపథ్యంలో షేర్లు 6 శాతం పడిపోయాయి. యూఎస్ పేటెంట్ సెటిల్‌మెంట్ లెక్సెల్వి ప్రారంభానికి మార్గం సుగమం కావడంతో సన్ ఫార్మా షేర్లు దాదాపు 3శాతం పెరిగాయి. ఈస్ట్ సెంట్రల్ రైల్వే నుంచి ఆర్డర్లతో రైల్‌టెల్ కార్పొరేషన్ షేర్లు 2 శాతం పెరిగాయి. టాటా టెక్నాలజీస్ షేర్లు జూన్ త్రైమాసికంలో నికర లాభం 5శాతం పెరగడంతో షేర్లు 2 శాతం పెరిగాయి. బీఎస్‌ఈలో 140 స్టాక్‌లు 52 వారాల గరిష్ట స్థాయికి చేరాయి. ఇందులో ఆథమ్ ఇన్వెస్ట్‌మెంట్, నిప్పాన్ లైఫ్, హెచ్‌డీఎఫ్ ఏఎంసీ, గాడ్‌ఫ్రే ఫిలిప్స్, జిల్లెట్ ఇండియా, యూటీఐ ఏఎంసీ, పిరమల్ ఎంటర్‌ప్రైజెస్, అనుపమ్ రసాయనన్, లారస్ ల్యాబ్స్, ఈఐడీ ప్యారీ, గ్లోబల్ హెల్త్, సియట్, జేఎం ఫైనాన్షియల్ ఉన్నాయి.




## సతీ లీలావతిగా వస్తున్న లావణ్య త్రిపాఠి

టాలీవుడ్ ప్రముఖ నటి లావణ్య త్రిపాఠి మళ్లీ సినిమాలతో సందడి చేసేందుకు సిద్ధమయ్యారు. చాలాకాలం తర్వాత ఆమె నటించిన తాజా చిత్రం 'సతీ లీలావతి' ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మెగా హీరో వరుణ్ తేజ్‌తో వివాహం, అనంతరం ఓ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత విడుదల అవుతున్న ఈ సినిమా కావడంతో అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఇప్పటికే ఈ చిత్రంపై మంచి బజ్ క్రియేట్ అయింది. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో, దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మించిన ఈ చిత్రానికి తాతినేని సత్య దర్శకత్వం వహించారు. గతంలో 'భీమిలి కబడ్డీ జట్టు', 'ఎస్ఎంఎస్ (శివ మనసులో శృతి)' వంటి యూత్‌ఫుల్ చిత్రాలతో గుర్తింపు పొందిన ఆయన, ఈసారి ఒక రొమాంటిక్ రిలేషన్‌షిప్ డ్రామాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. లావణ్య త్రిపాఠి సరసన దేవ్ మోహన్ హీరోగా నటించగా, వీరిద్దరూ భార్యాభర్తలుగా కనిపించనున్నారు. ఈ సినిమా కుటుంబ బంధాలు, దాంపత్య జీవితం, వాటిలో వచ్చే సంఘర్షణలను వినోదాత్మకంగా చూపించనుందని నిర్మాత నాగమోహన్ తెలిపారు. హాస్యం, భావోద్వేగాలు కలగలిసిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించబడిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని 'యూ' సర్టిఫికేట్‌ను పొందింది. మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. తాజాగా విడుదల చేసిన పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచింది. ఈ చిత్రంలో సీనియర్ నటుడు నరేష్ వీకే, కమెడియన్ సప్తగిరి, తమిళ హాస్యనటుడు వీటీవీ గణెళిష్, రాజేంద్రన్, జాఫర్, జోషి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంగీతాన్ని మిక్కీ జే. మేయర్ అందించగా, సినిమాటోగ్రఫీని బినేంద్ర మీనన్ నిర్వహించారు. ఎడిటింగ్ బాధ్యతలను సతీష్ సూర్య తీసుకున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు మంచి స్పందన లభించగా, త్వరలోనే ట్రైలర్‌ను విడుదల చేసి ప్రమోషన్స్‌ను మరింత వేగవంతం చేయనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. మొత్తానికి, 'సతీ లీలావతి'తో లావణ్య త్రిపాఠి సక్సెస్‌ఫుల్ రీఎంట్రీ ఇస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది.



## సల్మాన్ మూవీకి స్పిరిట్ పోటీ కానుందా?

బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్ ఖాన్ కు ప్రస్తుతం కాలం కలిసిరావడం లేదు. ఒకప్పుడు బాక్సాఫీస్‌ను షేక్ చేసిన సల్మాన్‌ఖాన్, 2016లో వచ్చిన 'సుల్తాన్' సినిమా తర్వాత మళ్ళీ ఆ స్థాయి బ్లాక్ బస్టర్‌ను చూడలేదు. భారీ అంచనాల మధ్య వచ్చిన 'టైగర్ 3, సికిందర్' సినిమాలు కూడా ప్రేక్షకులను నిరాశపరిచాయి. ఈ ఏడాది రిలీజ్ కావాల్సిన 'మాతృభూమి' సినిమాపై పెద్దగా అంచనాలు లేవు. దీంతో సల్మాన్ మార్కెట్ పడిపోతుందా? అనే అనుమానాలు మొదలయ్యాయి. ఇలాంటి తరుణంలో టాలీవుడ్ సెన్సేషనల్ ప్రొడ్యూసర్ దిల్ రాజు రంగంలోకి దిగారు. ఎంతో కాలంగా బాలీవుడ్‌లో గ్రాండ్ ఎంట్రీ ఇవ్వాలనుకున్న దిల్ రాజు ఈ సారి దర్శకుడు వంశీ పైడిపల్లిని రంగంలోకి దించి ఒక పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం, షూటింగ్ కూడా శరవేగంగా జరుపుకుంటోంది. ఈ సినిమాతోనైనా సల్మాన్ బాక్సాఫీస్ వద్ద తన పూర్వ వైభవాన్ని పొందుతారని అభిమానులు ఆశిస్తున్నారు. అయితే, ఇక్కడే ఒక పెద్ద ట్విస్ట్ ఉంది..! సల్మాన్ ఖాన్‌కు ఈద్ అంటే చాలా సెంటిమెంట్. ప్రతి ఏటా తన సినిమాను ఆ పండుగకే రిలీజ్ చేస్తారు. రాబోయే ఏడాది కూడా మార్చి 9 లేదా 10 తేదీల్లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారు. చాలా మందికి తెలిసిన విషయం ఏంటంటే.. అంతకంటే ముందే, అంటే మార్చి 5న పాన్ ఇండియా వైడ్ ఒక భారీ తుపాను రాబోతోంది. అదే.. సందీప్ రెడ్డి వంగా, రెబల్ స్టార్ ప్రభాస్ కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' యానిమల్' తర్వాత సందీప్ వంగా నుంచి వస్తున్న సినిమా కావడంతో పాటు, ఇప్పటికే విడుదలైన ఆడియో టీజర్, ఫస్ట్ లుక్ పోస్టర్ 'స్పిరిట్'పై అంచనాలను భారీగా పెంచేశాయి. వచ్చే ఏడాది అందరికన్నా ముందే సినిమా రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేయడంతో మిగతా హీరోలు తమ సినిమాలను వాయిదా వేసుకుంటారు. కానీ, సల్మాన్ ఖాన్ మాత్రం పక్కాగా అదే వారంలో బరిలోకి దిగుతున్నారు. 'స్పిరిట్' రిలీజ్ అయిన కేవలం 5 రోజుల గ్యాప్‌లోనే సల్మాన్ సినిమా రావడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. ఈ 5 రోజుల గ్యాప్ అనేది రెండు సినిమాలపై ప్రభావం చూపుతుంది. 'స్పిరిట్'కు టాక్ పాజిటివ్‌గా వస్తే, ఆ ప్రభంజనాన్ని తట్టుకోవడం సల్మాన్ సినిమాకు చాలా కష్టం. ఒకవేళ 'స్పిరిట్' ఏ కారణం చేతనైనా వాయిదా పడితే మాత్రం సల్మాన్ ఖాన్‌కు అది పెద్ద అడ్వాంటేజ్ అవుతుంది.




## గాయపడ్డ సింహంలో పులిహోర పాట

'గాయపడ్డ సింహం' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు తరుణ్ భాస్కర్. ఆయన.. ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి నాయకానాయికలుగా నటించిన ఈ సినిమాని కశ్యప్ శ్రీనివాస్ తెరకెక్కించారు. పవన్ సాదినేని సమర్పణలో సప్తస్వ మీడియా వర్క్స్, పీఓవీ స్టోరీస్, జీ స్టూడియోస్ సంస్థలు నిర్మించాయి. ఈ చిత్రం మే 1న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. 'ప్రేమకి పులిహోర కలిపామా.. ఇలాగ రాచేసి.. పెళ్లికి రూటే వేశామా.. మరోటి జతచేసి' అంటూ సరదాగా సాగిన ఈ పాటకు స్వీకర్ అగస్తీ స్వరాలతో పాటు సాహిత్యమందించారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. ఇందులో తరుణ్ – మానసల కెమిస్ట్రీ ఆకర్షణగా నిలిచింది. ఇది ఆద్యంతం వినోదాత్మకంగా సాగే ఓ ట్రెండీ కథతో రూపొందిన సినిమా. దీనికి సూర్య ప్రకాశ్ జ్యోసుల కథ అందించగా.. విద్యా సాగర్ చింత ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు.




## టాక్సిక్‌లో యాక్షన్ సన్నివేశాలు అదుర్స్

దర్శకురాలు గీతూమోహన్ ప్రతిభ అద్భుతం అన్న యశ్ యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'టాక్సిక్' ఈ సినిమా టీజర్ విడుదలైన నాటి నుంచి చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. 'టాక్సిక్'లోని సన్నివేశాల గురించి యశ్ ఇటీవల సినిమాకాన్ వేడుకలో మాట్లాడారు. ఈ యాక్షన్ చిత్రాన్ని ఒక మహిళా దర్శకురాలు తెరకెక్కిస్తు న్నందువల్ల సరికొత్తగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా దర్శకురాలు గీతూ మోహన్ దాస్‌పై ప్రశంసలు కురిపించారు. 'సాధారణంగా గ్యాంగ్‌స్టర్ డ్రామాలు అంటే పురుష దర్శకులే బాగా చేస్తారనే భావన చాలామందిలో ఉంటుంది. కానీ, ఈ గ్యాంగ్‌స్టర్ కథను ఒక మహిళా కోణంలో చూపించడం అనేది చాలా కొత్తగా ఉంటుంది. ఇందులోని శృంగార సన్నివేశాల నుంచి యాక్షన్ సీన్స్ వరకు ప్రతి దానిలోనూ ఆమె ఆలోచనలు చాలా స్పష్టంగా ఉన్నాయి. సున్నితమైన భావాలను ఎంత హృద్యంగా చూపించారో.. యాక్షన్ సన్నివేశాలను కూడా అదే స్థాయిలో తెరకెక్కించారు. అన్నిరకాల భావోద్వేగాలను లేడీ డైరెక్టర్ ఇంత బాగా ప్రజెంట్ చేయగలరా అని ఆమెతో ప్రయాణించాకే నాకు అర్థమైంది. ఇందులోని సన్నివేశాలు గతంలో చూడనివిధంగా విభిన్నంగా ఉంటాయి. గీతూ గొప్ప రచయిత కూడా.. ఆమె నుంచి నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నాను' అని యశ్ అన్నారు. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. యశ్ సరసన ఐదుగురు హీరోయిన్స్ నటిస్తున్నారు. మొదట ఈ చిత్రాన్ని మార్చిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని అనుకున్నారు. కొన్ని కారణాల వల్ల జూన్ 4కు వాయిదా పడింది.




## మెక్సికోలో వారణాసి సందడి

### భారతీయ పురాణగాథలకు యాక్షన్ మేళవింపు రాజమౌళి వీడియో వైరల్

భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కలయికలో రూపుదిద్దుకుంటున్న భారీ బ్జడెట్ చిత్రం 'వారణాసి'. ఈ చిత్రం తాజాగా మెక్సికో సిటీలో జరుగుతున్న అతిపెద్ద పాప్ కల్చర్ ఫెస్టివల్ లో సందడి చేసింది. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో ప్రదర్శించిన ఫస్ట్ గ్లింప్స్ చూసి అంతర్జాతీయ ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఇక ఈ వేడుకకు రాజమౌళి స్వయంగా హాజరు కాలేకపోయినప్పటికీ, ఆయన పంపిన ప్రత్యేక వీడియో సందేశం ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. మెక్సికో అభిమానులందరికీ నమస్కారం! 'వారణాసి' కేవలం ఒక సినిమా మాత్రమే కాదు.. అదొక అద్భుతమైన సాహసయాత్ర. భారతీయ పురాణ గాథలను , ప్రపంచస్థాయి యాక్షన్‌తో మేళవించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం అని రాజమౌళి పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ సినిమాలో మహేశ్ బాబును రాజమౌళి చూపిస్తున్న విధానంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రపంచ ప్రేక్షకులు మునుపెన్నడూ చూడని ఒక కొత్త మహేశ్‌ను ఈ సినిమాలో చూస్తారు అని జక్కన్న భరోసా ఇవ్వడం గమనార్హం. గ్లింప్స్‌లో మహేశ్ బాబు పొడవాటి జుట్టు, రఫ్ గడ్డంతో చాలా కరుకుగా కనిపించారు. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలో షూట్ చేసిన యాక్షన్ సీక్వెన్స్ హాలీవుడ్ స్థాయిని మించి ఉన్నాయని అక్కడి ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com